


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+20 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 93

సోమవారం 24-6-2019




**యాప్స్‌తో ఈజీ**
స్టాక్స్, ఫండ్స్, ఇన్సూరెన్స్, ఎన్‌పీఎస్‌లలో పెట్టుబడులు – బిజినెస్‌లో



**పాకిస్తాన్ ఘన విజయం**
ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా ఖేల్ ఖతం – స్పోర్ట్స్‌లో


SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




## పేద తల్లులు.. పిల్లల్ని ఏ బడికి పంపినా

# అమ్మ ఒడి

**రాష్ట్ర ప్రభుత్వం స్పష్టీకరణ**



- సందేహాలు, అపోహలకు తావులేదు
- అక్షరాస్యత శాతం పెంపొందింపే లక్ష్యం

పిల్లల్ని బడికి పంపే ప్రతి పేద తల్లికి ఏటా ఇచ్చే మొత్తం **రూ.15,000**

**సాక్షి, అమరావతి:** ప్రతి పేద తల్లి పిల్లల్ని ఏ బడికి పంపినా అమ్మ ఒడి పథకాన్ని వర్తింప చేస్తామని ముఖ్య మంత్రి కార్యాలయం స్పష్టం చేసింది. అమ్మ ఒడి పథకానికి సంబంధించి కొద్ది రోజులుగా భిన్నాభి ప్రాయాలు కొనసాగుతున్న నేపథ్యంలో వాటన్నింటికీ తెరదించుతూ ముఖ్యమంత్రి కార్యాలయం ఆదివారం ఈ ప్రకటన చేసింది. 'అమ్మ ఒడి' విషయంలో ఎలాంటి సందేహాలు, అపోహలకు తావులేదని పేర్కొంది. ఈ పథకం అమలుకు సంబంధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇప్పటికే పలు సందర్భాల్లో స్పష్టంగా, ఎలాంటి సందేహాలకు ఆస్కారం లేకుండా వివరించారని తెలిపింది. బడిబాట, అక్షరాభ్యాసం కార్యక్రమాల సందర్భంగా, ఎడ్యుకేషన్ రివ్యూ మీటింగ్‌లోనూ స్పష్టీకరించారని వివరించింది. పేద తల్లులు తమ

మిగతా 2వ పేజీలో ▶

## అమెరికా నివేదికపై భారత్ ఆగ్రహం

**మతస్వేచ్ఛ నివేదికపై కేంద్రం ఖండన**

- అంతర్జాతీయ మతస్వేచ్ఛపై అమెరికా విడుదల చేసిన నివేదికపై భారత ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. భారతదేశంలోని ప్రజల రాజ్యాంగహక్కుల గురించి మాట్లాడే అర్హత ఓ విదేశీ ప్రభుత్వానికి లేదని ఘాటుగా వ్యాఖ్యానించింది.

- వివరాలు 5లో

## మరో మూడు రోజులపాటు ఓ మోస్తరు వానలు

తగ్గుముఖం పట్టిన పగటి ఉష్ణోగ్రతలు

వివరాలు 2లో

## నలుగురు ఉగ్రవాదుల హతం

జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

వివరాలు 5లో

# ఇంటి నుంచే ఇసుక బుకింగ్



## ఏపీ ఇసుక విధానం ఖరారు

- చిన్న చిన్న నదుల్లో ఉచితమే
- ఏపీఎండీసీకి పెద్ద నదుల్లో ఇసుక క్వారీలు
- సరఫరా బాధ్యత ఈ సంస్థదే
- ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే చాలు
- సాగునీటి ప్రాజెక్టుల పనులకు డీసిల్టేషన్ ఇసుక
- పట్టా భూముల అంశంపై రెండు ఐచ్ఛికాలు
- గిరిజన ప్రాంతాల్లో ఇసుకపై వారికే హక్కు
- కొత్త విధానంతో ఇసుక మాఫియాకు చెక్



**ఇసుక కావాల్సిన వారు బుకింగ్ కోసం ఏపీఎండీసీ శాండ్ పోర్టల్‌ను క్లిక్ చేస్తే చాలు సమగ్ర వివరాలు ఉంటాయి. రాష్ట్రంలోని ఏయే స్టాక్ యార్డుల్లో ఎంతెంత ఇసుక నిల్వ ఉందో కూడా అందులో కనిపిస్తుంది. సమీప ప్రాంతంలోని స్టాక్ యార్డు నుంచి ఇసుక సరఫరా కోసం బుక్ చేసుకోవచ్చు.**

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో ఇసుక కోసం ఇక మాఫియా గ్యాంగులను ఆశ్రయించాల్సిన అవసరం లేదు. అక్కడ ఎంత ధర ఉంది? ఇక్కడ ఎంత రేటు ఉంది? అని వాకబు చేయాల్సిన అవసరమూ లేదు. రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) ఇకపై ఇసుకను సరసమైన ధరలకు అందించనుంది. రాష్ట్రంలో ఎక్కడకు ఇసుక కావాలన్నా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే చాలు నేరుగా కోరిన ప్రాంతానికే సరఫరా చేసే ఏర్పాట్లను ఈ సంస్థ చేస్తుంది. ఏపీఎండీసీ శాండ్ పోర్టల్‌లోకి వెళ్లి రాష్ట్రంలోని ఏ ప్రాంతం నుంచి అయినా ఇసుకను బుక్ చేసుకోవచ్చు. ఈ మేరకు ప్రభుత్వం ఇసుక సరఫరాకు కొత్త విధాన ముసాయిదా (పాలసీ) రూపొందించింది. గత అయిదేళ్లుగా టీడీపీ నాయకులు సాగిస్తున్న ఇసుక

మిగతా 2వ పేజీలో ▶

## గ్రామ వలంటీర్ల నియామకానికి నోటిఫికేషన్ జారీ



**జిల్లాల వారీగా నోటిఫికేషన్లు జారీ చేసిన కలెక్టర్లు**

12 జిల్లాల్లోని వలంటీర్ పోస్టులు **1,70,543**

ప్రత్యేక వెబ్‌పోర్టల్ ద్వారా దరఖాస్తుకు అవకాశం

- ఒక్కరోజే దాదాపు లక్షన్నర మంది వెబ్‌పోర్టల్ సందర్శన
- నెల్లూరు జిల్లాలో నేడు నోటిఫికేషన్ జారీ
- పట్టణాల్లో వార్డు వలంటీర్ల నియామకానికి వేరుగా నోటిఫికేషన్లు

2 లో

## మీ తప్పులకు మేము బలవ్వాలా?

**ఏపీపీఎస్సీపై నిరుద్యోగ అభ్యర్థుల మండిపాటు**

- ఇటీవలి పలు నిర్ణయాలపై నిరసనలు
- నోటిఫికేషన్‌లో పేర్కొనేది ఒకటి.. తర్వాత చేసేదొకటి
- ప్రశ్నల అనువాదం తప్పులతడక
- మెయిన్స్‌కు ఎంపిక నిష్పత్తిపైనా వివాదం
- గ్రూప్–1 లోపాలపై న్యాయస్థానంలో వ్యాజ్యం

4 లో









## నవరత్నాల అమలే ప్రధాన అజెండా

ప్రధాన సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రభుత్వ ప్రాధామ్యాలకు అగ్ర ప్రాధాన్యం



- ముఖ్యమైన అంశాలన్నింటికీ స్థానం
- సుపరిపాలనకు మార్గనిర్దేశం చేయనున్న సీఎం వైఎస్ జగన్
- నేడు మొదటిసారిగా కలెక్టర్లతో సమావేశం

2 లో

## ధరల చెల్లింపులో దబాయింపు!

ఒప్పందాల్ని కాలరాస్తున్న బడా పేపర్ మిల్లులు

- సుబాబుల్, జామాయిల్, సరుగుడు రైతుల లబోదిబో
- టన్నుకు చెల్లించాల్సింది రూ.4,400.. ఇచ్చేది మాత్రం రూ.2,400
- ఒక్కో రైతుకూ ఏటా రూ.25 వేల వరకూ నష్టం

4 లో








## కామాంధుల అరెస్టు

ఒంగోలులో బాలికపై గ్యాంగ్ రేప్ కేసులో నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

- నిందితుల్లో ముగ్గురు మేజర్లు.. ముగ్గురు మైనర్లు
- 24 గంటల్లో కేసును ఛేదించిన ప్రకాశం జిల్లా పోలీసులు
- బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని మంత్రి బాలినేని ఆదేశం



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

వివరాలు 2లో

## రాజస్తాన్‌లో కూలిన పందిరి

**14 మంది దుర్మరణం | 50 మందికి గాయాలు**

విచారణకు ఆదేశించిన సీఎం అశోక్ గహ్లోత్

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం

ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, రాహుల్ దిగ్భ్రాంతి



ఘటనా స్థలిలో కూలిన పందిర్లు

5 లో

## ఇథియోపియా ఆర్మీ చీఫ్ హత్య

అంగరక్షకుడే కాల్చి చంపాడని ప్రభుత్వం వెల్లడి

5 లో






# ఇంటి నుంచే ఇసుక బుకింగ్




## గిరిజన ప్రాంతాల్లో సొసైటీలకే అధికారం

గిరిజన ప్రాంతాల్లోని ఇసుక తరలింపు కోసం పంచాయతీ రాజ్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియాస్ (పీసా) చట్టం కచ్చితంగా పాటిస్తారు. ఇక్కడి ఇసుకపై గిరిజనులకే హక్కు ఉంటుంది. అందువల్ల ఇక్కడ ఇసుక తరలింపు బాధ్యతను గిరిజన సొసైటీలకే అప్పగిస్తారు. జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని సొసైటీలకు ఇసుక తవ్వకాలు, తరలింపునకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని మాత్రం ఏపీఎండీసీ అందిస్తుంది. ఇందుకు సంబంధించి సమయానుకూలంగా నియమ నిబంధనలను జిల్లా కలెక్టర్లు జారీ చేస్తారు.

▶ మొదటి పేజీ తరువాయి

మాఫియాకు చెక్ పెట్టడం, ప్రజలపై ఎలాంటి అదనపు భారం పడకుండా ప్రభుత్వ రాబడి పెంచడం లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు పాత పాలసీని రద్దుచేసి కొత్త పాలసీ రూపొందించింది. ప్రజలకు పారదర్శక సుపరిపాలనే అజెండాగా పెట్టుకున్న కొత్త ప్రభుత్వం ఇసుక రేవులను ప్రయివేటు వ్యక్తుల కబంధ హస్తాల నుంచి తప్పించి ప్రభుత్వ అధీనంలో ఉంచాలని నిర్ణయించుకుని ఆంధ్రప్రదేశ్ ఇసుక విధానం (ముసాయిదా) – 2019ను రూపొందించింది. దీనిని ముఖ్యమంత్రి పరిశీలనకు పంపించి ఆమోదం పొందనున్నారు. అనంతరం కేబినెట్ ఆమోదంతో జీఓ జారీ చేయడం ద్వారా కొత్త విధానం అమల్లోకి వస్తుంది.

### పెద్ద నదులన్నీ ఏపీఎండీసీకే

కృష్ణా, గోదావరి, తుంగభద్ర, పెన్నా, వంశధార లాంటి పెద్ద నదుల్లో (4, 5, అంతకంటే ఎక్కువ స్థాయి రివర్ స్ట్రీమ్స్‌లో) ఇసుక తవ్వకాలు జరిపి ప్రజలకు సరసమైన ధరకు విక్రయించే బాధ్యతను ప్రభుత్వం ఏపీఎండీసీకి అప్పగిస్తుంది. ఇసుక తవ్వకాలు జరపడానికి చట్టబద్ధమైన, పర్యావరణ, ఇతర అనుమతులన్నీ జిల్లా కలెక్టర్లే తీసుకుంటారు. ఏపీఎండీసీ నోడల్ ఏజెన్సీగా ఉంటూ ప్రజలకు అవసరమైన ఇసుకను అందించే ఏర్పాట్లు చేస్తుంది. రేవుల నుంచి ఇసుకను తవ్వి ప్రజలకు (వినియోగదారులకు) అందించడానికి వీలుగా ఏపీఎండీసీతో ఆయా జిల్లా కలెక్టర్లు ఒప్పందాలు కుదుర్చుకుంటారు. నదుల్లో తవ్విన ఇసుకను సమీపంలో స్టాక్ యార్డుల్లో ఏపీఎండీసీ నిల్వ చేస్తుంది. రాష్ట్రంలో 395పైగా పెద్ద పెద్ద ఇసుక రేవులు ఉన్నాయి. అయితే వీటిలో ప్రస్తుతానికి వందలోపు రీచ్‌లకు మాత్రమే పర్యావరణ, ఇతర చట్టబద్ధమైన అనుమతులు ఉన్నాయి. మిగిలిన వాటికి కూడా ఆయా జిల్లా కలెక్టర్లు పర్యావరణ, మైనింగ్ ప్లాన్, రీచ్ ఏర్పాటు, నిర్వహణ తదితర అనుమతులు తీసుకుంటారు. అన్ని రకాల అనుమతులు ఉన్న క్వారీల సమీపంలో ఏపీఎండీసీ ఇసుక స్టాక్ యార్డులు (నిల్వ కేంద్రాలు) ఏర్పాటు చేస్తుంది. క్వారీల్లో ఇసుక తవ్వకాలు సాగించి స్టాక్ యార్డులకు వాహనాల్లో తరలించేందుకు కాంట్రాక్టర్ల ఎంపిక కోసం ఏపీఎండీసీ టెండర్లు పిలుస్తుంది. ఎలాంటి అక్రమాలకు, ఆశ్రిత పక్షపాతానికి వీలు లేకుండా పూర్తి పారదర్శకంగా ఉండేలా రివర్స్ టెండరింగ్ విధానం అవలంబిస్తుంది. స్టాక్ యార్డుల నుంచి ప్రజలకు ఇసుకను అందించనుంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో దాదాపుగా ఇలాంటి విధానమే అమల్లో ఉంది. అక్కడ ప్రస్తుతం టన్ను ఇసుక రూ.400 చొప్పున అమ్ముతున్నారు. ఇసుక తవ్వకం, లోడింగ్ తదితరాలకు అయ్యే ఖర్చును దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో కూడా ఇదే ధరను పెట్టాలని అధికారులు ప్రతిపాదించారు. (ప్రభుత్వ తుది నిర్ణయం ప్రకారం ధర మారవచ్చు.)

### చిన్న చిన్న నదుల్లో ఉచితమే

చిన్న చిన్న నదులు, వాగుల్లో ఇసుకను ప్రజలు సొంత అవసరాల కోసం ఉచితంగా తీసుకెళ్లవచ్చు. చిన్న చిన్న నదులు (వన్ టు థర్డ్ ఆర్డర్ రివర్ స్ట్రీమ్స్) జిల్లా అధికార యంత్రాంగం పర్యవేక్షణలోనే ఉంటాయి. వీటి నుంచి స్థానిక ప్రజలు సొంత అవసరాలకు ఇసుకను ఉచితంగా తీసుకెళ్లవచ్చు. బలహీన వర్గాల గృహ నిర్మాణ పనులకు కూడా వీటి నుంచి ఉచితంగా ఇసుకను తీసుకెళ్లవచ్చు. పేదల ప్రయోజనార్థం ప్రభుత్వం ఈ వెసులుబాటు కల్పించాలని నిర్ణయించింది. చిన్న తరహా ప్రభుత్వ పనులకు సీనరేజి ఫీజు చెల్లించి వీటి నుంచి ఇసుక తీసుకెళ్లవచ్చు. వీటిలో ఇసుక తవ్వకం, లోడింగ్‌కు యంత్రాలను వినియోగించరాదు. మండల పరిధిలోని పట్టణాలు, గ్రామాలకు మాత్రమే వీటి నుంచి ఇసుకను తీసుకెళ్లవచ్చు. మండలం దాటి ఇసుకను ఈ చిన్న నదుల నుంచి తీసుకెళ్లకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుంది.

### వెబ్‌సైట్ క్లిక్ చేస్తే...

ఇసుక కావాల్సిన వారు బుకింగ్ కోసం ఏపీఎండీసీ శాండ్ పోర్టల్‌ను క్లిక్ చేస్తే చాలు సమగ్ర వివరాలు ఉంటాయి. రాష్ట్రంలోని ఏయే స్టాక్ యార్డుల్లో ఎంతెంత ఇసుక నిల్వ ఉందో కూడా అందులో కనిపిస్తుంది. సమీప ప్రాంతంలోని స్టాక్ యార్డు నుంచి ఇసుక సరఫరా కోసం బుక్ చేసుకోవచ్చు. ఉదాహరణకు కృష్ణా జిల్లా నందిగామ వాసులు ఇసుక కావాలంటే నందిగామ స్టాక్ యార్డు నుంచి బుక్ చేసుకోవచ్చు. దీనివల్ల రవాణా వ్యయం చాలా తక్కువగా ఉంటుంది. డీజిల్ ధర, ఇతర అంశాలను ప్రాతిపదికగా చేసుకుని కిలోమీటరుకు ఇంతని ఏపీఎండీసీ అధికారులే ఇసుక రవాణాకు రేటు నిర్ణయిస్తారు. ఈ ధరతో ఇసుక రవాణా చేసే వాహనాల వారందరికీ ఏపీఎండీసీ ఇసుక సరఫరా పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తారు. ఏ రీచ్ నుంచి ఇసుక కావాలో క్లిక్ చేయగానే ధర వస్తుంది. ఆ మొత్తాన్ని ఆన్‌లైన్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్ కార్డు, ఇతర విధానాల ద్వారా నేరుగా రాష్ట్ర ఖజానాకు చెల్లించగానే వారికి ఇసుక బుకింగ్ అయినట్లు రిసీప్ట్ వస్తుంది. ఏపీఎండీసీలో శాండ్ ట్రాన్స్‌పోర్టేషన్ అని క్లిక్ చేస్తే ఎక్కడెక్కడ వాహనాలు ఉన్నాయో (యాప్ ద్వారా ఓలా కార్లు /ఆటోలు బుక్ చేసుకుంటే కనిపించినట్లుగా) కనిపిస్తాయి. సమీపంలోని వాహనాన్ని బుక్ చేసుకుంటే చాలు కోరిన ప్రాంతానికి ఇసుకను తీసుకొస్తుంది. ఇసుక కోసం ఆన్‌లైన్‌లో చెల్లించిన మొత్తమంతా ప్రభుత్వ ఖజానాకు చేరుతుంది. క్వారీ నుంచి ఇసుకను స్టాక్ యార్డుకు చేర్చడం లాంటి పనులకు అయిన మొత్తంతోపాటు కొంత సొమ్మును నిర్వహణ ఖర్చుల కింద యూజర్ ఏజెన్సీ అయిన ఏపీఎండీసీకి ప్రభుత్వం చెల్లిస్తుంది. మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు వినియోగిస్తుంది.

### సాగునీటి ప్రాజెక్టుల పనులకు డీసిల్టేషన్ ఇసుక

నీటి పారుదల ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, బ్యారేజీల్లో వరద నీటితోపాటు ఇసుక వచ్చి పేరుకుంటుంది. దీనివల్ల నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతుంటుంది. అందువల్ల వీటిలో డీసిల్టేషన్ ద్వారా ఇసుక వెలికి తీయడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెంచాల్సి ఉంటుంది. జల వనరుల శాఖ ఇలా వెలికి తీసిన ఇసుకను సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు వినియోగించుకోవాలి. జల వనరుల శాఖ డీసిల్టేషన్ ద్వారా ఇసుకను తవ్వడానికి అవసరమైన అనుమతులతో పాటు ఇసుక దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలి. ఇసుక తోడినందుకు సీనరేజి చార్జీలతోపాటు ఇతరత్రా పన్నులను గనుల శాఖకు చెల్లించాల్సి ఉంటుంది. ఇసుక తరలింపునకు కూడా ట్రాన్సిట్ పాసులను భూగర్భ గనుల శాఖ సహాయ సంచాలకుల నుంచి పొందాలి. ఒకవేళ రిజర్వాయర్లలో పేరుకున్న ఇసుకను తోడే బాధ్యతను జల వనరుల శాఖ అధికారులు జిల్లా కలెక్టర్‌కు అప్పగిస్తే వారు తవ్వించిన ఇసుకను ఏపీఎండీసీకి అప్పగించాలి. డీసిల్టేషన్‌కు అయిన మొత్తాన్ని ఏపీఎండీసీ చెల్లిస్తుంది. ఇందుకు కొన్ని విధి విధానాలు ఉన్నాయి.

### పట్టా భూముల్లో ఇలా..

నదీ పరిసర ప్రాంతాల్లో రైతులకు సంబంధించిన పట్టా భూముల్లో ఒక్కోసారి ఇసుక మేటలు వేస్తుంది. వరదల సమయంలో ఇలా పట్టా భూములు ఇసుక రేవుల్లా మారతాయి. ఇలాంటి భూముల్లో ఇసుకను తవ్వి విక్రయించడానికి రైతులతో ఏపీఎండీసీ ఒప్పందాలు చేసుకోవచ్చు. ఇలా తవ్విన ఇసుక అమ్మగా వచ్చిన మొత్తంలో 10 శాతాన్ని భూ యజమానులైన రైతులకు ఇస్తారు. ఒకవేళ రైతులే నేరుగా తమ భూముల్లో ఇసుక తవ్వుకుంటామని కోరితే అనుమతిస్తారు. ఏపీఎండీసీ నిర్ణయించిన కనీస ధరతోపాటు వారు విక్రయించే అదనపు ధరలో 5 శాతాన్ని ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది.

### కృత్రిమ ఇసుక తయారీకి ప్రోత్సాహం

పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా నదులలో ఇసుక ఉత్పత్తి పెరగడం లేదు. అందువల్ల భవిష్యత్తులో సహజ సిద్ధమైన ఇసుక కొరత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంది. అందువల్ల నదీ ఇసుకకు ప్రత్యామ్నాయంగా కృత్రిమ (రోబో) శాండ్ తయారీని ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కృత్రిమ ఇసుకను మాన్యుఫ్యాక్చర్డ్ (ఎం) శాండ్ అంటారు. ఎం.శాండ్‌ను తయారు చేసే సంస్థలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. ప్రభుత్వ సంస్థలు కనీసం 50 శాతం కృత్రిమ ఇసుకను కచ్చితంగా వినియోగించాలనే నిబంధన కూడా పెట్టనున్నారు. కృత్రిమ ఇసుక తయారీకి ప్రస్తుతం ఉన్న ప్రోత్సాహకాలను ఇంకా పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది.

### సర్కారు ఆదాయం పెంపే లక్ష్యం

గత ప్రభుత్వ హయాంలో ఉచిత ఇసుక పేరుతో రవాణా కాంట్రాక్టర్ల అవతారం ఎత్తిన టీడీపీ నాయకులు శాండ్ మాఫియాకు తెరలేపారు. ముడుపులివ్వందే ఎవరినీ ఇసుక రేవుల్లోకి రానీయలేదు. వారు చెప్పిన మొత్తం ఇస్తేనే ఇసుక సరఫరా చేస్తూ వచ్చారు. ఇలా వేల కోట్ల రూపాయలు దండుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలపై ఎలాంటి అదనపు భారం పడకుండా ఇసుకను సరఫరా చేయడం ద్వారా ప్రభుత్వ రాబడిని పెంచడం లక్ష్యంగా వైఎస్ జగన్ సర్కారు కొత్త విధాన ముసాయిదా రూపొందించింది.

# నవరత్నాల అమలే ప్రధాన అజెండా

- ప్రధాన సమస్యల పరిష్కారమే లక్ష్యం
- ప్రభుత్వ ప్రాధామ్యాలకు అగ్ర ప్రాధాన్యం
- ముఖ్యమైన అంశాలన్నింటికీ స్థానం
- సుపరిపాలనకు మార్గనిర్దేశం చేయనున్న సీఎం వైఎస్ జగన్
- నేడు మొదటిసారిగా కలెక్టర్లతో సమావేశం



**సాక్షి, అమరావతి:** ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన నవరత్నాల హామీల అమలు, ప్రధాన సమస్యల పరిష్కారం, అవినీతి రహిత పారదర్శక సుపరిపాలన ముఖ్యమైన అజెండాలుగా నేడు (సోమవారం) కలెక్టర్ల సదస్సు జరగనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో తొలి కలెక్టర్ల సమావేశం ఉండవల్లిలోని ప్రజావేదికలో నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎన్నికల మేనిఫెస్టోను బైబిల్, ఖురాన్, భగవద్గీతలా పవిత్రంగా భావిస్తామని, ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసి తీరుతామని వైఎస్ జగన్ గత నెల 30న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడే ప్రకటించిన విషయం తెలిసిందే. అదే రోజు వృద్ధులు, వితంతువులు, తదితరులకు పింఛన్‌ను రూ.2,000 నుంచి రూ.2,250కి పెంచుతూ సంతకం చేశారు. ఇలా ఆరంభమైన హామీల అమలు ప్రక్రియ తొలి కేబినెట్ సమావేశంతో వేగం పుంజుకుంది. ఆశా కార్యకర్తల గౌరవ వేతనాన్ని రూ.3 వేల నుంచి రూ.10 వేలకు, పారిశుధ్య కార్మికులకు వేతనాన్ని రూ.18 వేలకు పెంచడంతోపాటు ప్రభుత్వ ఉద్యోగులకు మధ్యంతర భృతిని జూలై నుంచి 27 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. రైతు భరోసా కింద ప్రతి రైతు కుటుంబానికి సాగు ఖర్చులకు రూ.12,500 వచ్చే ఏడాది మే నుంచి ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొనగా ఈ ఏడాది రబీ నుంచే ఇవ్వాలని నిర్ణయించారు. ఇలా ప్రతి అంశంపై స్పష్టతతో ముందుకెళుతున్న సీఎం వైఎస్ జగన్ తన ప్రభుత్వ ప్రాధామ్యాలు వివరించడంతోపాటు పాలన ఎలా ఉండాలో నేడు జరిగే కలెక్టర్ల సమావేశంలో వారికి మార్గనిర్దేశం చేయనున్నారు.

**సుస్పష్టమైన అజెండా..**

గతానికి పూర్తి భిన్నంగా కలెక్టర్ల సదస్సును సత్ఫలితాలనిచ్చే చర్చా కేంద్రంగా వినియోగించుకోవాలని సీఎం వైఎస్ జగన్ నిర్ణయించుకున్నారు. కలెక్టర్ల సదస్సుకు ఖరారు చేసిన అజెండానే దీనికి నిదర్శనమని సీనియర్ ఐఏఎస్ అధికారులు చెబుతున్నారు. 'గత ఐదేళ్లలో ఐదు మిషన్లు, ఎనిమిది గ్రిడ్లు, కన్వర్జెన్స్, సంతులిత వృద్ధి, సంతృప్త స్థాయి అంటూ కేవలం గణాంకాలు, టేబుళ్లు, గ్రాఫిక్స్‌తో ఎవరికీ ఏమీ అర్థం కాని విధంగా, నిర్దేశిత లక్ష్యం లేకుండా కలెక్టర్ల సదస్సులు జరుగుతూ వచ్చాయి. క్షేత్ర స్థాయిలో సమస్యలను ప్రస్తావించడానికి అధికారులు, ఒకరిద్దరు మంత్రులు ప్రయత్నించినా మీరు అర్థం చేసుకోవడం లేదు. మనం లక్షలాది మందికి ఫోన్ చేస్తే వారు ఇలా చెప్పారంటూ బుకాయిస్తూ, నోరు మూయిస్తూ వచ్చారు. దీంతో సమస్యలను చెప్పడమే మానేసిన మంత్రులు, కొందరు అధికారులు సీఎం చంద్రబాబును పొగడటం, ఆయన తాను హైదరాబాద్‌ను అభివృద్ధి చేశానని, హైటెక్ సిటీని కట్టానంటూ స్వోత్కర్షగా సాగుతూ వచ్చాయి. కానీ వైఎస్ జగన్ ప్రభుత్వం తొలి కలెక్టర్ల సదస్సుకే స్పష్టమైన అజెండా ఖరారు చేసింది. ప్రజలకు ఇచ్చిన నవరత్నాల అమలు సీఎం తన తొలి ప్రాధాన్యమని చెబుతున్నారు. వీటి అమలే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారు. సదస్సు అజెండాలో కూడా నవరత్నాల అమలుకు తీసుకోవాల్సిన చర్యలను చేర్చారు. అత్యంత ముఖ్యమైన వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో తేవాల్సిన మార్పులు, తీసుకోవాల్సిన చర్యలకు ప్రాధాన్యం ఇచ్చారు. వచ్చే ఉగాది నాటికి 25 లక్షల మంది మహిళలకు ఇంటి స్థల పట్టాలివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్న సీఎం ఇందుకు ఏమి చేయాలో దిశానిర్దేశం చేయాలని రెవెన్యూ శాఖను ఆదేశించారు. ఇందులో భాగంగానే రెవెన్యూ శాఖ అధికారులు ఇళ్ల స్థల పట్టాల జారీకి అర్హుల ఎంపిక, విధివిధానాలను ప్రధాన అజెండాగా చేర్చారు. భూ యజమానులకు నష్టం జరగకుండా కౌలు రైతులకు న్యాయం చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమల్లో భాగంగా వారికి రుణ అర్హత కార్డుల జారీ, ఇతర చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని రెవెన్యూ శాఖను ఆదేశించారు. దీంతో ఈ దిశగా కలెక్టర్లకు దిశా నిర్దేశం చేయాలని రెవెన్యూ, వ్యవసాయ శాఖలు ఈ అంశాన్ని ప్రాధాన్య అంశంగా చేర్చాయి. 108, 104 అంబులెన్సుల సేవలను మెరుగుపరుస్తామని ఇచ్చిన హామీ అమలు దిశగా ఇప్పటికే వైద్య రంగంలో సంస్కరణల కోసం నిపుణుల కమిటీని వేసిన సీఎం.. కలెక్టర్లకు దిశానిర్దేశం కోసం అజెండాలో ప్రాధాన్యం కల్పించారు. తొలి కలెక్టర్ల సదస్సు అజెండా చాలా సుస్పష్టంగా, ప్రాధామ్యాల ప్రకారం ఉంది. ఇది కొత్త సీఎంకు ఉన్న విజన్‌కు నిదర్శనం' అని పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులు పేర్కొన్నారు.

### తొలి చర్చ గ్రామ సచివాలయాలపైనే..

గ్రామ సచివాలయాల ఏర్పాటు ద్వారా గ్రామ పంచాయతీల్లో పారదర్శక పాలన అందించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఇందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశంతోనే కలెక్టర్ల సదస్సులో తొలి చర్చకు శ్రీకారం చుడుతుండటం గమనార్హం. తెల్ల రేషన్‌కార్డు ఉండి, వైద్య ఖర్చులు రూ.1,000 దాటితే వారిని ఆరోగ్యశ్రీలోకి తీసుకురావడంతోపాటు 104, 108 అంబులెన్సు సేవలను మెరుగుపర్చాలని సీఎం కీలక నిర్ణయం తీసుకున్నందున కలెక్టర్ల సదస్సులో దీన్ని రెండో అంశంగా చేర్చారు. కరవు నేపథ్యంలో వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల్లో తీసుకోవాల్సిన చర్యలు, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి పరిస్థితి, తదితర అన్ని అంశాలను ఆయా శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు/ ముఖ్య కార్యదర్శులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సదస్సులో వివరించనున్నారు. వర్షాలు ఆరంభమైన నేపథ్యంలో పంటల సాగుకు ప్రభుత్వం అందించాల్సిన సహకారం, సబ్సిడీ విత్తనాలు, ఎరువుల సరఫరా చర్యలను తెలియజేస్తారు. సోమవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర భూపరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ మన్మోహన్ సింగ్ స్వాగతోపన్యాసంతో కలెక్టర్ల సదస్సు ప్రారంభమవుతుంది. తర్వాత సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం కొత్త ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలు, అధికారులు అనుసరించాల్సిన విధివిధానాలపై దిశానిర్దేశం చేస్తారు. ఆ తర్వాత డిప్యూటీ సీఎం, రెవెన్యూ శాఖ మంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ ప్రారంభోపన్యాసం, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రసంగం ఉంటాయి. అనంతరం సీఎం వైఎస్ జగన్ కీలకోపన్యాసం ద్వారా ప్రభుత్వ ప్రాధాన్యాలు, అధికారులు ఎలా వ్యవహరించాలనే అంశాలపై దిశానిర్దేశం చేస్తారు. తర్వాత పరిపాలనలో గ్రామ సచివాయాలు, గ్రామ వలంటీర్ల వ్యవస్థ ఎలా ఉండాలన్న అంశంపై పంచాయతీరాజ్, పురపాలక పట్టణాభివృద్ధి శాఖల ముఖ్య కార్యదర్శులు గోపాలకృష్ణ ద్వివేది, శ్యామలరావు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇస్తారు. వైద్య రంగంపై వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, నిత్యావసర సరుకుల డోర్ డెలివరీపై ఆ శాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్యపై ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్, కరవు నేపథ్యంలో తీసుకుంటున్న, తీసుకోవాల్సిన చర్యలపై లైన్ డిపార్టుమెంట్ల అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరిస్తారు. వీటిపై చర్చ ముగిసిన తర్వాత శాంతి భద్రతలపై కలెక్టర్లు, ఎస్పీల సంయుక్త సమావేశం ఉంటుంది.

## పేద తల్లులు.. పిల్లల్ని ఏ బడికి పంపినా

# అమ్మ ఒడి

▶ మొదటి పేజీ తరువాయి

పిల్లల్ని ఏ బడికి పంపినా అందరికీ అమ్మ ఒడి వర్తిస్తుందని వైఎస్ జగన్ తన 3,648 కిలోమీటర్ల పాదయాత్రలో తెలిపారని, ఈ దృష్ట్యా పేద పిల్లలు చదివేది ప్రభుత్వ లేదా ప్రైవేట్ పాఠశాల అయినా అమ్మ ఒడి వర్తిస్తుందని సీఎం కార్యాలయం స్పష్టం చేసింది.

**పేదల పిల్లలందరూ చదువుకోవాలి**

రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలన్నింటి స్థితిగతుల్ని, రూపురేఖల్ని మారుస్తామని ముఖ్యమంత్రి ఇంతకు ముందే ప్రకటించారని, ప్రభుత్వ బడుల్ని మెరుగుపరిచే దిశగా అన్ని చర్యలూ త్వరలో ప్రారంభం కాబోతున్నాయని సీఎం కార్యాలయం వివరించింది. 'దేశంలో నిరక్షరాస్యుల సగటు 26 శాతం ఉంటే ఏపీలో 33 శాతం ఉంది. అంటే మన రాష్ట్రంలో ప్రతి 100 మందిలో 33 మంది చదువుకోని వారే. అక్షరాస్యత విషయంలో మన రాష్ట్రం దేశంలో అట్టడుగున ఉంది. ఈ పరిస్థితిని మార్చి, పేదల పిల్లల్లో ప్రతి ఒక్కరూ బడికి వెళ్లి చదువుకోవాలన్న ఉద్దేశంతో అమ్మఒడి పథకాన్ని ప్రకటించారు. ఈ పథకం విషయంలో ఎలాంటి సందేహాలు, అపోహలకు తావు లేదు' అని స్పష్టం చేసింది. ఎన్నికల హామీల మేరకు మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా పిల్లల్ని బడికి పంపే ప్రతి తల్లికి సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలతో సంవత్సరానికి రూ.15 వేలు అందిస్తామని విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మరో ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలో విధివిధానాలు ప్రకటిస్తామన్నారు. మేనిఫెస్టోలో పొందుపరిచిన ప్రతి హామీ అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

## మరో 3 రోజులపాటు ఓ మోస్తరు వానలు

**తగ్గుముఖం పట్టిన పగటి ఉష్ణోగ్రతలు**

**సాక్షి, విశాఖపట్నం/సామర్లకోట/ఒంగోలు/కర్నూలు(అగ్రికల్చర్):** రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల ప్రభావంతో పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఈనెల 21న అవి రాష్ట్రంలోకి ప్రవేశించగా ఆ వెంటనే రాష్ట్రమంతటా విస్తరించడం తెలిసిందే. ఇవి శుక్ర, శనివారాలు బలంగా ఉండడంతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిశాయి. ఆదివారం సాధారణ ప్రభావం చూపుతున్నాయి. మరోవైపు.. రాజస్థాన్ నుంచి ఛత్తీస్‌గఢ్, ఒడిశాల మీదుగా తూర్పు మధ్య బంగాళాఖాతం వరకు 0.9 కిలోమీటర్ల ఎత్తువరకు ఉపరితల ద్రోణి విస్తరించి ఉంది. అలాగే, ఛత్తీస్‌గఢ్ పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. వీటితో పాటు రుతుపవనాల ప్రభావంతో రానున్న మూడు రోజులు కోస్తాంధ్రలో పలుచోట్ల, రాయలసీమలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఆదివారం రాత్రి తన నివేదికలో తెలిపింది.

**'తూర్పు'లో పిడుగుపాటుకు కూలీ మృతి**

తూర్పు గోదావరి జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం గూడపర్తికి చెందిన వ్యవసాయ కూలీ పిడుగుపాటుకు మృతి చెందాడు. కొండేపూడి అప్పలరాజు (45) ఆదివారం ఉదయం పుట్టా సాయిబాబు పొలంలో పనికి వెళ్లాడు. అయితే, ఉరుములతో కూడిన వర్షం రావడం, పిడుగు పడటం ఒక్కసారిగా జరగడంతో అప్పలరాజు తలకు తీవ్రగాయమవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అలాగే, ప్రకాశం జిల్లాలోనూ శనివారం అర్ధరాత్రి దాటాక పలుచోట్ల వర్షం కురిసింది. ఇక ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గంలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఆదివారం కురిసిన వర్షానికి పలు వాగులు పొంగిపొర్లాయి. పెద్దదోర్నాల మండలంలో తీగలేరు ఉధృతంగా ప్రవహించింది. నల్లవాగు పొంగటంతో జమ్మిదోర్నాల రహదారిలోని చప్టాపై భారీగా వరద నీరు ప్రవహించింది. కర్నూలు జిల్లాలోనూ వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు 29 మండలాల్లో వర్షాలు కురిశాయి. అత్యధికంగా పాములపాడులో 85.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. మరోవైపు.. రాష్ట్రంలో వర్షాలు కురుస్తుండడంతో గరిష్ట ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గాయి.

## గ్రామ వలంటీర్ల నియామకానికి నోటిఫికేషన్ జారీ

- 12 జిల్లాల్లో 1,70,543 వలంటీర్ పోస్టులు
- నెల్లూరు జిల్లాలో నేడు నోటిఫికేషన్ జారీ
- నేడు వార్డు వలంటీర్ల నియామకానికి నోటిఫికేషన్

**సాక్షి, అమరావతి:** గ్రామ వాలంటీర్ల నియామకానికి 12 జిల్లాల్లో ఆయా జిల్లాల కలెక్టర్లు ఆదివారం నోటిఫికేషన్ జారీ చేశారు. నెల్లూరు జిల్లాలో నోటిఫికేషన్ సోమవారం వెలువడనుంది. గ్రామాల్లో ప్రతి 50 కుటుంబాలకు ఒకరు చొప్పున వలంటీర్లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఏ జిల్లాలో ఎంతమంది గ్రామ వలంటీర్లను నియమించుకోవాలన్న దానిపై ఆయా జిల్లాల కలెక్టర్లకు అధికారమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు నెల్లూరు మినహా మిగిలిన 12 జిల్లాల్లో మొత్తం 1,70,543 గ్రామ వలంటీర్ల నియామకానికి కలెక్టర్లు నోటిఫికేషన్లు జారీ చేశారు. గ్రామ వలంటీర్ల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేసిన జిల్లాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెబ్‌పోర్టల్ ద్వారా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పంచాయతీ రాజ్ శాఖ అధికారులు సూచించారు. ఈ వెబ్‌పోర్టల్‌ను కేవలం ఒక్క రోజు వ్యవధిలోనే (ఆదివారం సాయంత్రం ఏడు గంటల సమయానికి) 1,47,376 మంది సందర్శించినట్లు అధికారులు చెబుతున్నారు. కాగా, పట్టణాల్లో 40 వేల వార్డు వలంటీర్ల నియామకాలకు సోమవారం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయనుంది. మంగళవారం జిల్లాల వారీగా వీటి నియామకానికి సంబంధించిన ప్రకటనలు రెండు దినపత్రికల్లో ప్రచురితం కానున్నాయి.

**నోటిఫికేషన్ వెలువడిన 12 జిల్లాల్లో నియమించే వలంటీర్ల సంఖ్య**

| జిల్లా | గ్రామాలు | వలంటీర్లు |
|---|---|---|
| శ్రీకాకుళం | 1,141 | 11,924 |
| విజయనగరం | 919 | 10,012 |
| విశాఖపట్నం | 924 | 12,272 |
| తూర్పు గోదావరి | 1,072 | 21,600 |
| పశ్చిమ గోదావరి | 909 | 17,881 |
| కృష్ణా | 980 | 14,000 |
| గుంటూరు | 1,031 | 17,550 |
| ప్రకాశం | 1,038 | 14,106 |
| చిత్తూరు | 1,372 | 15,824 |
| కర్నూలు | 909 | 12,045 |
| వైఎస్సార్ | 791 | 9,322 |
| అనంతపురం | 1,029 | 14,007 |
| నెల్లూరు | (నోటిఫికేషన్ సోమవారం వస్తుంది) | |
| మొత్తం | 12,115 | 1,70,543 |

# కామాంధుల అరెస్టు

- ఒంగోలులో బాలికపై గ్యాంగ్ రేప్ కేసులో నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- నిందితుల్లో ముగ్గురు మేజర్లు.. ముగ్గురు మైనర్లు
- 24 గంటల్లో కేసును ఛేదించిన ప్రకాశం జిల్లా పోలీసులు
- బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని మంత్రి బాలినేని ఆదేశం



సామూహిక అత్యాచారం కేసులో నిందితులను (ముసుగులో ఉన్న వ్యక్తులు) చూపుతున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

**ఒంగోలు/ సాక్షి, అమరావతి:** బాలికపై సామూహిక లైంగిక దాడి కేసును ఒంగోలు పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. నిందితులను అరెస్టు చేసి, మీడియా ముందు ప్రవేశపెట్టారు. తల్లి మందలించిందని ఇల్లు విడిచి ఒంగోలు చేరుకున్న బాలికను ఆరుగురు యువకులు మభ్యపెట్టి గ్యాంగ్ రేప్‌నకు పాల్పడిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసులో ముగ్గురు మైనర్లు సహా మొత్తం ఆరుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రకాశం జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ ఆదివారం ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో మీడియాకు ఘటన వివరాలు వెల్లడించారు.

**నమ్మించి నయవంచన**

గుంటూరు జిల్లా నల్లచెరువుకు చెందిన బాలిక ఈ ఏడాది మేలో విజయవాడలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తన తాతయ్యకు సాయంగా ఉండేందుకు వెళ్లింది. అదే సమయంలో ఒంగోలులో కారు డ్రైవర్‌గా పనిచేసే అమ్మిశెట్టి రాము అదే ఆసుపత్రికి ఓ పేషెంట్‌ను తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య పరిచయం ఏర్పడింది. పరస్పరం ఫోన్ నంబర్లు మార్చుకున్నారు. తరచూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. ఈ విషయం తెలిసిన బాలిక తల్లి జూన్ 15న కుమార్తెను మందలించింది. దీంతో మనస్తాపం చెందిన బాలిక రాముకు ఫోన్ చేసి, తాను ఒంగోలుకు వస్తున్నట్లు చెప్పింది. 16వ తేదీ రాత్రి 7 గంటలకు ఒంగోలు బస్టాండ్‌కు చేరుకుంది. రామును కలిసేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. బస్టాండ్‌లో కేఆర్ మొబైల్స్ దుకాణంలో పనిచేసే రెండు చేతులు లేని దివ్యాంగుడైన షేక్ బాజీని రాముకు కాల్ చేసేందుకు ఫోన్ ఇవ్వమని అభ్యర్థించింది. షేక్ బాజీ ఫోన్ ఇచ్చినట్లే ఇచ్చి బాలికను మొబైల్స్ దుకాణం వెనుక భాగంలో ఉన్న సర్వీసింగ్ రూమ్‌లోకి బలవంతంగా తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. 17వ తేదీ అర్ధరాత్రి బాజీ, అతడి స్నేహితులైన ఆవుల శ్రీకాంత్‌రెడ్డి, మరో మైనర్ బాలుడు షాపులోకి వచ్చి బాలికతో మాట కలిపారు. రాము వద్దకు తీసుకెళతామని నమ్మబలికి ఓ గదిలోకి తీసుకెళ్లి సామూహికంగా లైంగిక దాడికి పాల్పడ్డారు. బయటకు రాకుండా గదిలోనే నిర్బంధించారు. 19వ తేదీన బాజీ, శ్రీకాంత్‌రెడ్డి, మైనర్ బాలుడు బయటకు వెళ్లిపోయారు. తర్వాత మహేష్ అనే వ్యక్తి, మరో ఇద్దరు మైనర్లు వచ్చి బాధితురాలిపై లైంగిక దాడికి దిగారు. ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు బాలికపై ఈ అరాచకం కొనసాగించారు. 22న తెల్లవారుజామున 3 గంటల సమయంలో మైనర్లలో ఒకడు ఆమెను ఒంగోలు బస్టాండ్ వద్దకు తీసుకొచ్చి ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించి వెళ్లిపోయాడు. బస్టాండ్ ఆవరణలో ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ సంచరిస్తున్న బాధితురాలిని గమనించిన హోంగార్డు వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ సీతారామయ్య దృష్టికి తీసుకెళ్లాడు. ఆయన వెంటనే శక్తి టీమ్‌ను అప్రమత్తం చేసి, బాలిక నుంచి విషయం రాబట్టారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో వేట ప్రారంభించారు.

**మైనర్లపై జువైనల్ చట్టం ప్రకారం చర్యలు**

బాలికపై లైంగిక దాడి కేసులో మొత్తం ఆరుగురు నిందితులను అరెస్టు చేశామని, వారిలో ముగ్గురు మైనర్లు అని ప్రకాశం జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ చెప్పారు. మైనర్లపై జువైనల్ చట్టం ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. మేజర్లయిన మైనంపాడుకు చెందిన ప్రధాన నిందితుడు షేక్ బాజీ, యం.నిడమానూరుకు చెందిన రెండో నిందితుడు రావుల శ్రీకాంత్‌రెడ్డి, ఆరో నిందితుడైన మద్దిపాడు మండలం పెద్దకొత్తపల్లికి చెందిన పాత్ర మహేష్‌లను అరెస్టు చేశామన్నారు. బాలిక అదృశ్యమైనట్లు గుంటూరు లాలాపేట పోలీసుస్టేషన్‌లో ఈ నెల 19న కేసు నమోదైనట్లు వెల్లడించారు. నిందితులపై 'పోస్కో' చట్టం కింద కేసు నమోదు చేశామన్నారు. కాగా, నిందితులను చట్టప్రకారం కఠినంగా శిక్షిస్తామని డీజీపీ గౌతం సవాంగ్ ఓ ప్రకటనలో తెలిపారు.

### బాధితురాలికి మంత్రి బాలినేని పరామర్శ

అత్యాచార ఘటనలో నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఒంగోలు రిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితురాలిని ఆయన ఆదివారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి అధికారులను ఆదేశించారు. బాధితురాలికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. లైంగిక దాడి ఘటనపై రాష్ట్ర హోం మంత్రి మేకతోటి సుచరిత ఎస్పీ సిద్ధార్థ కౌశల్‌తో మాట్లాడారు. నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అత్యాచార ఘటన గురించి ఎస్పీ సిద్ధార్థ కౌశల్ రాష్ట్ర డీజీపీ గౌతం సవాంగ్‌కు వివరాలు తెలియజేశారు.

# జూలై 17న శ్రీవారి ఆణివార ఆస్థానం

- పుష్పపల్లకీపై ఊరేగనున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి
- 16న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



**తిరుమల:** తిరుమల శ్రీవారి ఆలయంలో జూలై 17న సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినం జరుగనుంది. జూలై 16న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. సాధారణంగా ఏటా సౌరమానం ప్రకారం దక్షిణాయన పుణ్యకాలంలో కర్కాటక సంక్రాంతినాడు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. అయితే సౌరమానాన్ని అనుసరించే తమిళుల కాలమానం ప్రకారం ఆణిమాసం చివరి రోజున నిర్వహించే కొలువు కావడంతో ఆణివార ఆస్థానం అని పేరు. పూర్వం మహంతులు దేవస్థాన పరిపాలనను స్వీకరించిన రోజు అయిన ఈ ఆణివార ఆస్థానం పర్వదినంనాటి నుంచి టీటీడీ వారి ఆదాయ వ్యయాలు, నిల్వలు తదితర వార్షిక లెక్కలు ప్రారంభమయ్యేవి. టీటీడీ ధర్మకర్తల మండలి ఏర్పడిన తర్వాత వార్షిక బడ్జెట్‌ను మార్చి, ఏప్రిల్ నెలలకు మార్చారు.

**జీయంగార్ల వస్త్ర సమర్పణ**

పెద్ద జీయంగార్ పెద్ద వెండితట్టలో ఆరు పెద్ద పట్టువస్త్రాలను తలపై పెట్టుకొని మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా విచ్చేస్తారు. వీటిలో నాలుగింటిని మూలమూర్తికి అలంకరిస్తారు. మిగిలిన రెండు వస్త్రాలలో ఒకటి మలయప్పస్వామికి, మరొకటి విష్వక్సేనులవారికి అలంకరిస్తారు. శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు తమ తలకు శ్రీవారి పాదవస్త్రంతో ''పరివట్టం'' (చిన్న పట్టుగుడ్డ) కట్టుకొని స్వామివారి ద్వారా బియ్యపు దక్షిణ స్వీకరించి 'నిత్యైశ్వర్యోభవ' అని స్వామివారిని ఆశీర్వదిస్తారు. తరువాత అర్చకులు పెద్ద జీయంగారికి, చిన్న జీయంగారికి, టీటీడీ తరపున కార్యనిర్వహణాధికారికి 'లచ్చన' అను తాళపు చెవి గుత్తిని వరుస క్రమంలో కుడిచేతికి తగిలిస్తారు. హారతి, చందనం, తాంబూలం, తీర్థం, శఠారి మర్యాదలు చేసిన అనంతరం ఆ తాళపు చెవి గుత్తిని శ్రీవారి పాదాలచెంత ఉంచుతారు.

**పుష్ప పల్లకీపై ఊరేగింపు**

ఆణివార ఆస్థానం సందర్భంగా సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి అత్యంత శోభాయమానంగా అలంకరించిన పుష్పపల్లకీపై తిరుమల పురవీధుల గుండా ఊరేగుతూ భక్తులకు కనువిందు చేస్తారు.

**ఉత్సవ విశిష్టత**

ఈ ఉత్సవం రోజున ఉదయం బంగారువాకిలి ముందు ఘంటా మండపంలో సర్వభూపాల వాహనంలో ఉభయదేవేరులతో కూడిన మలయప్పస్వామివారు గరుత్మంతునికి అభిముఖంగా కొలువుకు వేంచేపు చేస్తారు. మరో పీఠంపై స్వామివారి సర్వసైన్యాధ్యక్షుడైన శ్రీవిష్వక్సేనులవారు దక్షిణాభిముఖంగా వేంచేపు చేస్తారు. ఈ ఉత్సవమూర్తులతో పాటు ఆనందనిలయంలోని మూలవిరాట్టుకు ప్రత్యేక పూజలు, ప్రసాదాలు నివేదిస్తారు.

# మనసుకు హత్తుకునే 'మల్లేశం'

- విశాఖలో 'మల్లేశం' చిత్ర బృందం సందడి
- చేనేత కార్మికులకు సత్కారం



హీరో ప్రియదర్శి, హీరోయిన్ అనన్యలను సత్కరిస్తున్న మావూరి వెంకటరమణ

**మద్దిలపాలెం (విశాఖ):** 'మల్లేశం' సినిమా ఓ చేనేత కార్మికుడి అసమాన్య విజయగాథతో వెండితెరపై అవిష్కృతమైన అద్భుతమని హీరో ప్రియదర్శి పేర్కొన్నారు. సగటు చేనేత కార్మికుడి జీవన గమనంలో ఎదురయ్యే ఒడిదుడుకులను.. సినిమా చూసేవారిని కథలో ఒదిగిపోయేలా దర్శకుడు రాజ్.ఆర్ తెరకెక్కించారని చెప్పారు. మల్లేశం చిత్ర విజయోత్సవంలో భాగంగా విశాఖలోని మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్‌లో ఆదివారం కంచికామాక్షి డైరెక్టర్ మావూరి రాజేశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి యూనిట్ సభ్యులు హాజరయ్యారు. చేనేత కార్మికులను హీరో ప్రియదర్శి, హీరోయిన్ అనన్య, దర్శకుడు రాజ్.ఆర్ సత్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణను యూనిట్ సభ్యులు సత్కరించారు. హీరో ప్రియదర్శి మాట్లాడుతూ తెలంగాణ చేనేత కార్మికుడు చింతగింది మల్లేశం జీవితం ఆధారంగా కథను రూపొందించి వెండితెరపై ఆవిష్కరించారన్నారు. దర్శకుడు రాజ్.ఆర్ మాట్లాడుతూ కళ్లెదుట ప్రత్యక్షంగా జరుగుతున్న అనుభూతి ప్రేక్షకులలో కలిగేలా చూపించేందుకు చిత్ర యూనిట్ కృషి చేసిందన్నారు. కథలో ప్రియదర్శి నటన, అనన్య, ఝాన్సీ అభినయాలను అద్భుతంగా రక్తికట్టించారన్నారు.



ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌కు శ్రీవారి చిత్రపటం అందజేస్తున్న జేఈఓ శ్రీనివాసరాజు



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్

# శ్రీవారిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు సీజే

**ఇద్దరు న్యాయమూర్తులు కూడా..**



శ్రీవారి ఆలయం వద్ద జస్టిస్ విజయలక్ష్మి

**తిరుమల:** తిరుమల శ్రీవారిని ఆదివారం ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌తోపాటు ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ దుర్గాప్రసాద్, జస్టిస్ విజయలక్ష్మిలు వేరువేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామివారి దర్శనానంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా, తిరుమల శ్రీవారిని శాసనమండలిలో వైఎస్సార్‌సీపీ పక్షనేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన పాలన మొదలైందని, ప్రజలు ఎంతో సంతృప్తిగా ఉన్నారని అన్నారు. వర్షాలు కూడా ప్రారంభమయ్యాయని, ప్రతి కుటుంబానికీ మంచిరోజులు వచ్చాయని నమ్ముతున్నానన్నారు. ప్రజలు సంతోషంగా ఉండేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన ఉంటుందన్నారు.

# శారీరక దివ్యాంగ ఉద్యోగుల అడహాక్ కమిటీ ఎన్నిక

**గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్):** శారీరక దివ్యాంగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గం (అడహాక్) ఎన్నికైంది. విజయవాడలో ఆదివారం జరిగిన సంఘం కార్యవర్గ సమావేశంలో అడహాక్ కమిటీని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా ఎన్నగౌని తులసీరామ్ (చిత్తూరు), ప్రధాన కార్యదర్శిగా గారపాటి సతీష్ (పశ్చిమగోదావరి), కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కొండపల్లి శ్రీనివాస్ (కృష్ణా), కోశాధికారిగా నాగరత్నాలు (అనంతపురం) ఎన్నికయ్యారు. సహాధ్యక్షులుగా కాసాని బ్రహ్మేశ్వరరావు, వై.శ్రీనివాసరావు, ఎం.హరిప్రసాద్, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వరరెడ్డి, మోతుకూరి రవీంద్రబాబు, మురళీమోహన్, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎం.కె.మిశ్రా, సంయుక్త కార్యదర్శులుగా అచ్చయ్య, నరసింహారావు, గోపాలకృష్ణలను ఎన్నుకున్నారు.

# ఏఈఈల నూతన కార్యవర్గం ఎన్నిక

**రామవరప్పాడు (గన్నవరం):** జలవనరుల శాఖ సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ల (ఏఈఈ) అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని విజయవాడలో ఆదివారం ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి కె.బాబు ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా టి.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా డి.భార్గవ్ ప్రకాష్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పి.రాజేష్, కోశాధికారిగా ప్రవీణ్‌రాజా, ఉపాధ్యక్షులుగా ఓబుల్‌రెడ్డి, శంకర్, జాయింట్ సెక్రటరీలుగా ధన్‌కిషోర్, ఎల్.నాగేంద్ర, తేజకుమార్, ఎం.రవికుమార్‌లు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ ఇంజనీర్ల సమస్యలపై పోరాడతామన్నారు. క్షేత్రస్థాయిలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు వర్క్ ఇన్‌స్పెక్టర్లు, లస్కర్లను నియమించాలన్నారు. అసోసియేషన్‌కు అమరావతిలో స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# 'ఓబీసీ రిజర్వేషన్లకు బిల్లు పెట్టడం చారిత్రక నిర్ణయం'

**గాంధీనగర్ (విజయవాడసెంట్రల్):** జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ విజయసాయిరెడ్డి రాజ్యసభలో ప్రైవేటు బిల్లు పెట్టడం చారిత్రక నిర్ణయమని బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బోను దుర్గానరేష్ అన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 72 ఏళ్లు గడుస్తున్నా బీసీల సమస్యలను పట్టించుకున్న నాథుడే కరువయ్యాడన్నారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కోరుతూ పార్లమెంట్‌లో ప్రైవేటు బిల్లు పెట్టడంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ విజయసాయిరెడ్డికి బీసీలంతా జేజేలు పలుకుతున్నారన్నారు. దేశంలో 39 జాతీయ పార్టీలు ఉండగా వాటిలో ఏ ఒక్కటీ బీసీల పక్షాన గళం విప్పలేదని విమర్శించారు. బీసీ పార్టీలు అని చెప్పుకునే వారు బీసీలను ఓటు బ్యాంక్ రాజకీయాలకు వాడుకుని పబ్బం గడుపుకున్నారన్నారు. అనంతరం బీసీ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నరసింహారావును నియమించారు.

# ఎన్డీఆర్ఎఫ్ భవన నిర్మాణాలకు భూమి పూజ

- రూ.90 కోట్లతో నిర్మాణాలు



శంకుస్థాపన చేస్తున్న చీఫ్ ఇంజనీర్ పీకే నాయుడు

**గన్నవరం రూరల్:** ఎన్డీఆర్ఎఫ్ (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) ప్రధాన కార్యాలయాన్ని స్టేట్ ఆఫ్ ద హార్ట్ క్యాంపస్‌గా నిర్మిస్తున్నట్లు సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ చీఫ్ ఇంజనీర్ పీకే నాయుడు పేర్కొన్నారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కొండపావులూరులోని సర్వే నంబర్ 6లో ఎన్డీఆర్ఎఫ్‌కు కేటాయించిన 50 ఎకరాల్లో రూ.90 కోట్లతో నిర్మించే స్టాఫ్ క్వార్టర్స్ ఫేజ్–2, 3 భవన నిర్మాణాలకు ఆయన ఆదివారం భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 12 నెలల వ్యవధిలో 11 అంతస్తులు అందుబాటులోకి వస్తాయన్నారు. వీటిలో మల్టీస్టోర్డ్ నిర్మాణాలను వేగంగా నిర్మిస్తామన్నారు. 10వ బెటాలియన్‌లోని 1,149 మందికి అన్ని సదుపాయాలను ఈ క్యాంపస్‌లో కల్పిస్తామన్నారు. హెలిప్యాడ్, గెజిటెడ్ ఆఫీసర్స్ మెస్, ఎస్ఓఎస్ మెస్, సీనియర్ ఆఫీసర్ల భవనాలు, డ్రిల్ షెడ్, మోటార్ వెహికల్ క్యాంపస్, బ్యారెక్‌లు, డాగ్ కెనాల్, పరేడ్ గ్రౌండ్ నిర్మాణాలు జరుగుతాయన్నారు. మొత్తం 7 బ్లాక్‌లు నిర్మించాల్సి ఉందన్నారు.







**APSCHE : VIJAYAWADA**
**DEPARTMENT OF TECHNICAL EDUCATION**
**AP-EAMCET-2019 ADMISSIONS**
**(M P C STREAM)**
**NOTIFICATION**
**CERTIFICATE VERIFICATION & OPTION EXERCISING FOR WEB BASED COUNSELING**

The Qualified and eligible candidates of **AP EAMCET-2019** who are desirous of seeking admission into B.E/B.Tech/ Pharmacy Courses are informed that the web counseling process comprising of registration, certificate verification and option entry starts from **01-07-2019 to 09-07-2019.** For detailed notification containing the list of Help Line centres, Certificates to be produced for verification and schedule of counseling visit the website **https://apeamcet.nic.in**

Date : 24-06-2019
Place : Vijayawada

Sd/-
Sri KANTILAL DANDE, I.A.S.,
Convenor & CTE

**ANDHRA PRADESH**
**STATE ENERGY CONSERVATION MISSION(APSECM)**
2nd Floor, 33/11kV Indoor Substation Building, Museum Road, Vijayawada-520002.
Mobile : 8332959029,9963015797, 0866-2577620

**NOTICE INVITING TENDERS THROUGH e-PROCUREMENT**
**APSECM/Tender-1/ EA/ RWS PUMP SETS/ 2019-20**

Andhra Pradesh State Energy Conservation Mission, Govt of A.P & SDA under the EC Act, 2001 invites accredited energy auditing firms empanelled with APSECM and BEE, GoI, Ministry of power to carry out Investment Grade Energy Audit & Post installation Energy Audit for selected Pump sets of Rural Water Supply & Sanitation (RWS&S) Department in 10 Districts of A.P.

Tender documents regarding details of bidding process, eligibility criteria, previous Experience, Turnover of the agency and other conditions may be downloaded from the websites of AP Power utilities i.e., **www.apsecm.ap.gov.in** (or) **www.aptransco.gov.in** (or) **www.apeasternpower.com** (or) **www.apspdcl.in** (or) **www.apgenco.gov.in** (or) from **24.06.2019, 5 PM** onwards or through email by sending a request to **ceo.secm@gmail.com** . Also Tender documents are available on e-procurement website i.e., **www.apeprocurement.gov.in**

Last date of submission of filled in Tender Documents is: **23.07.2019, 5 PM.**

Place: Vijayawada
Date: 24-06-2019. R.O .No: 14/ Dt: 19-06-2019

Sd/-
A. Chandra Sekhara Reddy
CEO/APSECM-Vijayawada



## రాష్ట్రంలో 21 లక్షల సభ్యత్వ నమోదు లక్ష్యం

- జూలై 6 నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు మొదలు
- మిస్డ్‌కాల్ ఇవ్వడం ద్వారా సభ్యత్వ నమోదు
- 25న రాష్ట్ర స్థాయి సమావేశం

**సాక్షి, అమరావతి:** భారతీయ జనతా పార్టీ జూలై 6 నుంచి దేశవ్యాప్తంగా పార్టీ సంస్థాగత సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టనుంది. రాష్ట్రంలో కనీసం 21 లక్షల మందిని పార్టీ ప్రాథమిక సభ్యులుగా చేర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈనెల 17న పార్టీ సభ్యత్వ నమోదుపై జాతీయ స్థాయిలో జరిగిన సమావేశంలో పార్టీ పెద్దలు ఈ మేరకు రాష్ట్ర నేతలకు లక్ష్యం నిర్దేశించారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి రాష్ట్ర కన్వీనర్, కో–కన్వీనర్ల హోదాలో మాజీ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు, ఎమ్మెల్సీ మాధవ్ ఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తి ఆన్‌లైన్ ప్రక్రియలో మొబైల్ మిస్డ్ కాల్ విధానంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతుందని మాణిక్యాలరావు 'సాక్షి'కి తెలిపారు. జాతీయ పార్టీ ఆదేశాల మేరకు జిల్లాల వారీగా పార్టీ సభ్యత్వ నమోదు లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి ఈనెల 25న విజయవాడలో సమావేశం జరగనుంది. రాష్ట్ర నేతలతో పాటు జిల్లాల సభ్యత్వ నమోదు కన్వీనర్, కో–కన్వీనర్‌గా నియమితులైన వారు ఆ సమావేశంలో పాల్గొంటారు. ఈ నెల 26 నుంచి 30వ తేదీ మధ్య జిల్లా స్థాయిలో, జూలై 1 నుంచి 4వ తేదీ మధ్య మండల స్థాయిలో పార్టీ సమావేశాలు నిర్వహించి, 6వ తేదీ నుంచి అన్ని ప్రాంతాల్లో ఒకేసారి సభ్యత్వ నమోదు ఆరంభించడానికి రాష్ట్ర పార్టీ సన్నాహాలు చేసుకుంటోంది.

## ఆదర్శరైతు వ్యవస్థను పునరుద్ధరించాలి

### ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆదర్శ రైతు సంఘం వినతి



**తాడేపల్లిరూరల్ (మంగళగిరి):** ఆదర్శరైతు వ్యవస్థను పునరుద్ధరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆదర్శరైతు సంఘం అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు ఆదివారం గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సీఎం నివాసం వద్ద అధికారులకు వినతిపత్రం అందజేశారు. 2006లో వైఎస్ రైతుల శ్రేయస్సు కోరి ఆదర్శరైతు వ్యవస్థను ఏర్పాటు చేశారని, రాష్ట్రవ్యాప్తంగా 20 వేలమంది రైతులను ఆదర్శ రైతులుగా ఎంపిక చేసి వ్యవసాయశాఖ ద్వారా శిక్షణ ఇప్పించారని వినతి పత్రంలో పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వం ఆదర్శరైతు వ్యవస్థను రద్దు చేసిందని, ఈ వ్యవస్థను పునరుద్ధరించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

## బీఏఎస్‌లకు విద్యార్థుల ఎంపికపై నిర్లక్ష్యం

**సాక్షి, అమరావతి:** బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల(బీఏఎస్)లో విద్యార్థులను చేర్పించే విషయంలో గిరిజన సంక్షేమశాఖ అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఐదు, ఎనిమిది తరగతులకు సంబంధించి విద్యార్థులను బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో చేర్పించేందుకు ఎంట్రెన్స్ పరీక్షలు వేసవి సెలవుల్లో జరిగాయి. సాంఘిక సంక్షేమశాఖ నోడల్ ఏజెన్సీగా పరీక్షలు నిర్వహించింది. ఆ శాఖ విద్యార్థులను స్కూళ్లలో చేర్పించినా.. గిరిజన సంక్షేమశాఖ మాత్రం ఇంతవరకు చేర్పించనేలేదు.

**స్కూళ్ల కేటాయింపునకు ఇంకెంత సమయం పడుతుందో!**

గిరిజన సంక్షేమశాఖ 842 మందికి బీఏఎస్‌లలో అవకాశం కల్పిస్తోంది. జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో కొన్ని ప్రయివేటు స్కూళ్లను బెస్ట్ అవైలబుల్ స్కూళ్లుగా ఎంపిక చేస్తారు. ఈ స్కూళ్లకు ఎంపికైన విద్యార్థుల ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తుంది. స్కూళ్లు ప్రారంభమయ్యే నాటికి బీఏఎస్‌లలో గిరిజన విద్యార్థులను చేర్పించే కార్యక్రమం పూర్తయితే.. సీట్లు రాని వారు వేరే స్కూళ్లలో చేరేందుకు అవకాశం ఉంటుంది. ఎంట్రన్స్ పరీక్ష అనంతరం మెరిట్ జాబితాను ఆన్‌లైన్‌లో పెట్టడంలో అధికారులు ఆలస్యం చేశారు. అయితే శనివారం జాబితాను ఆన్‌లైన్‌లో పెట్టామని.. 28వ తేదీలోగా దరఖాస్తుకు అవకాశం కల్పించామని అధికారులంటున్నారు. దరఖాస్తులు తీసుకున్నాక స్కూళ్ల కేటాయింపునకు ఇంకెంత సమయం తీసుకుంటారోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

## విద్యారంగం ప్రభుత్వ అధీనంలోనే ఉండాలి

### రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

**గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్):** విద్యారంగం పూర్తిగా ప్రభుత్వాధీనంలోనే ఉండాలని, ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యను అందించాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి కోరారు. విజయవాడలో రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జాతీయ విద్యావిధానం–2019, డాక్టర్ కస్తూరి రంగన్ కమిటీ ముసాయిదా నివేదికపై రౌండ్‌టేబుల్ సమావేశం ఆదివారం జరిగింది. కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ జీడీపీలో విద్యారంగానికి 6 శాతం నిధులు కేటాయించాలని కోరారు. ఏపీ విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ రమేష్ పట్నాయక్, విద్యావేత్త గడ్డం కోటేశ్వరరావు, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జోసెఫ్ సుధీర్‌బాబు, నాగేశ్వరరావు, ఉపాధ్యాయవాణి సంపాదకుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## కార్మికులుగా గుర్తించాలి

**సూర్యారావుపేట (విజయవాడ సెంట్రల్):** మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు అప్పగించాలనే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, ఈ పథకం కింద పనిచేసేవారిని కార్మికులుగా గుర్తించాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ డిమాండ్ చేసింది. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంలో ఆ యూనియన్ రాష్ట్ర సదస్సు ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ ప్రభుత్వమే వర్కర్ల ద్వారా ఈ పథకాన్ని కొనసాగించాలని కోరారు.

## ఉద్దేశపూర్వకంగానే ఆరోపణలు

### టీడీపీ నేతల సమావేశంలో అచ్చెన్నాయుడు, యనమల

**సాక్షి, అమరావతి:** పోలవరం, రాజధాని నిర్మాణ పనుల్లో అవినీతి జరిగిందని ముఖ్యమంత్రి, మంత్రులు ఉద్దేశపూర్వకంగానే ఆరోపణలు చేస్తున్నారని, వాటిలో వాస్తవాలు లేవని టీడీపీ శాసనసభాపక్ష ఉప నేత అచ్చెన్నాయుడు అన్నారు. ఉండవల్లిలోని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నివాసంలో ఆదివారం పార్టీ సీనియర్ నాయకులు సమావేశమై తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. పోలవరం ప్రాజెక్టులో ఉన్న అవినీతి కొండను తవ్వుతానంటున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి.. అక్కడ చీమ, దోమను కూడా పట్టుకోలేరని అచ్చెన్నాయుడు చెప్పారు. యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ.. ఢిల్లీ వెళ్లి కేంద్రానికే పోలవరం ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి విజయవాడ వచ్చి తామే చేస్తున్నామని చెప్పారని విమర్శించారు. విదేశీ పర్యటనలో ఉన్న చంద్రబాబు సమావేశంలో పాల్గొన్న నాయకులతో ఫోన్‌లో మాట్లాడుతూ అవినీతిని టీడీపీకి అంటించాలని చూస్తున్నారని, అది వారికే చుట్టుకుంటుందన్నారు.

## వేరేవాళ్ల పేరుతో పరీక్ష రాస్తూ పట్టుబడ్డ ప్రభుత్వ ఉద్యోగులు

**వత్సవాయి (జగ్గయ్యపేట):** మరొకరి పరీక్ష రాస్తూ ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు పోలీసులకు పట్టుబడ్డ ఘటన తెలంగాణ రాష్ట్రం కోదాడలో ఆదివారం చోటుచేసుకుంది. మక్కపేటకు చెందిన అజ్మీరు వెంకటప్పయ్య, కవిత దంపతులు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు. ఆదివారం కోదాడలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూరవిద్య పరీక్షలు ఎంఎస్ కళాశాలలో జరుగుతున్నాయి. సల్మాన్ అనే వ్యక్తి పేరుపై వెంకటప్పయ్య, తిరుపతమ్మ పేరుపై కవిత పరీక్ష రాస్తోంది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఇద్దరిపై కేసులు నమోదు చేశారు.

## సర్వీసులు క్రమబద్ధీకరించాలి

### ఐకాస అధ్యక్షుడు బి.సురేష్

**ఏఎన్‌యూ (గుంటూరు):** ప్రభుత్వ సంస్థలు, యూనివర్సిటీల్లో విధులు నిర్వహిస్తున్న ఎన్ఎంఆర్, దినసరి వేతన, పార్ట్‌టైం ఉద్యోగుల సర్వీసులు క్రమబద్ధీకరించి వారికి న్యాయం చేయాలని ఎన్ఎంఆర్, దినసరి వేతన, కన్సాలిడేటెడ్, ఫుల్‌టైం, పార్ట్‌టైం, టైమ్‌స్కేల్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి (ఐకాస) రాష్ట్ర అధ్యక్షుడు బి.సురేష్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఆదివారం జరిగిన ఐకాస రాష్ట్ర సదస్సులో ఆయన మాట్లాడుతూ క్రమబద్ధీకరణ కాకుండానే పదవీ విరమణ చేసిన సిబ్బందికి ఫించన్ సౌకర్యం కల్పించాలని కోరారు.

# మీ తప్పులకు మేము బలవ్వాలా?

### ఏపీపీఎస్సీపై నిరుద్యోగ అభ్యర్థుల మండిపాటు

- ఇటీవలి పలు నిర్ణయాలపై నిరసనలు
- నోటిఫికేషన్‌లో పేర్కొనేది ఒకటి.. తర్వాత చేసేదొకటి
- ప్రశ్నల అనువాదం తప్పులతడక
- ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు ఎంపిక నిష్పత్తిపైనా వివాదం
- గ్రూప్–1 లోపాలపై న్యాయస్థానంలో వ్యాజ్యం

**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) అడ్డగోలు నిబంధనలు విధిస్తూ, వాటిని తరచూ మార్పు చేస్తూ తమ జీవితాలతో చెలగాటమాడుతోందని అభ్యర్థులు మండిపడుతున్నారు. ఏపీపీఎస్సీ తప్పులకు తాము బలవ్వాలా అని నిలదీస్తున్నారు. ఇప్పటికే మే 26న జరిగిన గ్రూప్–1 ప్రిలిమ్స్‌కు సంబంధించి కమిషన్ నిర్ణయంతో అన్యాయం జరిగిందని పలువురు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. గతేడాది డిసెంబర్ 31న విడుదల చేసిన గ్రూప్–1 నోటిఫికేషన్‌లో నాన్ ప్రోగ్రామబుల్ క్యాలిక్యులేటర్‌ను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి ఇస్తామని ఏపీపీఎస్సీ పేర్కొంది. అయితే.. పరీక్షకు వారం ముందు అనుమతించబోమని ప్రకటించింది. నాన్ ప్రోగ్రామబుల్ క్యాలిక్యులేటర్‌కు అనుమతి ఇవ్వకుండా పరీక్ష నిర్వహించడంతో నష్టపోయామని అభ్యర్థులు వాపోతున్నారు. అలాగే పరీక్షలో ఆంగ్లం నుంచి తెలుగులో అనువాదం చేసి ఇచ్చిన ప్రశ్నలు తప్పులతడకలుగా ఉండడంతో తీవ్రంగా నష్టపోయారు. వీటిపైనా అభ్యర్థులు న్యాయస్థానాలను ఆశ్రయించారు.

**డీఏవో పరీక్షకూ షరతులు**

జూలై 7న నిర్వహించే డివిజినల్ అకౌంట్స్ ఆఫీసర్ (డీఏవో) ప్రిలిమ్స్ పరీక్షకు కూడా క్యాలిక్యులేటర్ అనుమతి స్తామని నోటిఫికేషన్‌లో పేర్కొన్న ఏపీపీఎస్సీ శుక్రవారం అనుమతి ఇవ్వబోమని వెబ్‌నోట్ విడుదల చేసింది. నోటిఫికేషన్‌లో ఒకటి పేర్కొని పరీక్ష సమయంలో మరో నిర్ణయం తీసుకోవడం అన్యాయమని అభ్యర్థులు అంటున్నారు. క్యాలిక్యులేటర్‌ను అనుమతించబోమని నోటిఫికేషన్‌లో ముందే పేర్కొని ఉంటే దానికనుగుణంగా సన్నద్ధమయ్యేవారమని చెబుతున్నారు. ఇదంతా పరిశీలిస్తే.. సకాలంలో పరీక్షలు నిర్వహించకుండా కాలయాపన చేసేందుకు, అభ్యర్థులు కోర్టు మెట్లు ఎక్కేలా కావాలనే ఇలా చేస్తుందనే అనుమానాలను వ్యక్తపరుస్తున్నారు.

**అభ్యర్థుల ఎంపిక నిష్పత్తి పైనా..**

కాగా.. ఏపీపీఎస్సీ ఇంతకు ముందు తీసుకున్న నిర్ణయాలు కూడా అభ్యర్థులకు శాపంగా మారుతున్నాయి. గతంలో ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు 1:50 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసేవారు. కానీ.. ప్రభుత్వం జీవో నెంబర్ 5 ద్వారా అభ్యర్థుల నిష్పత్తిపై నిర్ణయాన్ని ఏపీపీఎస్సీకి అప్పగించింది. ఏ నిష్పత్తిలో ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు ఎంపిక చేస్తారో ఏపీపీఎస్సీ ముందుగా వెల్లడించడం లేదు. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్న సమయంలో గతంలోని నోటిఫికేషన్ పోస్టులకు అదనంగా 400 పోస్టులు జత చేసి 1:50 నిష్పత్తిలో ఎంపికకు అవకాశం కల్పించారని అభ్యర్థులు గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఉద్యోగాల సంఖ్య పెరగకపోయినా కనీసం మెయిన్స్‌కు అవకాశం కల్పించాలని నిరుద్యోగులు వేడుకుంటున్నా కమిషన్ వారి మొర ఆలకించడం లేదు. గతంలో గ్రూప్–1కు మాత్రమే స్క్రీనింగ్ టెస్ట్ ఉండగా ఇప్పుడు అన్నింటికీ ప్రిలిమ్స్‌ను తప్పనిసరి చేసింది. దీంతో అభ్యర్థులు ప్రిలిమ్స్‌కు, మెయిన్స్‌కు శిక్షణా కేంద్రాలను ఆశ్రయించాల్సి వస్తోంది.

**ఆప్టిట్యూడ్ ప్రశ్నలపైనా అదే తీరు**

యూపీఎస్సీ తరహా అంటూనే ఏపీపీఎస్సీ ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందని నిరుద్యోగులు మండిపడుతున్నారు. గతంలో యూపీఎస్సీ.. సివిల్ సర్వీస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (సీశాట్)ను ప్రవేశపెట్టింది. దీనిలో పూర్తిగా అర్థమెటిక్ అంశాలు ఉంటాయి. అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్‌కు చెందిన పరీక్షలో అర్థమెటిక్ అవసరం లేదని, మెంటల్ ఎబిలిటీ, లాజికల్ థింకింగ్ అంశాలు ఉంటే చాలని పలువురు అభిప్రాయపడ్డారు. అర్థమెటిక్ అంశాల వల్ల తమకు నష్టం జరుగుతుందని నాన్ మ్యాథ్స్ అభ్యర్థులు ఆందోళనలు చేశారు. దీంతో యూపీఎస్సీ సీ–శాట్ పేపర్‌ను కేవలం క్వాలిఫైయింగ్ పేపర్‌గా మార్చింది. కానీ ఇప్పుడు ఏపీపీఎస్సీ అదే ఆప్టిట్యూడ్ ప్రశ్నలను గ్రూప్–1లో ప్రవేశపెట్టడంతో నాన్ మ్యాథ్స్ అభ్యర్థులు అవస్థలు పడుతున్నారు.

**తెలుగులో ప్రశ్నలు ఇవ్వకుండా..**

కొన్ని కేటగిరీల పోస్టులకు ఆంగ్ల మాధ్యమంలోనే ప్రశ్నలు అడుగుతామని, తెలుగు మాధ్యమంలో ప్రశ్నలు ఉండవని నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత ప్రకటించడం కూడా వివాదాస్పదంగా మారింది. దీనివల్ల గ్రామీణ ప్రాంత అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతారు. యూపీఎస్సీ, బ్యాంకింగ్ నియామక సంస్థలే అన్ని ప్రాంతీయ భాషల్లో ప్రశ్నలు అడుగుతుండగా ఏపీపీఎస్సీ దీనికి భిన్నంగా వ్యవహరిస్తోంది. మరోపక్క కొన్ని కేటగిరీల్లో ఆంగ్ల మాధ్యమంతోపాటు తెలుగు మాధ్యమంలోనూ ప్రశ్నలు అడుగుతున్నా అనువాదంలో అనేక తప్పులు ఉండడంతో అభ్యర్థులు నష్టపోతున్నారు. ఇటీవల ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమ్స్ తెలుగు మాధ్యమ ప్రశ్నల్లో ఏకంగా 36 ప్రశ్నలు తప్పులతడకలుగా ఉండడంతో తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

**కమిషన్ చైర్మన్ తీరుపై నిరసన**

కాగా.. గతంలో ఎన్నడూ లేని వివాదాలు ప్రస్తుత చైర్మన్ పి.ఉదయభాస్కర్ హయాంలోనే ఏపీపీఎస్సీని చుట్టుముడుతున్నాయి. చంద్రబాబు సీఎంగా ఉండగా నియమితులైన ఈయన ప్రభుత్వ పెద్దల అండతో ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే విమర్శలున్నాయి. గతంలో గ్రూప్–2లో పేపర్ లీకేజీ ఆరోపణల వివాదంపై పలువురిపై అక్రమంగా కేసులు పెట్టించారని, ఇప్పటికీ విచారణకు రావాల్సిందిగా సీఐడీ నుంచి నోటీసులు వస్తున్నాయని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చైర్మన్‌ను తొలగించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుత చైర్మన్ హయాంలో తమకు న్యాయం జరగదని, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

# 28న జల వివాదాలపై చర్చ

**తెలుగు రాష్ట్రాల నిర్ణయం**

- తొలి దశలో రెండు ప్రభుత్వాల సీఎస్‌లు, జలవనరుల శాఖ అధికారుల భేటీ
- మలి దఫా సమావేశం కానున్న ఇద్దరు సీఎంలు వైఎస్ జగన్, కేసీఆర్
- తెలుగు రాష్ట్రాలను సస్యశ్యామలం చేసుకునే దిశగా చర్యలు



**సాక్షి, అమరావతి:** కృష్ణా, గోదావరి నదీ జలాల వినియోగంలో తెలుగు రాష్ట్రాల మధ్య ఉత్పన్నమైన వివాదాలను పరిష్కరించుకోవడానికి రెండు ప్రభుత్వాలు సిద్ధమయ్యాయి. ఈ నెల 28న తొలి దశలో రెండు ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులు, జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు భేటీ కానున్నారు. ఈ సమావేశంలో వెల్లడైన అంశాల ఆధారంగా ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కె.చంద్రశేఖరరావులు నిర్ణయం తీసుకుని మరోసారి భేటీ అయ్యి వివాదాలకు తెరదించాలని భావిస్తున్నారు. విశాఖ శ్రీ శారద పీఠం ఉత్తరాధికారిగా స్వాత్మానందేంద్రకు బాధ్యతల అప్పగింత కార్యక్రమంలో పాల్గొనడానికి ఈ నెల 17న తెలంగాణ సీఎం కేసీఆర్ విజయవాడకు వచ్చారు. అదే రోజున తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఏపీ సీఎం వైఎస్ జగన్‌తో తెలంగాణ సీఎం కేసీఆర్ సమావేశమయ్యారు. గోదావరి జలాల గరిష్ట వినియోగంతోపాటు నదీ జలాల వివాదాలను పరిష్కరించుకోవడం ద్వారా తెలుగు రాష్ట్రాలను సస్యశ్యామలం చేసుకునే అంశంపై ఇద్దరు సీఎంలూ చర్చించుకున్నారు. ఈ నెల 21న కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవ సందర్భంలోనూ ఇదే అంశంపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. ఇద్దరు ముఖ్యమంత్రుల ఆదేశాల మేరకు జల వివాదాలతోపాటు విభజన చట్టంలోని తొమ్మిది, పదో షెడ్యూలులోని 142 సంస్థల ఆస్తుల పంపకాలపై సమస్యలను పరిష్కరించుకోవడానికి తొలి దశలో రెండు రాష్ట్రాల ఉన్నతాధికారులు సమావేశమై చర్చించనున్నారు.

**కృష్ణా నీటి పంపకాలపై చర్చ**

కృష్ణా నదీ జలాల్లో 811 టీఎంసీలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు బచావత్ ట్రిబ్యునల్ కేటాయించింది. విభజన నేపథ్యంలో ఏపీ 512, తెలంగాణ 299 టీఎంసీలు వినియోగించుకునేలా కేంద్రం తాత్కాలిక ఏర్పాటు చేసింది. అయితే కృష్ణా నదీ జలాలను నాలుగు నదీ పరీవాహక రాష్ట్రాల మధ్య పునఃపంపిణీ చేయాలని ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. వీటిపై విచారణ చేసిన సుప్రీంకోర్టు.. జలాల పునఃపంపిణీకి నిరాకరించింది. ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన జలాలను ఇరు రాష్ట్రాలకు పంపిణీ చేయాలని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌ను ఆదేశించింది. కానీ ఇప్పటి వరకూ విచారణ పూర్తి కాలేదు. ఇరు రాష్ట్రాలు ఏకాభిప్రాయానికి రావడం ద్వారా కేసులు ఉపసంహరించుకుని, వివాదాలను పరిష్కరించుకుందామని తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రతిపాదిస్తూ వస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా కృష్ణా డెల్టాకు తరలించే 80 టీఎంసీల గోదావరి జలాలకుగాను కృష్ణా నీటిలో 14 టీఎంసీలు మహారాష్ట్ర, 21 టీఎంసీలు కర్ణాటక, మిగతా 45 టీఎంసీలు నాగార్జునసాగర్‌కు ఎగువన ఉమ్మడి ఏపీ అదనంగా వినియోగించుకోవచ్చునని గోదావరి ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు గోదావరి జలాలు తరలిస్తుండటం వల్ల.. కృష్ణా జలాల్లో అదనపు వాటా ఇవ్వాలని తెలంగాణ సర్కార్ 2015 నుంచి ప్రతిపాదిస్తోంది. తెలంగాణ రాష్ట్రం 240 టీఎంసీలకుపైగా గోదావరి జలాలను కృష్ణా నదీ పరీవాహక ప్రాంతానికి తరలిస్తోందని.. అందుకు గానూ కృష్ణా జలాల్లో అదనపు వాటా ఇవ్వాలని ఏపీ సర్కార్ కోరుతూ వస్తోంది. ఈ వివాదాలన్నిటిపై ఇరు రాష్ట్రాల అధికారుల మధ్య 28న చర్చ జరగనుంది.

**శ్రీశైలానికి గోదావరి నీటి తరలింపుపై చర్చలు**

రెండు రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శుల సమావేశంలో వెల్లడైన అంశాల ఆధారంగా మలి దఫా ఇరువురు ముఖ్యమంత్రులు సమావేశమై చర్చించనున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు గోదావరి జలాలను తరలిస్తే రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలను గాలేరు–నగరి, హంద్రీ–నీవా, తెలుగుగంగలతో, ప్రకాశం జిల్లాకు వెలిగొండ ప్రాజెక్టుల ద్వారా సమృద్ధిగా నీళ్లు అందించొచ్చు. తెలంగాణలో పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా పాత పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకూ గోదావరి నీటిని తరలించొచ్చని ఇద్దరు సీఎంలు అభిప్రాయపడుతున్నారు. శ్రీశైలాన్ని గోదావరి జలాలతో నింపితే అవసరాన్ని బట్టి నాగార్జునసాగర్‌కు తరలించి.. సాగర్ ఆయకట్టునూ కృష్ణా డెల్టానూ సస్యశ్యామలం చేయవచ్చునని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావిస్తున్నారు.

## చదువుతో పాటు క్రీడలను తప్పనిసరి చేయండి

- అధికారులకు మంత్రి అవంతి ఆదేశం
- ఘనంగా ఒలింపిక్ డే రన్



ఒలింపిక్ డే రన్‌లో మంత్రులు అవంతి, ధర్మాన, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు, ఎమ్మెల్యే విష్ణు తదితరులు

**విజయవాడ స్పోర్ట్స్:** విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలను తప్పనిసరి చేయాలని అధికారులను రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి అవంతి శ్రీనివాస్ ఆదేశించారు. ఫిట్‌నెస్ విషయంలో సీఎం వైఎస్ జగన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. 3,648 కి.మీ పాదయాత్ర చేయడానికి ఆయనలో ఉన్న ఫిట్‌నెస్ కూడా ఒక కారణమని అభిప్రాయపడ్డారు. విజయవాడలో ఆదివారం ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 'ఒలింపిక్ డే రన్'ను ఆయన ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధును ఏపీ క్రీడలకు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించాలని సీఎంను కోరతామన్నారు. ఆట స్థలాలు ఉన్న యాజమాన్యాలతో లేక.. స్కూల్స్‌తో ఎంఓయూ (పరస్పర అంగీకారం) చేసుకుంటేనే ఆట స్థలాలు లేని ప్రైవేటు స్కూళ్లకు గుర్తింపు ఇవ్వాలని, లేదంటే రద్దు చేయాలని జిల్లా కలెక్టర్లు, విద్యా శాఖాధికారులను మంత్రి ఆదేశించారు. ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, మంత్రి ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ క్రీడాకారులు అంతర్జాతీయ పోటీల్లో రాణించాలన్నారు. పీవీ సింధు మాట్లాడుతూ క్రీడలు, వ్యాయామాన్ని దినచర్యలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్కే పురుషోత్తం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, అంతర్జాతీయ ఆర్చర్ వెన్నం జ్యోతిసురేఖ, శాప్ ఎండీ కాటమనేని భాస్కర్, కృష్ణా జిల్లా కలెక్టర్ ఎండీ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో విత్తనాల కొరత లేదు

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కన్నబాబు స్పష్టీకరణ
- శ్రీకాకుళం, అనంతపురం జిల్లాల కలెక్టర్లతో మాట్లాడిన మంత్రి



**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో వేరుశనగ, వరి విత్తనాలకు కొరత లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కన్నబాబు స్పష్టం చేశారు. రైతులు ఒకే రకం వంగడం కోసం ఎక్కువ ఆసక్తి చూపిస్తుండం వల్ల అక్కడక్కడా బారులు తీరి నిలవాల్సి వస్తోందని తెలిపారు. విత్తనాల సేకరణలో ఆయిల్ ఫెడ్ అలసత్వం వహించి ఉండకపోతే ఈ చిన్న ఇబ్బంది కూడా ఉండేది కాదన్నారు. ఆదివారం శ్రీకాకుళం, అనంతపురం జిల్లాల కలెక్టర్లతో మంత్రి కన్నబాబు మాట్లాడి వాస్తవ స్థితిగతులను తెలుసుకున్నారు. అనంతపురం జిల్లాలో వేరుశనగ విత్తనాల కొరత లేదని, ఇప్పటికే 1.33 లక్షల క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేసినట్లు కలెక్టర్ వివరించారు. అయితే రైతులకు కావాల్సిన రకం విత్తనాలను సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం నుంచి జిల్లాకు అదనంగా మరో 9 వేల క్వింటాళ్ల విత్తనాలను పంపనున్నట్లు మంత్రి కన్నబాబు వెల్లడించారు. కడప, పులివెందులలో కూడా అదనపు విత్తనాలను పంపినట్లు తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో 1075 రకం వరి వంగడానికి బాగా గిరాకీ ఉందని, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని వ్యాపారుల నుంచి 10 వేల క్వింటాళ్లను సేకరించి రైతులకు పంపిణీ చేశారని ప్రశంసించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితిపై కూడా సంబంధిత అధికారులతో మంత్రి సమీక్షించారు.

# నాటు బాంబు పేలి వ్యక్తి మృతి

### చిత్తూరు జిల్లాలో ఘటన

**చిత్తూరు రూరల్:** చిత్తూరు జిల్లాలో ఆదివారం నాటు బాంబు పేలి వ్యక్తి మృతి చెందిన ఘటన కలకలం రేపింది. చిత్తూరు మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన సుధాకర్ (35) చిల్లర దుకాణం, బట్టల షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల క్వారీ, బండరాళ్లు కొట్టేందుకు కొన్ని పేలుడు పదార్థాలను తీసుకొచ్చి నాటు బాంబులు తయారు చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో చినుకులు పడటంతో ఇంటి మిద్దెపై ఉంచిన పేలుడు పదార్థాలను తెచ్చేందుకు సుధాకర్ వెళ్లాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా పెద్ద పేలుడు శబ్దం వచ్చింది. ఈ పేలుడు ధాటికి సుధాకర్ శరీర భాగాలు తునాతునకలై అర కిలోమీటర్ దూరం మేర ఎగిరిపడ్డాయి. అసలు ఏ భాగం ఎక్కడ పడిందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. బాంబు పేలిన శబ్దానికి గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు. తొలుత గ్యాస్ సిలిండర్ పేలి చనిపోయినట్లు ప్రచారం జరిగింది. కాసేపటికి పేలుడు పదార్థం వల్లే శబ్దం వచ్చినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. చిత్తూరు డీఎస్పీ వెంకట రామాంజనేయులు, టూటౌన్ సీఐ వెంకటకుమార్ ఘటన స్థలానికి చేరుకుని పేలుడు తీరును పరిశీలించారు. అక్కడ నాటు బాంబుకు చుట్టే కొన్ని రకాల తాడులు, పిల్లెట్స్‌ను పోలీసులు గుర్తించారు. ఒకవేళ జెలిటిన్ స్టిక్స్ ఏవైనా పేలాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పేలుడు ధాటికి రెండంతస్తుల మిద్దెపై కాంక్రీటు కూడా లేచిపోయింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

# ధరల చెల్లింపులో దబాయింపు!

## ఒప్పందాల్ని కాలరాస్తున్న బడా పేపర్ మిల్లులు

**సాక్షి, అమరావతి:** సుబాబుల్, జామాయిల్, సరుగుడు కర్రకు ధరలేక రైతులు లబోదిబోమంటున్నారు. బడా పేపర్ మిల్లులను కట్టడి చేయడంలో రాష్ట్రంలోని గత ప్రభుత్వం ఘోరంగా విఫలం కావడంతో వాళ్లు ఆడింది ఆట పాడింది పాటగా సాగుతోంది. అందరి సమక్షంలో కుదుర్చుకున్న కనీస ఒప్పంద ధరను సైతం ఇవ్వలేమని ఐటీసీ సహా ఇతర పేపర్ మిల్లులు తెగేసి చెబుతున్నాయి. ఫలితంగా జామాయిల్ రైతులు ఎకరానికి సుమారు 25 వేలు, సుబాబుల్ రైతులు ఎకరానికి రూ.20 వేలు ఏటా నష్టపోతున్నారు. ధరల వ్యవహారంలో కంపెనీలు రైతుల్ని ఏమాత్రం ఖాతరుచేయకుండా అగౌరవపరుస్తున్నాయని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. రాష్ట్రంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వమైనా తమ గోడు పట్టించుకోవాలని సుబాబుల్, జామాయిల్ రైతుల సంఘం కోరుతోంది.

**రాష్ట్రంలో 4 లక్షల ఎకరాలలో సాగు..**

రాష్ట్రంలో సుమారు 4 లక్షల ఎకరాలలో సుబాబుల్, జామాయిల్ (యూకలిప్టస్), సరుగుడు (చౌకలు) సాగవుతోంది. విశాఖ, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో వర్షాధారిత పంటగా వీటిని సాగుచేస్తున్నారు. మొత్తం సాగులో 40 శాతం వరకు ఒక్క ప్రకాశం జిల్లాలోనే ఉంది. వ్యవసాయశాఖ అంచనా ప్రకారం 80 వేల నుంచి లక్ష మంది వరకు ఈ తోటల్ని పెంచుతుంటారు. ఒకసారి ఈ మొక్కల్ని నాటితే పది పన్నెండేళ్ల పాటు ఉంచవచ్చు. వానలు ఉండి కాస్తంత సస్య రక్షణ చేస్తే మూడేళ్లలో తొలిసారి కర్ర కొట్టవచ్చు. మూడేళ్లకు కౌలు కలుపుకుని ఎకరానికి రూ.90 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చవుతుంది. అన్నీ సవ్యంగా ఉంటే 25 నుంచి 30 టన్నుల దిగుబడి వస్తుంది.

**మిల్లుల ఇష్టారాజ్యం.. ధరలు దారుణం**

2014కి ముందు సుబాబుల్, జామాయిల్ ధరలు టన్నుకు రూ. 4,400 నుంచి రూ.4,600 మధ్య ఉండేది. ఆ తర్వాత ధరలు క్రమేణా తగ్గడం మొదలుపెట్టాయి. దీంతో రైతులు ఆందోళనకు దిగడంతో టీడీపీకి చెందిన ఆనాటి వ్యవసాయ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు రైతులు, పేపర్ మిల్లుల ప్రతినిధులతో సమావేశమై కనీస ధరను రూ.4,600గా నిర్ణయించారు. అయితే, ఇందుకు మిల్లర్లు ప్రత్యేకించి ఐటీసీ వంటి కంపెనీలు ససేమిరా అనడమే కాకుండా రూ.4,000లకు మించి ఇవ్వలేమని భీష్మించాయి. ఈలోగా వ్యవసాయ మంత్రి మారిపోవడంతో రైతులు మళ్లీ మొరపెట్టుకున్నారు. జిల్లాకో రేటు పెట్టుకునేందుకు, తమ ఏజెంట్లతో కొనుగోలు చేయించేందుకు అనుమతివ్వాలని కంపెనీలు పట్టుబట్టి సాధించాయి. కంపెనీ ఏజెంట్లు, ఏఎంసీ అధికారులు కుమ్మక్కై ఏదో నామమాత్రంగా నిబంధనల ప్రకారం కొన్నట్టు చూపి మిగతా కర్రను తమ ఇష్టానుసారం కొంటున్నారు. ప్రకాశం జిల్లా సంతనూతలపాడు, చీమకుర్తి ప్రాంతంలో రూ.4,400లకు కొనాల్సిన జామాయిల్ కర్రను టన్ను రూ.1,800, సుబాబుల్‌ను రూ.2 వేల నుంచి రూ.2,400 మధ్య కొంటున్నారు. అదే కృష్ణాజిల్లా నందిగామలో రూ.2 వేలకు మించి ఇవ్వడంలేదు. కర్ర కొట్టుడు, రవాణా ఖర్చులను తామే భరిస్తున్నందున ఇంతకుమించి ఇవ్వలేమని పేపర్ మిల్లులు తెగేసి చెబుతున్నాయి. రవాణా సౌకర్యం బాగుంటే ధర కొంచెం ఎక్కువగా ఉంటుంది. అదే మారుమూల అయితే ధర తక్కువగా ఉంటోందని సుబాబుల్ రైతుల సంఘం నాయకుడు హనుమారెడ్డి చెప్పారు.

**ప్రతి రైతుకూ ఏటా రూ.25 వేలు నష్టం**

ధర లేకపోవడంతో రైతులు ఏటా ఎకరాకు రూ.20వేల నుంచి రూ.25 వేల వరకు నష్టపోతున్నారు. దీనిపై రైతులు వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ధర్నాచేసినా ఫలితం లేకపోయింది. ప్రభుత్వం జామాయిల్ కర్ర టన్నుకు నిర్ణయించిన రూ.4,400ను, సుబాబుల్‌కు నిర్ణయించిన రూ.4,200ల ధరైనా ఇవ్వకపోతే తాము బతికేదెలా? అని ప్రశ్నిస్తున్నా రైతుల వేదన అరణ్యరోదనగానే మిగిలింది. ఆ ధరతో కొనుగోలు చేయలేమని ఐటీసీ, ఏపీ పేపర్ మిల్స్, జేకే పేపర్ మిల్స్ చెబుతున్నాయి. పేపర్ ధర పెరుగుతున్నప్పుడు ముడిసరకు ధర ఎందుకు పెరగదని రైతులు ప్రశ్నిస్తున్నారు.

**తీసి ఇవ్వాలంటే ఎలా?**

గత ప్రభుత్వ అనాలోచిత చర్యవల్ల రైతులే తమ తోటల్ని నరికి కర్రను స్టాక్ పాయింట్‌కు తరలించాల్సిన పరిస్థితి. ఇది చాలదన్నట్టు ఆ కర్రకుండే తాటను సైతం రైతులే తీయించి పేపర్ మిల్లులకు సరఫరా చేయాలని ప్రకాశం జిల్లాలో షరతు విధించారు. ఈ నిబంధనను తొలగించాలని రైతులు ఆందోళన చేస్తే దాన్ని తీసివేయడానికి బదులు రాష్ట్రవ్యాప్తంగా అదే విధానాన్ని అమలుచేయడం మొదలు పెట్టారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.



# బైబై ఇండియా..!

- విదేశాల్లో భారీగా ఆశ్రయం కోరుతున్న భారతీయులు
- అమెరికా, కెనడా, దక్షిణాఫ్రికాలకు ప్రాధాన్యత
- సూడాన్, యెమెన్ వంటి దేశాలనూ ఆశ్రయిస్తున్న వైనం
- దక్షిణాసియాలో అగ్రస్థానంలో నిలిచిన పాకిస్తాన్

భారత్‌ను వీడి విదేశాల్లో ఆశ్రయం పొందాలనుకుంటున్న భారతీయుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అంతర్యుద్ధం, రాజకీయ సంక్షోభం వంటి సమస్యలు లేకపోయినా విదేశాల్లో ఆశ్రయం కోరుతున్న భారతీయుల సంఖ్య భారీగా పెరిగినట్లు ఐక్యరాజ్యసమితి శరణార్థుల హైకమిషన్ తెలిపింది. 2008–18 మధ్యకాలంలో ఇలా విదేశాలను ఆశ్రయిస్తున్నవారి సంఖ్య ఏకంగా 996.33 శాతానికి ఎగబాకిందని వెల్లడించింది. ఇలా ఆశ్రయం కోరుతున్నవారిలో అత్యధికులు అమెరికా, కెనడా దేశాలవైపు మొగ్గుచూపుతున్నారని పేర్కొంది. సాధారణంగా అంతర్యుద్ధం, రాజకీయ అస్థిరత ఇతర కారణాలతో ప్రజలు ప్రాణాలను అరచేతపెట్టుకుని పారిపోతుంటారు. ఈ తరహా సమస్యలు ఏవీ లేకపోయినా భారత్ నుంచి భారీగా వలసలు పెరగడంపై నిపుణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

### పదేళ్ల క్రితం పరిస్థితి వేరు...

పదేళ్ళ క్రితం పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉండేది. 2008–09 మధ్యకాలంలో అమెరికా, కెనడాల ఆశ్రయాన్ని కోరుతూ కేవలం 282 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. కానీ గత పదేళ్ళలో ఈ సంఖ్య అనూహ్యంగా పెరిగిపోయి 22,967కి చేరుకుంది. 2018లో అమెరికా ఆశ్రయాన్ని కోరుకున్న భారతీయుల సంఖ్య 28,489కు పెరగ్గా, కెనడా ఆశ్రయాన్ని కోరుకున్న వారి సంఖ్య 5,522కు చేరుకుంది. ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం అమెరికా, కెనడాల తర్వాత భారతీయులు ఆశ్రయం కోరిన దేశాల్లో దక్షిణాఫ్రికా(4,329), ఆస్ట్రేలియా(3,584), దక్షిణకొరియా(1,657), జర్మనీ(1,313) తర్వాతి స్థానాల్లో నిలిచాయి. అమెరికా, ఆస్ట్రేలియా, జర్మనీ అభివృద్ధి చెందిన దేశాలు కాబట్టి వలస వెళ్లారంటే అర్థం చేసుకోవచ్చు. కానీ పేదరికం, అంతర్యుద్ధం, విపరీతమైన హింస ఉండే యెమెన్, సూడాన్, బోస్నియా, బురుండి వంటి దేశాలను కూడా భారతీయులు ఆశ్రయం కోరడం అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులను విస్మయంలో పడేస్తోంది. 2018లో ఇలాంటి 57 దేశాల్లో భారతీయులు ఆశ్రయాన్ని కోరడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. భారత్‌లో నెలకొన్న అసహనం కారణంగానే ఇలా ప్రజలు విదేశీ ఆశ్రయం కోరుతున్నారని మరికొందరు వాదిస్తున్నారు.

### భారత్‌కు వస్తున్నవారు తక్కువే...

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌ను ఆశ్రయిస్తోన్న శరణార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉండటం గమనార్హం. అంతర్జాతీయంగా 35.03 లక్షల మంది శరణార్థులు వేర్వేరు దేశాల్లో ఆశ్రయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్నవారు 11,957 మంది(0.34 శాతం) మాత్రమే. ఐక్యరాజ్యసమితి లెక్కల ప్రకారం 2018 చివరికినాటికి భారత్ 1.95 లక్షల మంది శరణార్థులకు ఆశ్రయం ఇచ్చింది. ప్రాంతాలవారీగా చూసుకుంటే పాకిస్తాన్ 14.04 లక్షల మంది విదేశీయులకు ఆశ్రయం ఇచ్చింది. వీరిలో అత్యధికులు ఆఫ్గన్లు. 9.06 లక్షల మందితో బంగ్లాదేశ్ రెండో స్థానంలో నిలిచింది. రోహింగ్యాలు వీరిలో అత్యధికంగా ఉన్నారు.

## భారత్‌లోని పరీక్షతో బ్రిటన్‌లో చదవొచ్చు

### స్పష్టం చేసిన క్వీన్ యూనివర్సిటీ

**న్యూఢిల్లీ:** భారత్‌లో ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈతో పాటు ఇతర పోటీ పరీక్షల ద్వారా కూడా విద్యార్థులను ఎంపిక చేసుకొనేందుకు సిద్ధంగా ఉన్నామని బ్రిటన్‌లోని క్వీన్ యూనివర్సిటీ తెలిపింది. సైన్స్, టెక్నాలజీ విభాగాల్లో వారికి అవకాశం కల్పిస్తామని వైస్ చాన్సలర్ ఇయాన్ గ్రీర్ స్పష్టంచేశారు. సాధారణంగా యూకే యూనివర్సిటీలు లెవెల్–ఏ పరీక్షలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటాయి. అయితే ప్రవేశ పరీక్షలకు వివిధ దేశాల్లో విభిన్న ప్రామాణికతలు ఉంటాయని, భారత్‌లోని పరీక్షలు తాము నిర్దేశించుకున్న స్థాయిలోనే ఉన్నాయని ఇయాన్ అన్నారు. చాలా మంది విద్యార్థులు ప్రతిభ ఉన్నా సీట్ల కొరతతో ఐఐటీల్లో చేరలేకపోతున్నారన్నారు. మరో అవకాశం లేక తక్కువ స్థాయి ఉన్న కాలేజీల్లో చేరతారన్నారు. ఇటువంటి ప్రతిభావంతులైన విద్యార్థులకు తమ కాలేజీల్లో చదివే అవకాశం కల్పిస్తామన్నారు. జేఈఈలాగే ఇతర జాతీయ స్థాయి పరీక్షలను కూడా పరిగణనలోకి తీసుకునే ఆలోచన చేస్తున్నామన్నారు. ఇప్పటికే పలు కార్యక్రమాల ద్వారా 200 మందికి పైగా భారత విద్యార్థులను చేర్చుకున్నామని, రానున్న అయిదేళ్లలో మరింత మందిని చేర్చుకోవడమే తమ లక్ష్యమని తెలిపారు.

## అమేథీ సమస్యలను పరిష్కరించండి

### అధికారులను కోరిన కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ



అమేథీలో ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి

**అమేథీ:** తన నియోజకవర్గ ప్రజల సమస్యలను వారంలోగా పరిష్కరించేలా చూడాలని కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ అమేథీ ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అమేథీ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో ఆదివారం సమావేశమైన మంత్రి, ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. అంతకుముందు ఆమె చనిపోయిన తన సహాయకుడు సురేందర్ సింగ్ కుటుంబసభ్యులను పరామర్శించారు.తనను ఎన్నుకున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో రాహుల్ గాంధీని ఎంపీగా ఎన్నుకుంటే 5 ఏళ్లు కనిపించకుండా పోయేవాడని, ఢిల్లీ వెళ్లినా ఆయనను కనిపించేవారు కాదని ఆమె విమర్శించారు.

## మాయ కుటుంబీకులకు కీలక పదవులు



**లక్నో:** బీఎస్పీ అధినేత్రి మాయావతి సోదరుడు, మేనల్లుడికి పార్టీలో కీలక పదవులు దక్కాయి. సోదరుడు ఆనంద్ కుమార్‌ను పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడిగా, మేనల్లుడు ఆకాశ్ ఆనంద్, రామ్‌జీ గౌతమ్‌లను పార్టీ జాతీయ సమన్వయకర్తలుగా మాయావతి నియమించినట్లు ఓ సీనియర్ నేత తెలిపారు. ఈమేరకు ఆదివారం లక్నోలో పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్న సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అలాగే అమ్రోహ ఎంపీ దనీశ్ అలీ లోక్‌సభలో బీఎస్పీ నేతగా, నగినా ఎంపీ గిరీశ్ చంద్ర పార్టీ చీఫ్ విప్‌గా నియమితులైనట్లు వెల్లడించారు. మాయావతి చిన్న సోదరుడైన ఆనంద్ కుమారుడు ఆకాశ్ ఆనంద్(24)ను కీలక పదవిలో నియమించడంతో ఆయన పార్టీ వ్యవహారాల్లో ప్రముఖంగా వ్యవహరిస్తారనే సంకేతం ఇచ్చినట్లయింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఎస్పీతో పొత్తు పెట్టుకున్న తర్వాత పార్టీ వ్యవహారాల్లో ఆకాశ్ చురుగ్గా మారారు.

## పర్సు కొట్టేసిన ఎయిరిండియా పైలట్

**న్యూఢిల్లీ:** సిడ్నీ విమానాశ్రయంలోని ఒక దుకాణంలో పర్సు దొంగిలించారన్న ఆరోపణపై రోహిత్ భాసిన్ అనే పైలట్‌ను సస్పెండ్ చేసినట్టు ఎయిర్ ఇండియా వెల్లడించింది. సిడ్నీ నుంచి న్యూఢిల్లీ వస్తున్న ఏఐ –301 విమానం పైలట్లలో రోహిత్ ఒకరు. ఆయన ఎయిర్ ఇండియా రీజనల్ డైరెక్టర్‌గా కూడా పని చేస్తున్నారు. ఈ నెల 22వ తేదీ ఉదయం విమానం సిడ్నీ నుంచి బయలుదేరే ముందు రోహిత్ ఈ దొంగతనం చేశారని అధికారులు తెలిపారు. ‘విమానాశ్రయంలో ఉన్న దుకాణం నుంచి ఆయన ఒక పర్సు దొంగిలించారని తెలిసింది. దాంతో ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించాం. నిజమని తేలడంతో రోహిత్‌ను సస్పెండ్ చేశాం. అనుమతిలేకుండా ఎయిర్ ఇండియా ప్రాంగణంలోకి ప్రవేశించరాదని కూడా ఆదేశించాం’అని తెలిపారు. విమానం ఢిల్లీలో దిగగానే విమానాశ్రయంలోనే రోహిత్‌కు సస్పెన్షన్ ఉత్తర్వులు అందజేశామని ఆయన చెప్పారు. గుర్తింపు కార్డుని అధికారులకు అప్పగించాలని, తమ లిఖిత పూర్వక అనుమతి లేకుండా రోహిత్ నివాస స్థలమైన కోల్‌కతాను విడిచి వెళ్లరాదని కూడా ఆదేశించారు.

## కశ్మీర్లో నలుగురు ఉగ్రవాదుల హతం

**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్‌లోని సోపియాన్ జిల్లాలో ఆదివారం భద్రతా దళాలు నలుగురు ఉగ్రవాదులను మట్టుబెట్టాయి. సోపియాన్ జిల్లాలోని దరామ్‌దోరా ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారన్న పక్కా సమాచారంతో భద్రతాదళాలు కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌ను నిర్వహించాయి. ఈ క్రమంలో భద్రతాదళాలపైకి ఉగ్రవాదులు కాల్పులు ప్రారంభించారు. దీంతో భద్రతా దళాలు జరిపిన ఎదురుకాల్పుల్లో నలుగురు ఉగ్రవాదులు అక్కడికక్కడే హతమయ్యారు. మరణించిన ఉగ్రవాదుల్ని రఫీ హసన్‌మీర్, సుహైల్ అహ్మద్ భట్, షౌకత్ అహ్మద్ మీర్, అజాద్ అహ్మద్ ఖాండేలుగా గుర్తించినట్లు పోలీసులు మీడియాకు తెలిపారు. షౌకత్ 2015లో హిజ్బుల్ ముజాహిద్దీన్‌లో చేరగా, మిగతా ముగ్గురూ ఇటీవలే అందులో చేరినట్లు తెలుస్తోంది.

## నన్ను ప్రాణాలతో వదిలిపెట్టరు

**బెంగళూరు:** రాజకీయ నేతలు తనను వేధిస్తున్నారనీ, ఆత్మహత్య చేసుకుంటానని అదృశ్యమైన ఐఎంఏ జువెల్స్ అధినేత మన్సూర్ ఖాన్ ఆదివారం ఓ వీడియోను విడుదల చేశారు. ప్రజల నుంచి భారీగా నగదును వసూలుచేసి పరారైన కేసులో జూన్ 24న విచారణకు హాజరుకావాలని ఈడీ ఖాన్‌కు సమన్లు జారీచేసింది. ఈ నేపథ్యంలో 18 నిమిషాల నిడివిఉన్న వీడియోలో ఖాన్..‘నేను తిరిగివచ్చి ప్రజలకు అండగా ఉండాలనీ, పోలీసుల విచారణకు సహకరించాలని కోరుకుంటున్నా. పోలీసులు, కోర్టు ముందు హాజరై అందరిపేర్లు బయటపెడతా. వాళ్లు సామాన్యమైన వ్యక్తులు కాదు. వాళ్లు నన్ను ప్రాణాలతో వదిలిపెట్టరు’ అని ఆందోళన వ్యక్తంచేశారు. ఆకర్షణీయమైన వడ్డీ ఆశచూపి ఐఎంఏ జువెల్స్ సంస్థ ప్రజల నుంచి భారీగా పెట్టుబడులు వసూలుచేసిన వ్యవహారంలో కర్ణాటక ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటుచేసింది.

## నెహ్రూపై జేపీ నడ్డా విమర్శలు



**న్యూఢిల్లీ:** భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ మరణంపై విచారణ జరిపేందుకు అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నిరాకరించారని బీజేపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా తెలిపారు.1953, మే 11న జమ్మూకశ్మీర్‌లోకి ప్రవేశించడానికి ప్రయత్నించిన ఆయన్ను అరెస్ట్ చేశారనీ, జూన్ 23న ఓ జైల్లో ఆయన తుదిశ్వాస విడిచారని వెల్లడించారు. ముఖర్జీ 66వ వర్ధంతి సందర్భంగా ఢిల్లీలో బీజేపీ అధ్యక్షుడు షాతో కలిసి నడ్డా నివాళులు అర్పించారు. ‘దేశమంతా కోరినప్పటికీ నెహ్రూ ముఖర్జీ మరణంపై విచారణకు ఆదేశించలేదు. కశ్మీర్‌లో భారతీయులు అనుమతి లేకుండా ప్రవేశించరాదన్న నిబంధనకు వ్యతిరేకంగా ఆయన పోరాడారు. శ్యామా ప్రసాద్ ముఖర్జీ త్యాగం వృధాగా పోదు. ఆయన లక్ష్యానికి బీజేపీ కట్టుబడి ఉంది’ అని పేర్కొన్నారు.

# రాజస్తాన్‌లో కూలిన పందిరి

- విచారణకు ఆదేశించిన సీఎం అశోక్ గహ్లోత్
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం
- ప్రధాని మోదీ, హోంమంత్రి షా, రాహుల్ దిగ్భ్రాంతి

### 14 మంది మృతి, 50 మందికి గాయాలు



పందిరి కుప్పకూలిన ప్రాంతం వద్ద గుమికూడిన జనం

**బెర్మర్/జైపూర్:** రాజస్తాన్‌లోని బెర్మర్ జిల్లాలో ఘోరప్రమాదం చోటుచేసుకుంది. ఓ ఆలయం సమీపంలోని పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన పందిరి ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో 14 మంది ప్రాణాలు కోల్పోగా, 50 మందికి పైగా భక్తులకు గాయాలయ్యాయి. జసోల్ ప్రాంతంలో ఉన్న రాణి భతియానీ ఆలయం వద్ద వేడుకలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా భారీ పందిరిని ఏర్పాటుచేసిన నిర్వాహకులు ‘రామకథ’ నాటకాన్ని ప్రదర్శించారు. దీంతో వేడుకకు హాజరైన వందలాది మంది ప్రజలు అక్కడే కూర్చుని రామకథను చూస్తుండగా బలమైన గాలులకు పందిరి ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఈ విషయమై ఏఎస్పీ రతన్‌లాల్ భార్గవ మాట్లాడుతూ.. ‘రామ కథ ప్రదర్శన జరుగుతుండగా ఒక్కసారిగా బలమైన గాలులు వీచాయి. దీంతో పందిరి ఓవైపు నుంచి కూలిపోవడం ఆరంభమైంది. ఈ నాటకానికి నేతృత్వం వహిస్తున్న మురళీధర్ మహరాజ్ దీన్ని గమనించి భక్తులను అప్రమత్తం చేశారు. దీంతో అక్కడినుంచి బయటపడేందుకు అందరూ ఒకేసారి ప్రయత్నించడంతో తొక్కిసలాట లాంటి పరిస్థితి నెలకొంది. చూస్తుండగానే ఈ పందిరి భక్తులపై కుప్పకూలిపోయింది’ అని తెలిపారు. ఇనుపరాడ్లు–టెంట్ల కింద చిక్కుకున్న ప్రజలను కాపాడేందుకు ప్రయత్నించిన తమకు విద్యుత్ షాక్ తగిలిందని ప్రత్యక్షసాక్షులు చెప్పారన్నారు. ఈ ప్రమాదంలో గాయపడ్డవారిని జిల్లాలోని వేర్వేరు ఆసుపత్రులకు తరలించామని చెప్పారు. 14 మంది చనిపోవడానికి గల కారణం పోస్ట్‌మార్టం తర్వాతే తెలుస్తుందని స్పష్టం చేశారు.

### ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

ఈ దుర్ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ‘రాజస్తాన్‌లోని బర్మర్‌లో పందిరి కూలిపోవడం నిజంగా దురదృష్టకరం. తమ కుటుంబ సభ్యులను కోల్పోయినవారికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా. అలాగే ఈ ప్రమాదంలో గాయపడ్డవారు వీలైనంత త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా’ అని ప్రధాని ట్వీట్ చేశారు. మరోవైపు రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ ఈ ప్రమాద విషయమై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ దుర్ఘటనలో చనిపోయినవారికి రూ.5 లక్షలు, గాయపడ్డవారికి రూ.2 లక్షల వరకూ నష్టపరిహారం అందజేస్తామని సీఎం తెలిపారు. ఈ ప్రమాదంపై జోధ్‌పూర్ డివిజనల్ కమిషనర్ బీఎల్ కోఠారి నేతృత్వంలో విచారణకు ఆదేశించామని చెప్పారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని యంత్రాంగాన్ని ఆదేశించారు.అనంతరం ఈ దుర్ఘటనపై విచారణ జరపాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ ప్రమాదంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## అమెరికా నివేదికపై భారత్ ఆగ్రహం

### మతస్వేచ్ఛపై నివేదికను ఖండించిన కేంద్రం



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ మతస్వేచ్ఛపై అమెరికా విడుదల చేసిన నివేదికపై భారత ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. భారతదేశంలోని ప్రజల రాజ్యాంగహక్కుల గురించి మాట్లాడే హక్కు ఓ విదేశీ ప్రభుత్వానికి లేదని ఘాటుగా వ్యాఖ్యానించింది. 2018లో అంతర్జాతీయ మతస్వేచ్ఛకు సంబంధించి అమెరికా ప్రభుత్వం శుక్రవారం నివేదిక విడుదల చేసిన విషయం తెలిసిందే. భారత్‌లో మైనారిటీలపై హిందూ అతివాద సంస్థలు దాడులకు పాల్పడుతున్నాయని ఆ నివేదికలో పేర్కొంది. గోమాంసాన్ని రవాణా చేయడం, గోవధ చేశారనే ఆరోపణలతో ముస్లింలపై దాడులు చేస్తున్నారని ఆరోపించింది. అమెరికా విదేశాంగ శాఖ తన నివేదికలో చెప్పిన అంశాలను భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రవీశ్ కుమార్ ఖండించారు. ఆదివారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. ‘దేశంలోని లౌకిక భావజాలం పట్ల భారత్ గర్విస్తోంది. ప్రజల సంక్షేమం కోసం కృషిచేస్తున్న అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్. ఇక్కడి ప్రజలందరికీ మత స్వాతంత్ర్యం ఉంది. రాజ్యాంగం మైనారిటీలు సహా అన్ని వర్గాలకు హక్కులను కల్పిస్తోంది. ఎవరికీ ఎలాంటి హానీ కలగదు. ఈ విషయంలో విదేశీ ప్రభుత్వం జోక్యం తగదు’అని ఉద్ఘాటించారు.

## కలవరపెట్టిన పాక్ సబ్‌మెరైన్

- బాలాకోట్ తర్వాత మాయమైన ‘పీఎన్ఎస్ సాద్’
- 21 రోజులపాటు సముద్రాన్ని గాలించిన భారత నేవీ



**న్యూఢిల్లీ:** పుల్వామా ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్తాన్‌లోని బాలాకోట్‌లో ఉన్న జైషే మొహమ్మద్ ఉగ్రస్థావరంపై భారత్ ఫిబ్రవరి 26న వైమానికదాడులు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా పాకిస్తాన్‌కు చెందిన అత్యాధునిక సబ్‌మెరైన్ ఒకటి భారత అధికారులను తీవ్రంగా కలవరపెట్టింది. చాలాకాలం నుంచి భారత్ పాక్ నేవీ కదలికలపై నిఘా ఉంచుతోంది. ఈ క్రమంలో బాలాకోట్ దాడుల తర్వాత పాక్ ఎలాంటి దుస్సాహసానికి పాల్పడకుండా 60కిపైగా యుద్ధనౌకలు, విమానవాహక యుద్ధనౌక ఐఎన్ఎస్ విక్రమాదిత్యను అంతర్జాతీయ సముద్ర జలాల్లో మోహరించింది. ఈ నేపథ్యంలో పాక్ నేవీకి చెందిన అగొస్టా క్లాస్ సబ్‌మెరైన్ ‘పీఎన్ఎస్ సాద్’ కరాచీకి సమీపంలో అదృశ్యమైపోయింది. ‘ఎయిర్ ఇండిపెండెంట్ ప్రపల్షన్’ సాంకేతికత ఉన్న ఈ పీఎన్ఎస్ సాద్ మిగతా సబ్‌మెరైన్ల కంటే ఎక్కువరోజులు సముద్రగర్భంలో ఉండిపోగలదు. దీంతో భారత్‌పై దాడికి పాక్ పీఎన్ఎస్ సాద్ ను పంపిందన్న అనుమానం భారత అధికారుల్లో బలపడింది. పీఎన్ఎస్ సాద్ గుజరాత్ తీరానికి 3 రోజుల్లో, ముంబైకి 4 రోజుల్లో చేరుకోగలదని నేవీ నిపుణులు అంచనా వేశారు. దాన్ని అడ్డుకునేందుకు అణు సబ్‌మెరైన్ ఐఎన్ఎస్ చక్ర, ఐఎన్ఎస్ కల్వరితో పాటు పీ–8ఐ విమానాలను రంగంలోకి దించారు. వీటితోపాటు ఉపగ్రహాల సాయంతో 21 రోజుల పాటు గాలించారు. భారత జలాల్లో ప్రవేశించి లొంగిపోకుంటే సాద్‌ను పేల్చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. చివరికి 21 రోజుల తర్వాత పాక్‌కు పశ్చిమాన ఉన్న సముద్రజలాల్లో పీఎన్ఎస్ సాద్‌ను భారత నేవీ గుర్తించింది. ఈ విషయమై నేవీ అధికార ప్రతినిధి కెప్టెన్ డీకే శర్మ మాట్లాడుతూ.. భారత్‌తో యుద్ధం తలెత్తితే రహస్యంగా దాడి చేసేందుకు పాక్ సాద్‌ను వ్యూహాత్మకంగా అక్కడ మోహరించిందని తెలిపారు. కానీ భారత దూకుడు, అంతర్జాతీయ ఒత్తిడిలతో పాక్ తోక ముడిచిందని వెల్లడించారు. దీంతో మక్రాన్ తీరంలోనే సాద్ ఆగిపోయిందని పేర్కొన్నారు.

## గ్రీన్‌ల్యాండ్‌లో మంచు కనుమరుగు కానుందా?

### అవకాశం ఉందన్న తాజా సర్వే



**వాషింగ్టన్:** ప్రపంచవ్యాప్తంగా ఉత్పన్నమవుతున్న కర్బనవాయువులు ఇదే వేగంతో పెరుగుతుంటే ఈ శతాబ్దం ముగిసేలోపే గ్రీన్‌ల్యాండ్‌లోని 4.5 శాతం మంచుకొండలు కరిగిపోయే ప్రమాదం ఉందని తాజా పరిశోధన వెల్లడించింది. దానితోపాటు సముద్ర మట్టాలు 13 అంగుళాల మేర పెరిగే అవకాశం ఉందని ఆ నివేదిక హెచ్చరించింది. ఉద్గారాలను తగ్గించకపోతే 3000 సంవత్సరం కల్లా గ్రీన్‌ల్యాండ్‌లోని మంచు పూర్తిగా కరిగే అవకాశం ఉందని అమెరికాలోని అలస్కా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ ఆండీ ఆష్‌వాండెన్ తెలిపారు. గ్రీన్‌ల్యాండ్‌లో 6,60,000 చదరపు కిలోమీటర్ల మేర మంచు పరచుకొని ఉంది. ఈ మంచుకొండల కింద ఉన్న ప్రాంతాల పరిస్థితులపై ఆయన అధ్యయనం చేశారు. దాదాపు 500 రకాల విభిన్న పరిస్థితులను అంచనా వేశారు. వీటిని అంచనా వేసే క్రమంలో పెద్ద మంచు పర్వతాలను కూడా పరిగణలోకి తీసుకున్నారు. వాటి నుంచి కరుగుతున్న హిమ శాతాన్ని కలిపి ఈ మేరకు అంచనాలు వేశారు. 1991, 2015 మధ్య సంవత్సరానికి 0.02 శాతం చొప్పున సముద్రమట్టం పెరిగిందని అన్నారు. గ్రీన్‌ల్యాండ్‌లోని మంచు పర్వతాలను కూడా పరిగణలోకి తీసుకొని పరిశోధన చేసిన మొదటి నివేదిక ఇదే కావడం గమనార్హం.

### నగరాలకు ముంపు తప్పదు...

ఇప్పుడు ఉన్న కర్బన ఉద్గార శాతం ఇలాగే కొనసాగితే 3000 సంవత్సరం కల్లా సముద్రమట్టం 24 అడుగులు పెరుగుతుందని హెచ్చరించారు. దీనివల్ల సముద్రపు ఒడ్డున ఉన్న శాన్ ఫ్రాన్సిస్కో, లాస్ ఏంజెలస్, న్యూ ఓర్లాన్స్ వంటి నగరాలు సముద్రంలో మునగడం ఖాయమన్నారు. కర్బన వాయువులు పెరగకుండా జగ్రత్తలు తీసుకుంటే సముద్ర మట్టం కేవలం 6.5 అడుగులు మాత్రమే పెరిగే అవకాశం ఉందన్నారు.

## ఇతరులూ కాంగ్రెస్ చీఫ్ కావొచ్చు

### సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్‌లో గాంధీ కుటుంబం వారు కాకుండా ఎవరైనా అధ్యక్షుడు కావొచ్చని.. అయితే కచ్చితంగా గాంధీ కుటుంబం మాత్రం పార్టీలో చురుకుగా ఉండాల్సి ఉంటుందని కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ అన్నారు. గాంధీ ముక్త్ కాంగ్రెస్ పేరుతో కాంగ్రెస్ ముక్త్ భారత్ చేయడమే బీజేపీ అసలు లక్ష్యమని ఒక ఇంటర్వ్యూలో ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ వైఫల్యంతో పార్టీ చీఫ్ ఎవరనే ప్రతిష్టంభనపై అయ్యర్ స్పందించారు. రాహుల్ కాంగ్రెస్ చీఫ్‌గా ఉండటమే మంచిదని.. అయితే ఆయన అభిప్రాయాలను నాయకులు, కార్యకర్తలు గౌరవించాలని అభిప్రాయపడ్డారు. గాంధీ–నెహ్రూ కుటుంబాలు అధ్యక్ష పదవిలో లేకున్నాపార్టీ మనగలుగుతుంది. క్లిష్ట పరిస్థితులు తలెత్తినప్పుడు.. నేతల మధ్య అభిప్రాయ భేదాలు వచ్చినప్పుడు వాటిని పరిష్కరించే సత్తా వారికే ఉందని చెప్పారు. నెహ్రూ–గాంధీ కుటుంబంలోని వారు అధ్యక్ష పదవిలో ఉన్నప్పుడు పార్టీలో నేతల మధ్య తలెత్తిన సమస్యలను ఏ విధంగా పరిష్కరించారో ఉదహరించారు. చీఫ్‌గా రాహులే ఉంటారా? ఇతరులు వస్తారా? అన్న దానికి వేచి చూడాల్సిందే అని అయ్యర్ చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ వైఫల్యంతో పార్టీ చీఫ్ పదవి నుంచి తప్పుకోవడానికి రాహుల్ ప్రతిపాదించగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తిరస్కరించింది. అయితే, చీఫ్‌గా ఎవరుండాలనేది పార్టీనే నిర్ణయిస్తుందని రాహుల్ ప్రకటించారు.

# ఇథియోపియా ఆర్మీ చీఫ్ హత్య

- అంగరక్షకుడే కాల్చి చంపాడని ప్రభుత్వం వెల్లడి
- అంహరలో తిరుగుబాటు యత్నం విఫలం



ఆర్మీ చీఫ్ అంబచ్యూ మెకనెన్ (ఫైల్)



మెకనెన్ మృతిపై ప్రభుత్వ టీవీలో మాట్లాడుతున్న ప్రధాని అబిఅహ్మద్

**అదిస్ అబాబా:** ఇథియోపియా సైన్యాధిపతి సియరే మెకొన్నెన్ హత్యకు గురయ్యారు. మెకొన్నెన్ అంగరక్షకుల్లో ఒకరు ఆయనను ఇంటిలోనే కాల్చి చంపారని ప్రభుత్వ ప్రతినిధి బిలెనె సియోమ్ తెలిపారు. ఈ ఘటన జరగడానికి కొన్ని గంటల ముందు ఉత్తరాన గల అంహరలో స్వయంప్రతిపత్తి మండలి ప్రభుత్వాన్ని (అటానమస్ రీజన్)కూల్చివేసేందుకు విఫలయత్నం జరిగిందని, ఆ సందర్భంగా జరిగిన కాల్పుల్లో అంహర అధ్యక్షుడు అంబచ్యూ మెకనెన్ చనిపోయారని, పలువురు గాయపడ్డారని ఆమె చెప్పారు. అయితే, ఈ రెండు ఘటనలకు సంబంధం ఉన్నదీ లేనిదీ ఇప్పుడే చెప్పలేమన్నారు. అంహర రాజధాని బహిర్ దార్‌లో శనివారం మధ్యాహ్నం అధ్యక్షుడు అంబచ్యూ ఉన్నతాధికారులతో సమావేశం జరుపుతుండగా, సైన్యాధికారి అసమిన్యూ నాయకత్వంలో కొందరు వారిపై దాడి చేశారు. ఆ సందర్భంగా జరిగిన కాల్పుల్లో అంబచ్యూతో పాటు ఆయన సలహాదారుడు కూడా చనిపోయారు .అసమిన్యూ తప్పించుకున్నారని ప్రభుత్వం తెలిపింది.ఈ ఘటన జరిగిన కొన్ని గంటలకు మెకొన్నెన్ హత్య జరిగింది. ఆ సమయంలో సైన్యాధిపతితో ఉన్న రిటైర్డ్ సైన్యాధికారి కూడా చనిపోయారు. హంతకుడిని అదుపులోకి తీసుకున్నట్టు ప్రభుత్వ ప్రతినిధి తెలిపారు. గతంలో ప్రభుత్వంపై తిరుగుబాటు చేసినందుకుగాను అసమిన్యూ అరెస్టయ్యారు. గత ఏడాదే క్షమాభిక్ష కింద విడుదలయ్యారని స్థానిక మీడియా పేర్కొంది. రాజధానిలో కొన్ని గంటల పాటు కాల్పులు జరిగాయని విదేశీ జర్నలిస్టు ఒకరు తెలిపారు. విదేశీ దౌత్యవేత్తలు, అంతర్జాతీయ సంస్థలు ఉండే బోలె జిల్లాలో మెకొన్నెన్ హత్య జరగడంతో ఆయా దేశాలు తమ సిబ్బందిని అప్రమత్తం చేశాయి. అంహరలో పరిస్థితి ప్రస్తుతం పూర్తిగా అదుపులో ఉందని ప్రధాని కార్యాలయం ప్రకటించింది. జనాభా రీత్యా ఆఫ్రికాలో రెండో పెద్ద దేశమైన ఇథియోపియా ఆర్థికంగా ఎదుగుతోంది. ఏడాది క్రితం ప్రధాని పగ్గాలు చేపట్టిన అబి అహ్మద్ పలు సంస్కరణలు చేపట్టారు. అందులో భాగంగా రాజకీయ ఖైదీలను విడుదల చేశారు. రాజకీయ పార్టీలపై నిషేధాన్ని ఎత్తివేశారు. మానవ హక్కులను ఉల్లంఘించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకున్నారు. సైన్యానికి, నిఘా విభాగాలకు ఈ సంస్కరణలు రుచించకపోవడంతో వారు ప్రధానికి శత్రువులుగా మారారు. మరోవైపు అంహరా సహా దేశంలో చాలా ప్రాంతాల్లో తీవ్రమవుతున్న జాతి పోరాటాలు ప్రభుత్వానికి ఇబ్బందులు కలిగిస్తున్నాయి. దేశంలో ఒరోమో, అంహర తెగల ప్రజలు అత్యధికంగా ఉన్నారు. ప్రత్యర్థిపై పోరాటానికి సిద్ధంగా ఉండాల్సిందిగా గత వారం అసమిన్యూ అంహర తెగ ప్రజలకు పిలుపునిచ్చారు. దేశంలో అంహర సహా తొమ్మిది అటానమస్ రీజన్లు ఉన్నాయి. సరిహద్దు విషయంలో ఈ మండళ్లలో తెగల మధ్య ఘర్షణలు చెలరేగుతున్నాయి. ఏ తెగకు ఆ తెగ స్వపరిపాలనకు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఘర్షణలు జరుగుతున్నాయి.

## అలహాబాద్ హైకోర్టు జడ్జిని తొలగించండి

### ప్రధాని మోదీకి లేఖ రాసిన సీజేఐ

**న్యూఢిల్లీ:** అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ ఎస్.ఎన్.శుక్లాను తొలగించాలని కోరుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ ప్రధాని మోదీకి లేఖ రాశారు. మెడికల్ కాలేజీలకు అనుమతులిచ్చే విషయంలో ముడుపులు అందుకున్నారని జస్టిస్ శుక్లాపై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. వీటిపై విచారణ జరిపేందుకు మద్రాస్ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఇందిరా బెనర్జీ, సిక్కిం హైకోర్టు చీఫ్ జస్టిస్ ఎస్‌కే అగ్నిహోత్రి, మధ్యప్రదేశ్ హైకోర్టు జస్టిస్ పీకే జైస్వాల్ నేతృత్వంలో త్రిసభ్య అంతర్గత కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ శుక్లాపై వచ్చిన ఆరోపణలు వాస్తవమేనని తేల్చింది. ‘శుక్లా మీద వచ్చిన ఆరోపణలు వాస్తవమేనని కమిటీ విచారణలో తేలింది. దీనిని తీవ్రంగా పరిగణించిన కమిటీ ఆయన్ను విధుల నుంచి తొలగించేందుకు చర్యలు చేపట్టింది. హైకోర్టులో ఆయన న్యాయపరమైన విధులు నిర్వర్తించేందుకు వీలు లేదు. దీంతో శుక్లాను విధుల నుంచి తొలగించండి’అని గొగోయ్ ప్రధానిని కోరారు.

# సాక్షి సాహిత్యం

విజయవాడ | సోమవారం
జూన్ | 24 | 2019
మెయిల్: sakshisahityam@gmail.com




## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారినామ సంవత్సరం. ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు. జ్యేష్ఠ మాసం. తిథి బ.సప్తమి రా.11.02 వరకు, తదుపరి అష్టమి. నక్షత్రం పూర్వాభాద్ర రా.12.45 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర. వర్జ్యం లేదు. దుర్ముహూర్తం ప.12.25 నుంచి 1.18 వరకు, తదుపరి ప.3.02 నుంచి 3.55 వరకు. అమృత ఘడియలు ప.3.55 నుంచి 5.41 వరకు.

సూర్యోదయం : 5.30, సూర్యాస్తమయం : 6.33
రాహుకాలం : ఉ.7.30 నుంచి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుంచి 12.00 వరకు

**నమాజ్ వేళలు**
ఫజర్ : 4.21
జొహర్ : 12.18
అసర్ : 4.55
మగ్రీబ్ : 6.53
ఇషా : 8.15

## ఈవారం పుస్తకాలు

**వాల్మీకి చెప్పిన రామాయణ గాథ**



రచన: కె.ఎల్.కాంతారావు; పేజీలు: 124; వెల: 60; ప్రచురణ: జై భారత్ ప్రచురణలు; ప్రతులకు: ప్రజాశక్తి బుక్ హౌజ్, నవతెలంగాణ బుక్ హౌజ్ అన్ని బ్రాంచీలు.

**రాగాలు సినీ గీతాలు**



రచన: డాక్టర్ కోదాటి సాంబయ్య; పేజీలు: 270; వెల: 300; ప్రతులకు: రచయిత, ఇంటి నం. 16–5–79, రైల్వే గేట్, వరంగల్–506002. ఫోన్: 9700600097

**తెలంగాణ సాయుధ పోరాటం: రాజకీయ, సైద్ధాంతిక విశ్లేషణ**



రచన: డాక్టర్ కందుకూరి రమేశ్; పేజీలు: 160; వెల: 100; ప్రతులకు: నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్, ఎమ్.హెచ్.భవన్, ప్లాట్ నం. 21/1, అజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, హైదరాబాద్–20. ఫోన్: 040–27665420

**సినారె కవిత్వానుశీలనం**



రచన: రాచపాళెం చంద్రశేఖర రెడ్డి; పేజీలు: 128; వెల: 80; ప్రతులకు: నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్, ఎమ్.హెచ్.భవన్, ప్లాట్ నం. 21/1, అజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, హైదరాబాద్–20. ఫోన్: 040–27665420

**అరణ్య పర్వం (నవల)**



రచన: సలీం; పేజీలు: 152; వెల: 120; ప్రతులకు: రచయిత, ఫ్లాట్ నం. బి2/206, లక్ష్మీనారాయణ అపార్ట్‌మెంట్స్, 3–6–164, హిమాయత్‌నగర్, హైదరాబాద్–29. ఫోన్: 7588630243

**ఓ రాయలసీమ! నీకు రాష్ట్ర కళ ఎప్పుడొస్తుందమ్మా!**



రచన: ప్రొఫెసర్ ఎ.రంగారెడ్డి; పేజీలు: 296; వెల: 250; ప్రతులకు: 15–40/1డి, శ్రీ సాయి హై స్కూల్ లేన్, పద్మావతి నగర్, తిరుపతి–517502. ఫోన్: 9849741654

## ఆదో ప్రపంచం

బాబ్బాబూ! అదే చేత్తో పరుపు కింద ఈయన దాచుకున్న నైలూ, మైలూ, బైలూ స్వీయ కవితల నోటుబుక్కు పట్టుకుపో నాయనా! నువ్వు ఏడేడు జన్మాలుగా చేసిన పాపాలన్నీ దేవుడు కొట్టేస్తాడు.



కథాసారం

# చిత్తుకు పై ఎత్తు



**చదరంగానికి అరవై నాలుగు గదులు. మొదటి గదిలో వొక వడ్లగింజ వుంపించండి. తరవాత రెండో గదిలో రెండు, మూడో గదిలో నాలుగు, నాలుగో గదిలో యెనిమిది- యిలాగా వెళ్లినకొద్దీ రెట్టింపుచేయిస్తూ నాకు వడ్లగింజలు దయచేయించండి మహాప్రభూ!**

''రాజద్వారే, రాజగృహే సర్వదా దిగ్విజయోస్తు. వేదోక్తం పరిపూర్ణమా–''

ద్వారంలోంచే ఆశీర్వచనం ప్రారంభించిన తంగిరాల శంకరప్పకు ఠాణేదారు గభీమని అడ్డం వచ్చి ''ఫో– మళ్లీ వచ్చావూ?'' అంటూ ''ఏయ్, జవాన్లూ?'' అని కరుగ్గా పిలిచాడు.

''చిత్తం బాబయ్యా, మేమడ్డుపెడుతూనే వుండగా, జలగలాగ జారి వచ్చేస్తున్నారండి'' అంటూ శంకరప్ప అంగాస్త్రపు కొంగులు పట్టుకున్నారు.

''దివాన్జీగా రుండగా మధ్య మీరు ఎవరయ్యా?'' అంటూ శంకరప్ప బింకంగా ముందుకు రాబోయాడు. ''నేను డబ్బు కోసం రాలేదు'' అని యేదో చెప్పబోయాడు.

అప్పటికి తెరిపయిన దివాన్జీ ''యేమిటా అల్లరి?'' అని నిదానంగా అడిగాడు.

''ఎవరో పిచ్చిబ్రాహ్మడు మహాప్రభూ! ఏలినవారి దర్శనం కావాలని నానా అల్లరీ చేస్తున్నాడండి.''

''ఒక రూపాయి చేతిలో పెట్టి పొమ్మనలేక పోయావా?''

''నేను కార్యార్థిని గాని, పిచ్చివాణ్ణి కాను మహాప్రభూ!'' శంకరప్ప కేక వేశాడు.

''యెదటికి రప్పించు'' అన్నాడు దివాన్జీ.

శంకరప్ప మొగంమీద బ్రహ్మతేజస్సు వెలిగిపోతోంది.

''ఏమిటి పని?''

''మహారాజులుంగారి దర్శనం చేసుకుందామని వచ్చాను.''

''ఈ వేషంతోటే?'' అనే మాటలు దివాన్జీ నాలుక చివరనుంచి జారిపోయాయి.

''విద్వత్తు వున్నచోట వేషం అక్కర్లేదండి'' శంకరప్ప బదులు చెప్పాడు. ''శ్రీ వత్సవాయి చతుర్భుజ తిమ్మజగపతి మహారాజులుంగారంటే చదరంగం ఆటలో నిధి అని దిగ్దంతులు ఘోష పెడుతూ వుండడం వల్ల– ఒక్క ఆట వారితో ఆడాలని–''

దివాన్జీకి అభిజాత్యం తోచింది. ''చదరంగం ఆడకూడదని నిశ్చయించుకున్నారు ప్రభువు'' అని మాట జారి వచ్చేసింది.

''ఎంచేతో?''

''తగిన వుజ్జీ దొరక్క... ఆట కట్టడం మాట దేవుడెరుగును, నాలుగైదు యెత్తులయినా పొంకంగా వెయ్యగలవాడు కనబడలేదు పృథివి మీద.''

''విపులా చ పృథ్వీ!''

దివాన్జీ వులిక్కిపడ్డాడు. వుగ్రుడైనాడు. ''బతకతలుచుకోలేదూ?''

''నా విద్వత్తుకి వినియోగం కనబడలేదు. ఇక బతికేం ప్రయోజనమూ? మొండిపట్టు పట్టి ఆటలో కూచుని వోడిపోతే, మహారాజులుంగారు వచ్చినవాడి తలకొట్టించి కోట కొమ్ములకు కట్టించడానికి శపథం పట్టారని తెలుసు. సిద్ధపడే వచ్చేశాను.''

తన అంతస్తు స్మరించుకుని ఈ దరిద్రుడి మీద పడి మొట్టాలన్నంత ఆవేశం వచ్చింది దివాన్జీకి. ''ఇక దయ చెయ్యి.''

''నాకేమి చెప్పినట్టూ?'' ముదలకించాడు శంకరప్ప.

''ఏయ్ జవాన్లూ!'' దురుసుగా పిలిచాడు దివాన్జీ.

•••

''ఏం జరిగింది నాయనా?'' ఆత్రంగా అడిగింది పేదరాసి పెద్దమ్మ.

''వ్యవహారం అంతా తల్లకిందులయి పోయింది పెద్దమ్మా'' అంటూ చతికిలబడ్డాడు శంకరప్ప.

నిరాశా, వుడుకుమోత్తనమూ, దుఃఖమూ అతని శరీరంలో ప్రతీ అణుమాత్ర భాగంలోనూ నిండి చిప్పిలిపోతూ వున్నాడు. ముప్ఫయేళ్ల శంకరప్ప పెద్దమ్మ అడ్డాల్లో బిడ్డ అయిపోయినాడు.

''విద్వాంసుల మంటూ వచ్చేవాళ్లని చాలామందిని చూశాను; అందరూ యిలాగే లౌక్యం సుతరామూ లేక...''

''ఆ పెద్దమనిషి మొదటే హేళనలోకి దిగాడు.''

''మరి విను. ఇప్పటిదాకా రాజదర్శనానికి నువు తిప్పలుపడ్డావు. ఇక నీ దర్శనం కోసం రాజే తిప్పలు పడాలి.''

''నీళ్లముంచినా పాలముంచినా– పెద్దమ్మా, నేను నీ కొడుకుని'' అంటూ ఆమె పాదాలు పట్టుకున్నాడు.

''ఇంత వెర్రిబాగుల నాయనవు, చదరంగంలో నీకింత నేర్పెలా వచ్చిందోయ్?''

''దాని కంతకీ కారణం యీశ్వరానుగ్రహం.''

ఒక్కమాటు పైకి చూసి ''పెద్దాపురప్పట్నం అంతా యెప్పుడైనా చూశావా?'' అని అడిగింది.

''సెబాస్'' అంటూ లేచి, గుమ్మంలోకి వొక్కటే వురక. అక్కణ్ణుంచి వీధిలోకి వొక్కటే అంగ.

•••

శంకరప్ప సందు మళ్లాటప్పటికొక పెద్ద భవంతి కనపడింది. మండువా వాకట్లోనుంచి చదరంగానికి సంబంధించిన ఘర్షణ వినవచ్చింది.

లోపల యిద్దరు బ్రాహ్మణ యువకులు చదరంగం ఆడుతున్నారు. వారికిద్దరికీ చెరో సలహాదారూ దగ్గిరసా కూచుని వున్నారు. ఒక్కమాటు నలుగురి మొగాలూ చూశాడు. బలమున్నూ చూశాడు. స్తంభానికానుకు నుంచున్నాడు. అరగడియ గడిచినా యెత్తు పడలేదు. శంకరప్ప విసిగిపోయాడు. ''ఏమండీ, యెత్తు వెయ్యరేం?'' అని సరసంగానే అడిగాడు.

''నీకెందుకయ్యా మా గొడవ'' అని సలహాదారు మిడుతూ చూసి కొంచెం విసుక్కున్నాడు.

''మీ గొడవ నా కెందుకూ? ఆట గొడవ అడుగుతున్నాను.''

''నాల్గుగ్ఘళ్ల పొద్దెక్కేటప్పటికి ఆట యీ స్థితికి వచ్చింది.''

''ఇంతమంది– యింతసేపు– యిందులో యేం వుందీ?''

ఆటకాడి కిది కొట్టినంత పని చేసింది. బుస్సుమంటూ మొగం పైకెత్తి ''చదరంగం అంటే మీ కేమయినా తెలుసా?'' అని అడిగాడు.

ఆటగాడి మొగం మీద చక్కని వర్చస్సు కనపడింది శంకరప్పకి. ''ఇతగాణ్ణి భృత్యుణ్ణి చేసుకు తీరాలి'' అని నిశ్చయించుకున్నాడు. ''వారి ఆట నేను కట్టిస్తాను. నేను చెప్పినట్టెత్తు వెయ్యండి'' అన్నాడు.

''అయితే సలహా చెప్పు'' అని బల్లకేసి తిరిగా డాటగాడు.

''ఎన్ని యెత్తుల్లో ఆట కట్టమంటారు?''

''సొరకాయలు నరుకుతున్నావే!''

''మీ నల్లగది శకటు వారి గుర్రం ముందు వెయ్యండి''అన్నాడు శంకరప్ప. చెప్పినట్టు వేశాడు ఆటకాడు.

''వోస్! అయితే, మరి, గుర్రం యిక్కడ వేశాను'' అన్నాడు ప్రతిపక్షి.

''ఆ బంటుతో మీరు తోసిరాజనండీ!''

''అరే, అరే'' అంటూ ఆటగాడు ఆశ్చర్యపడ్డాడు. ''మహానుభావా'' అని శంకరప్పను కౌగిలించుకున్నాడు.

''అయ్యా, యీపూట మీరు భోజనానికి మా యింటికి దయచెయ్యాలి'' అని ఆహ్వానించాడు సలహాదారు.

''మీ అనుగ్రహానికి సంతోషం. నే నింతలో యీవూరు విడిచివెళ్లను. ఇప్పటికి నన్ను విడిచిపెట్టండి.'' అని శంకరప్ప చెయ్యి విడిపించుకున్నాడు.

దాంతో రామశాస్త్రీ, యాజులూ ఆయన సహచరులయ్యారు.

•••

తర్వాతి ఆట పంతులుతో. మరో ఆట రాజుతో. ఒక తెలగా, ఒక వైశ్యుడూ, ఒక బ్రాహ్మడూ.

''మూడెత్తుల్లో ఆట కట్టేస్తారు వీరు'' అని శంకరప్పను పరిచయం చేయసాగారు శాస్త్రీ, యాజులూ.

''అంత సమర్థులా వారు'' అని ఎదుటివారు అనుమానపడటమూ, తర్వాత నోరు కుట్టేసుకోవడమూ.

మరో ఆట భీమరాజుతో. ఇంకో ఆట కృష్ణంరాజు గారితో. అటుపై దుర్వాసుల ఆదివారాహమూర్తితో.

''కుడివైపునున్న మన యేనుగుని వారి శకటు దగ్గిరగా వేయించండి.''

''మన యెర్రగది శకటు రాజుకి అయిమూల గదిలో పడెయ్యండి.''

పెద్దాపురంలో పేరుపడ్డ ఆటగాళ్లు చిత్తయిపోయారు. తంగిరాల శంకరప్ప పేరు చుట్టుపట్ల రామనామం అయిపోయింది. అనేకులు పట్టంచుల చాపులివ్వ వచ్చారు. ఉప్పాడ జరీజామార్లు కట్టబెట్టపోయారు. బరంపురం తాపితాలు సమర్పించపోయారు. కాశ్మీర శాలువాలు కప్పపోయారు. శంకరప్ప వొకటీ పుచ్చుకోలేదు.

సామంతులూ, సేనాధిపతులూ, రాజబంధువులూ, రాజపురుషులూ, సంపన్నులూ, సరసులూ కోరి శంకరప్పతో ఆడి, ఆట కట్టించుకుని, అదే తమకొక గొప్పగా ఆనందించసాగారు. పాలకీ, పదహారుగురు బోయీలు, పది పదిహేనుగురు భటులు ''చామర్లకోట శ్రీ రావు రాయడప్ప రంగా రాయణింగారి మనుష్యులం'' అంటూ వచ్చారు. రాజనర్తకి అలివేణి, మహారాజు సన్నిధిని వుండవలసిన నలుగురు వేశ్యలలోనూ వొకతె రంగనాయిక కూడా శంకరప్ప ప్రతిభను చూసి 'ధన్యులు' అయినారు.

•••

''పట్నంలో కెవరో అసాధ్యపు ఆటకాడు వచ్చారుట, మీ కేమయినా జాడ?''

''లేదు మహాప్రభూ!''

రాజ కార్యాలన్నీ ముగించుకుని, పెద్దాపురం కోటలో, మహా రాజాధిరాజ, పేషణి హనుమంత, నెలవోలు గండాంక శ్రీ వత్సవాయి చతుర్భుజ తిమ్మజగపతి మహారాజు లక్కమేడ వసారాలో పచారుజేస్తున్నారు. కాగితాలు చేత పట్టుకుని దివాన్జీ మాట్లాడుతున్నాడు.

''ఊరంతా కోడయికూస్తోందిట– మీకు తెలవకపోవడం యేమిటండీ?'' మహారాజు అసంతృప్తి కనపరిచాడు.

దివాన్జీ వెళ్లిపోయిన తర్వాత, ఆట దగ్గర కూర్చోకుండానే ''గోడ అవతల నుంచుని నాలుగెత్తుల్లో'' ఆట కట్టించిన శంకరప్ప గొప్పతనాన్ని వివరించింది 'రంగి'.

ఈలోగా దాట్ల అప్పలనరసింహరాజు లోగిట్లో వత్సవాయి విజయరామరాజుతో ఆడుతుండగా– ప్రౌఢ, మధ్య, ముగ్ధలు చిలకలు చుడుతూ, విసనకర్ర విసురుతూ, బంగారపు గంధపు గిన్నెలతో యేకాగ్రత భంగపరిచేందుకు ప్రయత్నించినా వికారం యేమీ కనబరచకుండా శంకరప్ప నెగ్గాడు.

''తమ రొక్కమాటు మహారాజులుంగారితో ఆడాలండీ!''

•••

పాలకీ కోటగుమ్మంలోకి వెళ్లింది. శంకరప్పకు ఠాణేదారు నమస్కరించాడు. దివాన్జీ ఆహ్వానించాడు. మహారాజుకి శంకరప్ప దగ్గిర మహేశ్వరాంశ కనబడింది. మహారాజు దగ్గిర శంకరప్పకి విష్ణ్వంశ ద్యోతకం అయింది.

రంగ నాయిక బలం సద్ది వుంది. ఒక పక్షానికి కెంపులూ, వొక పక్షానికి పచ్చలూ పొదిగిన బంగారపు బలం అది. పచ్చల వేపు శంకరప్ప, కెంపుల వేపు మహారాజు. ఆ నడకే కొత్తగా సాగింది. దిగ్గంతుల ద్వంద్వయుద్ధం భయంకరమే. అయినా ద్రష్టలకు దర్శనీయమే. తాపీగా ప్రారంభం అయిన ఆట నాలుగ్ఘడియలు గడిచేటప్పటికి ''యెత్తు పడదేం?'' అన్న స్థితికి వచ్చింది. మరో గడియ. మన్నాడు. తరువాత. వారాలు, మాసాలు. ''నెగ్గేశాం పెద్దమ్మా. ఆరుమాసాలకయినా ఆట కట్టిందని మహారాజు వొప్పుకోవలసిందే.''

•••

ఠాణేదారుకి దేవిడిమన్నా అయిపోయింది. పెద్దాపురంలో ఉండటానికే లేదు. దివాన్జీ మీద వీరభద్రావతారం తాల్చేశారు మహారాజు.

చివరికి ఒకరోజు మహారాజు శంకరప్పని కౌగలించుకున్నాడు. ''చదరంగంలో నాకిదే మొదటి వోటమి. ఇంతటి ఉత్కటానందం నాకింతవరకు కలగలేదు. పెద్దాపురం రాజ్యంలో వున్నది యేమయినా సరే తమకి సమర్పించుకుంటాను, సెలవిప్పించండి.''

''చదరంగానికి అరవై నాలుగు గదులు. మొదటి గదిలో వొక వడ్లగింజ వుంపించండి. తరవాత రెండో గదిలో రెండు, మూడో గదిలో నాలుగు, నాలుగో గదిలో యెనిమిది– యిలాగా వెళ్లినకొద్దీ రెట్టింపుచేయిస్తూ నాకు వడ్లగింజలు దయచేయించండి మహాప్రభూ!''

విషయం ఎవరికీ బోధపడినట్టులేదు.

•••

''ఏమి, లెక్క తేలిందా?'' అడిగాడు మహారాజు.

''మహాప్రభూ! వారి కోరిక తీర్చాలంటే పెద్దాపురం రాజ్యంలోనే కాదు, త్రిలింగ దేశం అంతటా వరాసగా నూరు సంవత్సరాలు పండిన ధాన్యం అయినా చాలదు'' అంటూ షరాబు కాగితం మహారాజు కందించాడు.

రాజ్యమే సమర్పించుకునేందుకు మహారాజు సిద్ధపడ్డాడు. శంకరప్ప అంగీకరించలేదు. చివరకు సర్వలక్షణ సంపన్నమైన అగ్రహారం, పెద్దమ్మకు సాలీనా నూటాపదహారు రూపాయల బహుమానం, శాస్త్రీ, యాజుల్లకు చెరొక నూటపదహారు రూపాయల బహుమానం ఏర్పాటు చేసి, శంకరప్పను దగ్గిర వుండి గజారోహణం చేయించాడు మహారాజు.



శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి (1891–1961) 'వడ్లగింజలు' ఇది. 1941లో ప్రచురితమైంది. 73 పేజీల కథని కేవలం 950 పదాల్లో చెప్పే ప్రయత్నం జరిగింది. కథక చక్రవర్తి అనిపించుకున్న శ్రీపాద ఆత్మకథ 'అనుభవాలూ జ్ఞాపకాలూను' తెలుగులోని గొప్ప పుస్తకాల్లో ఒకటి.

పదం పలికింది - పాట నిలిచింది

# తోట పూలన్నీ కనీ వినీ పడేను వేదన

పెళ్లి సందడి కోసం వేటూరి సుందరరామ్మూర్తి రాసిన ఈ పాటలోని విశేషం, తెలుగింటి ఆడపిల్ల– కాబోయే శ్రీవారికి ప్రేమతో రాసి పంపిన ప్రియ రాగాల లేఖలో కుశలాన్ని తాను అడగకుండా జాంచెట్టు, చిలకమ్మలతో అడిగించటమే. తన యాతన విని తోటలోని పూలే వేదన పడుతున్నాయట. ప్రియుడితో పరోక్షంగా సంభాషించడం భారతీయ కావ్యాల్లో ఉన్నదే. అయినా ముచ్చటగొలిపే పద్ధతి. దీనికి సంగీతం కీరవాణి. పాడినవారు చిత్ర. 1996లో వచ్చిన ఈ చిత్రానికి దర్శకుడు కె.రాఘవేంద్రరావు. రవళి, దీప్తి భట్నాగర్, శ్రీకాంత్ నటీనటులు.



మా పెరటి జాంచెట్టు పళ్ళన్నీ కుశలం అడిగే
మా తోట చిలకమ్మ నీ కోసం ఎదురే చూసే
నిన్ను చూసినాక నిదురైన రాక
మనసే పెళ్ళి మంత్రాలు కోరిందని
బిగి కౌగిట హాయిగ కరిగేది ఏ నాడని– అంటూ
నిన్ను చూడందే పదే పదే పడే యాతన
తోట పూలన్నీ కనీ వినీ పడేను వేదన
నువ్వు రాకుంటే మహాశయా మదే ఆగునా
పూల తీగల్లో పడే ఉరే నాకింక దీవెనా
చూసే కన్నుల ఆరాటం రాసే చేతికి మోమాటం
తలచి వలచి పిలచి అలసి
నీ రాక కోసం వేచి వున్న
ఈ మనసుని అలుసుగ చూడకనీ– అంటూ
పెళ్ళి చూపుల్లో నిలేసినా కథేమిటో మరీ
జ్ఞాపకాల్లో చలేసిన జవాబు నువ్వనీ
సందె పొద్దుల్లో ప్రతీ క్షణం యుగాలై ఇలా
నీటి కన్నుల్లా నిరీక్షణం నిరాశ కాదనీ
తప్పులు రాస్తే మన్నించు తప్పక దర్శనమిప్పించు
యెదటో నుదుటో ఎచటో మజిలీ
నీ మీద ప్రాణం నిలుపుకున్న మా
మనవిని విని దయచేయమనీ– అంటూ

సాహిత్య మరమరాలు

## అపర త్యాగరాజు

ఒక ప్రముఖ సంగీత విద్వాంసుడి సన్మాన సభ ఘనంగా జరుగుతోంది. ముఖ్య అతిథి కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ. అందరూ ఆ గాయకుడిని అపర త్యాగరాజు అని కీర్తించసాగారు. విశ్వనాథ వంతు వచ్చింది. ''నేను రామాయణం వ్రాశాను కదా, నన్ను అపర వాల్మీకి అంటే ఎంత నిజమో, వీరిని అపర త్యాగరాజు అనటం అంతే నిజం'' అని వ్యాఖ్యానించారట. అల్ప ప్రతిభావంతులను కూడా అపర వ్యాసుడనీ, అపర కాళిదాసనీ వ్యాఖ్యానించడం విశ్వనాథకు నచ్చదన్నమాట.



♦ డి.వి.ఎం.సత్యనారాయణ

## రారండోయ్

- కె.ఎల్.కాంతారావు 'వాల్మీకి చెప్పిన రామాయణ గాథ' ఆవిష్కరణ జూన్ 24న సా. 5:30కు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనుంది. ఆవిష్కర్త: కె.శివారెడ్డి. నిర్వహణ: తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం.
- ఎన్.గోపి చైనా కవితలు, జీవన భాష కవితాసంపుటాల ఆంగ్లానువాదాలు చైనా పోయెమ్స్, లైఫ్ స్పీక్స్ ఆవిష్కరణ సభ జూన్ 25న సాయంత్రం 6 గంటలకు ఎన్సీటీ సమావేశ మందిరం, ఆంధ్ర మహిళా సభ కాలేజ్ క్యాంపస్, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరగనుంది. ఆవిష్కర్త: ఉప్పలూరి ఆత్రేయశర్మ. నిర్వహణ: మహిత సాహితి.
- డాక్టర్ బి.బాలకృష్ణ కవితా సంపుటి కలలగూడు ఆవిష్కరణ జూన్ 25న సాయంత్రం 6 గంటలకు రవీంద్ర భారతి మినీ హాల్‌లో జరగనుంది. ఆవిష్కర్త: నందిని సిధారెడ్డి. ఏనుగు నరసింహారెడ్డి, మామిడి హరికృష్ణ, సిద్ధార్థ, బి.చంద్రశేఖర్ పాల్గొంటారు.
- ఎం.ఎస్.కె.కృష్ణజ్యోతి కథల సంపుటి కొత్త పండగ ఆవిష్కరణ జూన్ 29న సాయంత్రం 5 గంటలకు విజయవాడలోని ఎస్.ఆర్.ఆర్. & సి.వి.ఆర్. కళాశాల కాన్ఫరెన్స్ హాలులో జరగనుంది. వెలగా జోషి, పాపినేని శివశంకర్, వేంపల్లె షరీఫ్, కాకుమాని శ్రీనివాసరావు పాల్గొంటారు. నిర్వహణ: సిరా ముద్ర ప్రచురణలు.
- తల్లావఝుల శివాజీ 'త్రిపథ' పరిచయ సభ జూన్ 30న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్, దోమలగూడలోని హైదరాబాద్ స్టడీ సర్కిల్‌లో జరగనుంది. నిర్వహణ: ఛాయ.
- 'తెలంగాణ ఉద్యమాలు– సాహిత్య సంస్థలు– సాహిత్యం' అంశంపై తెలంగాణ రచయితల సంఘం నిర్వహణలో జూన్ 30న ఉదయం 10 నుండి రాత్రి 9 వరకు తెలంగాణ సారస్వత పరిషత్తు, అబిడ్స్‌లో సమావేశాలు జరగనున్నాయి. ప్రారంభ సభలో నందిని సిధారెడ్డి, కె.రామచంద్రమూర్తి, కె.శ్రీనివాస్, నాళేశ్వరం శంకరం, వి.శంకర్ పాల్గొంటారు. గంభీరావుపేట యాదగిరి గల్మ కవితాసంపుటి, బైస దేవదాసు సంపాదకత్వం వహించిన నీళ్లగోస కవితా సంకలనం ఆవిష్కరణ కానున్నాయి. పది విభాగాలుగా కవి సమ్మేళనాలు జరగనున్నాయి.

# యుద్ధంలో చివరి మనిషి

కొత్త బంగారం





విలియమ్ ఫ్రెడరిక్ హర్మన్స్

తూర్పు ఐరోపా. 1944. రెండవ ప్రపంచ యుద్ధపు ఆఖరి నెలలు. డచ్ నవలిక అయిన 'యాన్ అన్‌టచ్‌డ్ హౌస్'లో– పేరు, నేపథ్యం ఉండని ఒక డచ్ సైనికుడే ప్రధాన పాత్రా, కథకుడూ. అతను తన పక్షపు భిన్న దేశాల సైనిక దళాలతో కలిసి, పేరుండని ప్రాంతంలో యుద్ధంలో పాల్గొంటూ నాలుగేళ్లు కావస్తుంది. జర్మన్లు అతన్ని అనేకసార్లు పట్టుకున్నా, ఎలాగో తప్పించుకోగలుగుతాడు. మురికి పట్టి, దిక్కుతోచకుండా, అలిసిపోయుంటాడు.

ఆ 'హొలాండర్' సైనికుని పటాలం దారి తప్పినప్పుడు, అతను ఒంటరిగా ఒక ఊర్లో ఖాళీగా పడున్న విలాసవంతమైన ఇంట్లోకి ప్రవేశిస్తాడు. చుట్టుపక్కల ఆవహించిన భీతావహమైన వాతావరణం నుండి ఆ ఇల్లు అతనికి తాత్కాలిక ఉపశమనం కలిగించినప్పుడు, 'ఎంతో కాలానికి మొట్టమొదటిసారి ఒక నిజమైన ఇంటికి వచ్చాను,' అనుకుంటాడు. 'యుద్ధం జరగనే లేదు' అనిపించడం మొదలవుతుంది.

అలసట వల్ల బయటి కాల్పులూ, పేలుళ్ళనీ మరచిపోయి, ఆ సంపన్నమైన ఇంట్లో స్నానం, భోజనం చేసి, బీరువాలో ఉన్న బట్టలు తొడుక్కుని వైన్ తాగి నిద్రపోతాడు. జర్మన్ సైన్యం తలుపు తడుతుంది. పట్టుబడకుండా బతికుండేందుకూ, తిరిగి యుద్ధానికి వెళ్ళకుండా తప్పించుకోడానికీ, తానే ఇంటి యజమానినైనట్టు నటిస్తూ, శత్రువులైన ఆ నాజీలకు ఇంట్లో చోటిస్తాడు. వారి కల్నల్ పలికే డాంబికాలను వింటాడు.

ఆ తరువాత, అసలైన ఇంటి యజమాని తిరిగి వచ్చినప్పుడు, 'యీ ఇల్లు, చుట్టూతా ఉన్న పచ్చగడ్డి ఉన్నంత కాలమూ, సమస్త లోకం మాయమైనప్పటికీ నాకెందుకు!' అనుకుంటూ, తన సౌకర్యవంతమైన జీవితాన్ని వదలుకోవడం ఇష్టపడక, అతన్ని చంపేస్తాడు.

జర్మన్లు ఆ ఊరిమీద అధికారాన్ని మరొకసారి కోల్పోయినప్పుడు, తన మారువేషాన్ని వదిలి జయప్రదమైన ప్రజాసైనిక దళాలతో కలిసిపోతాడు. వారందరూ ఉద్రేకంతో ఆ ఇంటిని సర్వనాశనం చేస్తారు. జర్మన్ కల్నల్‌ను పియానో తీగతో కట్టి వేళ్ళాడదీసి, సైనికులను హత్య చేస్తారు. కథకుడు తన వంతుగా ఒక చేతి బాంబును ఇంట్లోకి విసిరి, వినాశనాన్ని పూర్తి చేస్తాడు. ఆఖరిసారి ఆ ఇంటిని చూస్తూ, 'ఇంతకాలమూ ఇది నటిస్తూ ఉండి, ఇప్పుడు మాత్రమే తన నిజ స్వరూపాన్ని చూపించుకుంది. నిజానికి ఇదెప్పుడూ బోలుగానే ఉంటూ, మధ్యభాగంలో కుళ్ళుతూ కంపు కుడుతున్న బిలమే' అనుకుంటాడు. గతంలో యుద్ధ తాకిడికి గురవని ఆ ఇంటి కథ అలాగున ముగుస్తుంది.

తన్ని తాను సమర్థించుకుంటూ, 'యుద్ధాలు జరగకపోయినా కానీ మృత్యువు ఎవరినీ వదలదు. తేడా ఏముంది?' అని ప్రశ్నిస్తాడు కథకుడు. అతనికి కారణాలు కానీ నైతికత కానీ అనవసరం. బతికుండటమే అత్యవసరం. బాధితులకీ, అపరాధులకీ మధ్య నుండే తేడా కనిపించదు. యుద్ధపు హింసాత్మక ప్రవర్తనలో– సభ్యత అనే ముసుగు జారినప్పుడు కలిగే తీవ్రమైన భయాన్ని, వణుకు పుట్టించేలా వర్ణిస్తారు డచ్ రచయిత విలియమ్ ఫ్రెడరిక్ హర్మన్స్ (1921–95). నూటా ఇరవై పేజీల యీ చిన్న పుస్తకం– మానవత్వానికుండే క్రూరత్వాన్ని కనబరుస్తుంది. విజేతలంటూ ఎవరూ ఉండని యుద్ధానికుండే అసంబద్ధత యొక్క నిస్తేజ చిత్రణ ఇది.

కేవలం ఒకే అధ్యాయంతో నడిచే నవలికలో– కథనం పరధ్యానంగా చెప్తున్నట్టుంటుంది. ఇంపైన శైలే అయినా భాషలో నిశ్శబ్దమైన కఠినత్వం కనబడుతుంది.1951లో ప్రచురించబడిన పుస్తకాన్ని డేవిడ్ కోమర్ ఇంగ్లిష్‌లోకి అనువదించారు. పుష్కర్ ప్రెస్ దీన్ని 2018లో ప్రచురించింది.

1939 సెప్టెంబర్ 1న నాజీ జర్మనీ– పోలండ్ మీద దాడి మొదలుపెట్టిన రోజే హర్మన్స్‌కు 18 ఏళ్ళొచ్చాయి. సంవత్సరంలోపే తన దేశమైన నెదర్లాండ్స్ కూడా పోలండ్‌ను అనుసరిస్తూ జర్మన్ ఆక్రమణ కిందకి రావడాన్ని చూశారాయన. అది ఇంచుమించుగా 1945లో యుద్ధం పూర్తయేవరకూ కొనసాగింది. హర్మన్స్ తొలిరాతలు ప్రపంచయుద్ధాన్నే ఇతివృత్తంగా చేసుకుని రాసినవి. ఆయన రాతలన్నీ జ్ఞానాత్మక శూన్యవాదంపైనే ఆధారపడినవి అంటారు పండితులు.

♦ కృష్ణ వేణి

# ఆఖరి వాంగ్మూలం

ప్రతిధ్వనించే పుస్తకం



జపాన్ రచయిత సొసెకి నట్సుమే (1867–1916) గురించి ఎందుకో ఆసక్తి కలిగి వెతుకుతూవుంటే ఆయన ఒక పుస్తకం 1957లోనే తెలుగులోకి అనువాదమైందని తెలిసి ఆశ్చర్యానందాలు కలిగాయి. ఆ నవల పేరు కోకొరొ. ఈ జపనీస్ మాటకు విస్తృతమైన అర్థం ఉంది. హృదయం, ఆత్మ, మనసు– ఇవన్నీ కలిసినది. కోకొరో చెదిరిపోయిన ఒక ప్రొఫెసర్ కథ ఇది. ఈ నవలను ఆదర్శ గ్రంథమండలి, విజయవాడ ప్రచురించింది. అనువాదకులు శ్రీనివాస చక్రవర్తి.

నవల తొలి ప్రచురణ 1914లో. సొసెకి మరణానికి రెండేళ్ల ముందు. మూడు భాగాలుగా ఈ నవల ఉంటుంది. సెన్సే–నేను, నా తల్లిదండ్రులు–నేను, సెన్సే– అతని ఆఖరి ఉత్తరం. సెన్సే అనేది ఒక గౌరవసూచిక. గురువు అని అర్థం చెప్పుకోవచ్చు.

ఈ నవల ఎంత ప్లెయిన్‌గా సాగుతుందంటే పెద్ద కథ ఒకటి ఉన్నట్టు అనిపించదు. మొదటి రెండు భాగాలు కూడా సెన్సే ఈ ప్రపంచంలోంచి వెళ్లిపోవడానికి ముందు తాను అంతకుముందు కథకుడితో వాగ్దానం చేసినట్టుగా రాయబోయే సుదీర్ఘలేఖకు తగిన ఉద్వేగాన్ని నిర్మించిపెట్టేవే. సెన్సే తనను తాను కూడా ఎందుకు ప్రేమించుకోలేకపోతున్నాడనే విషయానికి కారణమైన నైతిక అపరాధ భావనను ఈ నవల చిత్రించినట్టుగా కనబడుతుంది. కానీ దానికంటే కూడా మనిషికి ఒంటరితనమే ప్రధాన సమస్య అని అంతర్లీనంగా చెబుతుంది.

నవలకు ముందుమాటలో శాంతా రంగాచారి ఇలా రాశారు: 'నట్సుమె సొసెకీ మ్యూజీ యుగంలో జీవించడం వల్ల ఆ యుగానికి చెందిన సంస్కృతి, భక్తి విశ్వాసాలు, పాశ్చాత్య భావాల ప్రభావం ఈయన రచనలో ప్రతిబింబించాయి. వీరి ప్రారంభ రచనలో ఎక్కువగా హాస్యం, చమత్కారంతో కూడిన అవహేళన పొడగడుతుంది. ముక్తి, ఆత్మశాంతి కోసం అన్వేషణల విషయమై ఈయన మనసులో చెలరేగిన తుపాను ఈయన రచించిన మూడు నవలలోను ద్యోతకమవుతుంది. జీవిత దృక్పథంలో నిరాశా నిస్పృహలు ఈ కాలంలోనే ప్రారంభమయ్యాయి. ఈ నిరాశా నిస్పృహల మూలంగానే 'కోకొరో' అంతటా విధి సిద్ధాంతపు ప్రాబల్యంతో బాటు, అందులోని పాత్రలు జీవితానికి, విధికి ఏమాత్రం ప్రతిఘటించకుండా తల ఒగ్గినట్లు కనబడుతుంది'.

అయితే, జపనీస్ ఎటూ చదవలేనుగానీ ఇంగ్లిష్‌లో ఈ నవల ఎలా ఉందోనని చూస్తే గ్రహించిన విషయం– ఈ తెలుగు అనువాదం సంక్షిప్తంగానే చేసిందని. మూడింట ఒకటోవంతు మాత్రమే తెలుగులోకి వచ్చింది. అందుకే ప్రారంభ వివరాల్లో ఒక గొలుసు ఏదో తెగినట్టు అనిపించింది. కథేమీ జరగదు. కానీ కథకుడికీ సెన్సేకూ పరిచయం కావడానికి దారితీసిన పరిస్థితిని చాలా వాస్తవికంగా చిత్రిస్తాడు సొసెకి. కథకుడు ఒంటరిగా సముద్రానికి ఈతకని వెళ్లడం, సెన్సే ఓ తెల్లాయనతో రావడం, ఎవరు ఎవరినీ పట్టించుకోనంతటి గుంపులో ఒక కన్ను సెన్సే మీద పడటానికి అదో కారణం కావడం, రెండ్రోజుల తారసపాటు తర్వాత ఆ మాట్లాడుకునే మొదటి మాట... ఇదంతా. అయినా సారం గ్రహించడానికి తెలుగు అనువాదం సరిపోతుంది.

https://archive.org/details/in.ernet.dli.2015.333881 లింక్‌లో ఉచితంగా చదవొచ్చు.

♦ ఎస్.ఎస్.


మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ ॥ సోమవారం
24-6-2019



మాఫియాలోకి స్వాగతం
– సినిమా పేజీలో



'ముల్క్' చిత్రంలో రిషి కపూర్
'భారత్' చిత్రంలో సల్మాన్‌ఖాన్
'సాత్ ఖూన్ మాఫ్' చిత్రంలో ప్రియాంక చోప్రా
'సాండ్ కీ ఆంఖ్' చిత్రంలో భూమి ఫడ్నవిస్, తాప్సీ పన్ను
'దంగల్' చిత్రంలో ఆమిర్‌ఖాన్
'గులాబో సితాబో' చిత్రంలో అమితాబ్
'సర్‌బ్‌జిత్' చిత్రంలో ఐశ్వర్యారాయ్

# నెరిసినా మెరుస్తున్నారు

**స్టార్‌డమ్ అంతా నల్లటి జుట్టు చుట్టూ ముడిపడి ఉంటుంది. జుట్టు నెరిసిందా డమ్ అంతా ఢామ్ అంటుంది. అయినా సరే స్టార్లుగా కొనసాగే యోగం, భోగం కొద్దిమందికే దక్కుతుంది. వయసును గమనించుకుని అందుకు తగ్గ పాత్రలు చేస్తూ గ్లామర్‌ను నిలబెట్టుకునే హీరోలు ఉన్నారు. క్యారెక్టర్‌లో బలం ఉంటే వయసు మళ్లిన పాత్రైనా చేస్తామంటున్నారు. నెరిసిన జుట్టుతో దమ్ము చూపుతూ బాలీవుడ్ కలెక్షన్లను సాధిస్తున్న హీరోల కథనం ఇది.**

రెండు రోజుల క్రితం మీడియాలో వచ్చిన అమితాబ్ ఫొటో ఒకటి అందరినీ కుతూహల పరిచింది. దాదాపు గుర్తుపట్టలేనంత ముసలితనంతో ముఖంతో ఒక ముస్లిం క్యారెక్టర్ పోషిస్తున్న అమితాబ్ స్టిల్ అది. సినిమా పేరు 'గులాబో సితాబో'. గతంలో అమితాబ్‌తో 'పికూ' వంటి సూపర్ హిట్ ఇచ్చిన సూర్జిత్ సర్కార్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. ఇటీవల 'అంధా ధున్' వంటి పెద్ద హిట్ ఇచ్చిన ఆయుష్మాన్ ఖురానా ఇందులో మరో హీరో. ఉత్తర ప్రదేశ్ ప్రాంతానికి చెందిన ఈ కథలో బహుశా ముస్లిం కుటుంబంలోని ఘర్షణ కథాంశం కావచ్చు. నిజానికి 'వృద్ధుణ్ణి' ఒక కమర్షియల్ హీరో చేయవచ్చు అనడానికి కమల్ హాసన్ 'భారతీయుడు' ఒక దారి వేసింది. దానికి ముందు కమల్ హాసనే 'ఖైదీ వేట' సినిమాలో వృద్ధుడుగా ఉంటూ విలన్‌లను వేటాడే సినిమా చేసి హిట్ కొట్టినా 'భారతీయుడు' దేశమంతా తెలిసిందని చెప్పవచ్చు. అయితే ఆ ట్రెండ్ హిందీలో పూర్తిగా అందుకోవడానికి కొంత కాలం పట్టింది.

### ఆశ్చర్యపరుస్తున్న అమితాబ్

అమితాబ్ దేశ సినీ రంగానికి ఒక కొత్త వొరవడిని ఇవ్వడమే కాదు ఇమేజ్ ఉన్న నటుడు బాసటగా నిలిస్తే కొత్త కొత్త కథలు పుడతాయని కూడా నిరూపిస్తున్నాడు. నిజానికి ఒకప్పుడు అమితాబ్ తీవ్ర కష్టాల్లో ఉన్నాడు. కొత్త హీరోలు షారూక్, సల్మాన్, ఆమిర్ వంటి వారు విజృంభించాక తాను ఎలాంటి పాత్రలు చేయాలో తెలియక, మరొకవైపు సొంత నిర్మాణ సంస్థ 'ఏ.బి.సి.ఎల్' నష్టాల్లో కూరుకుపోయి పడిన కష్టాలు అన్నీఇన్నీ కావు. ఆ సమయంలో సంధి పాత్రలు పోషించిన సినిమాలు 'మృత్యుదాత', 'మేజర్ సాబ్', 'లాల్ బాద్‌షా', 'సూర్యవంశం' ఘోరంగా బోల్తా కొట్టాయి. వేషాలు రాని ఆ రోజుల్లో యశ్‌చోప్రాను శరణు జొచ్చితే అమితాబ్ తన వయసును 'యాక్సెప్ట్' చేసేలా ఆయన ఇచ్చిన పాత్ర 'మొహబ్బతే'లో కాలేజీ ప్రిన్సిపాల్ పాత్ర. ఆ పాత్రతో అమితాబ్ ఊపిరి పీల్చుకున్నాడు. ఆ తర్వాత కరణ్ జొహర్ 'కభీ ఖుషీ కభీ గమ్' సినిమాలో కూడా తండ్రి పాత్ర ఇచ్చి ఇమేజ్‌ను నిలబెట్టాడు. దాంతో ప్రేక్షకులు అమితాబ్‌ను పెద్ద తరహా పాత్రల ఇమేజ్‌ను నిలబెట్టే నటుడుగా స్వీకరించారు. లేదా పెద్ద తరహా పాత్రలతో ఇమేజ్ నిలబెట్టుకుంటున్న నటుడుగా కూడా చూడటం మొదలుపెట్టారు. అందుకే అమితాబ్, హేమ మాలిని తల్లిదండ్రులుగా నటించిన 'బాగ్‌బన్' హిట్ అయ్యింది. సంజయ్ లీలా బన్సాలీ అమితాబ్‌ను ఏకంగా ఒక అల్జైమర్స్ పేషంట్‌గా మార్చి తీసిన 'బ్లాక్' బ్రహ్మాండమైన హిట్ అయ్యింది. అమితాబ్ అనుభవం, ఇమేజ్ ఇప్పుడు దర్శకులకు కొత్త దారి చూపించింది. వృద్ధులలో వయసు మళ్లిన వాళ్లలో కూడా హీరోలుంటారు. వాళ్లవీ విజయ గాథలుంటాయి. కథలుంటాయి. వాటిని తెర మీద చూపించాలి అనుకున్నారు. అలా అమితాబ్‌తో తయారైన కథలు అద్భుతంగా రాణిస్తున్నాయి. 'సర్కార్ రాజ్', 'పా', 'షమితాబ్', 'పికు', 'పింక్', '102 నాట్ అవుట్' అవన్నీ అమితాబ్ ఇలాంటి పాత్రలు చేస్తారని అనుకుని రాసుకున్న కథలు. జనం మెచ్చిన కథలు. అమితాబ్ తన కెరీర్ పీక్‌లో ఉండగా రెండు మూడు దశాబ్దాల పాటు తన స్టార్‌డమ్ చట్రంలో ఇరుక్కుపోయాడు. కొత్తది ట్రై చేయలేకపోయాడు. తనలోని ఆర్టిస్ట్‌ను బయట పడేయలేకపోయాడు. ఇప్పుడు అమితాబ్‌కు ఆ అవకాశం దొరికింది. ఇప్పుడు అమితాబ్ ఒక సమున్నతమైన నటుడు.

### రిషి కపూర్ ప్రయోగం

ఒకప్పుడు ఆడపిల్లల కలల రాకుమారుడిగా ఉన్న రిషి కపూర్ వృద్ధపాత్రలు తీసుకోవడమే కాదు తన నటనా సామర్థ్యంతో వాటిని నిలబెడుతున్నాడు. 'కపూర్ అండ్ సన్స్'లో తొంభై ఏళ్ల వృద్ధుడిగా రిషి కపూర్ నటించి మెప్పించడం సామాన్యం కాదు. వృద్ధుడైన కొడుక్కి ఇంకా వృద్ధుడైన తండ్రి ఉంటే ఎలా ఉంటుందో చూపే '102 నాట్ అవుట్'లో అతి వృద్ధ అమితాబచ్చన్‌కు బట్టనెత్తి ఉన్న వృద్ధ కొడుకుగా రిషి కపూర్ నటించాడు. ఈ వయసులో ఒక సినిమాను హిట్ చేసే సత్తా ఉందని వృద్ధ ముస్లిం తండ్రిగా నటించిన 'ముల్క్' సినిమాను హిట్ చేసి నిరూపించాడు. ఇక అనిల్ కపూర్ 'దిల్ ధడక్‌నే దో', 'ఫానీ ఖాన్', 'ఏక్ లడ్‌కీ కో దేఖాతో ఐసా లగా' సినిమాలలో వృద్ధ పాత్రలు పోషించి మెప్పించాడు. సైఫ్ అలీ ఖాన్ 'బాజార్'లో శ్రీమంతుడైన ఒక బిజినెస్ టైకూన్‌గా వృద్ధపాత్ర పోషించి సత్తా చాటుకున్నాడు.

### ఒకప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్టులు

ఒక సినిమాలో హీరో ఎప్పుడూ కుర్రవయసులో ఉంటాడు. వయసు మళ్లిన పాత్రను సినిమా డిమాండ్ చేస్తే క్యారెక్టర్ ఆర్టిస్టులు ఆ పాత్రలు చేసి సినిమాలు నిలబెట్టేవారు. 'షోలే' సినిమాలో సంజీవ్ కపూర్ వేసిన పాత్ర ఆ సినిమాను నిలబెట్టింది. దిలీప్ కుమార్ హీరో కాకపోయినా చాలా సినిమాలకు హీరో స్థాయిలో తన క్యారెక్టర్లను పోషించాడు. 'క్రాంతి', 'కర్మ', 'శక్తి', 'సౌదాగర్' ఇవన్నీ దిలీప్ నెరిసిన జుట్టు నిలబెట్టిన సినిమాలు. అనుపమ్ ఖేర్ 'సారాంశ్'లో పోషించిన వృద్ధుడి పాత్ర ఎవరు మర్చిపోగలరు? ఇటీవలి క్యారెక్టర్ ఆర్టిస్టులు ఎంతో కన్విక్షన్‌తో వృద్ధ పాత్రలు పోషిస్తున్నారు. ఇర్ఫాన్ ఖాన్ 'లంచ్‌బాక్స్'లో, మనోజ్ బాజ్‌పాయ్ 'అలిఘర్'లో, నవాజుద్దీన్ సిద్దిఖీ 'బద్‌లాపూర్' వంటి సినిమాలలో తెల్లబడిన జుట్టుతో నటించి పాత్రలను నిలబెట్టారు.



'చక్ దే ఇండియా' చిత్రంలో షారుక్‌ఖాన్

### కొత్త కథల కొనసాగింపు

ఈ ట్రెండ్ కొనసాగి హీరోయిన్‌లు కూడా వయసు మళ్లిన పాత్రలు చేసే పరిస్థితి ఏర్పడింది. సాక్షాత్తు ఐశ్వర్యారాయే 'సర్‌బ్‌జిత్'లో వృద్ధపాత్ర పోషించింది. ప్రియాంకా చోప్రా 'సాత్ ఖూన్ మాఫ్'లో వృద్ధస్త్రీ పాత్ర పోషించింది. ఇప్పుడు తాజాగా రూపొందుతున్న 'సాండ్ కీ ఆంఖ్'లో భూమ్ ఫడ్నవిస్, తాప్సీ పన్నులు ఏకంగా డెబ్బై ఎనభై ఏళ్లు ఉన్న స్త్రీలుగా నటిస్తున్నారు.

వయసు మనసుకేగానీ శరీరానికి కాదు. గుండె పటుత్వంతో ఉంటే దమ్ము బలంగా తీసుకునే చేవ ఉంటే ఆ చేవ క్యారెక్టర్‌లో తద్వారా స్క్రీన్ మీద మెరుస్తుంది. అపజయానికి తెల్లజుట్టు కేవలం ఒక మిష మాత్రమే అని నిరూపిస్తున్న వీరందరూ కొత్తకథలకు సారథులు... కొత్తమార్గాలకు వారథులు.

### ఖాన్‌ల తెల్లమీసం

ఆమిర్ ఖాన్ 'దంగల్' చేయడం దేశంలో ఉన్న తండ్రులకు, తాతలకు, జుట్టు తెల్లబడ్డ వారికి తమక్కూడా ఒక కథ ఉంటుంది హీరోయిజం ఉంటుంది అని చెప్పుకునే అవకాశం రావడం. ఇద్దరు ఆడపిల్లల తండ్రిగా వయసు మళ్లినవాడిగా నటించినా కూడా కథలోని బలం వల్ల 'దంగల్' గొప్ప విజయం సాధించింది. హీరోలు అనేవారు అప్పుడప్పుడు నటులుగా మారి పాత్రకు అవసరమైనట్టుగా మారాలని ఆమిర్ ఈ సినిమాతో సందేశం ఇచ్చాడు. ఈ ధైర్యంతో ఇటీవల సల్మాన్ ఖాన్ చేసిన సినిమా 'భారత్'. ఒక డెబ్బై ఏళ్ల ముసలివాడిగా భారత్‌లో సల్మాన్ ఖాన్ నటించినా జనం ఆ సినిమాకు భారీ ఓపెనింగ్స్ ఇచ్చారు. అయితే దీనికి చాలా రోజుల ముందే షారుక్ ఖాన్ 'వీర్ జారా'లో వయసు మళ్లిన పాత్ర వేసినా జనం పూర్తిగా యాక్సెప్ట్ చేయలేదని చెప్పాలి. కాని షారుక్ తన వయసు తగ్గట్టుగా కొద్దిగా నెరసిన గెడ్డంతో నటించిన 'చక్ దే ఇండియా', 'లవ్ యు జిందగీ' జనానికి నచ్చాయి. అయితే జనాన్ని ప్రిపేర్ చేయకుండా సడన్‌గా తెల్లమీసంలో కనబడితే రిజెక్ట్ చేస్తారనడానికి అనిల్ కపూర్ 'లమ్‌హే' ఒక ఉదాహరణ.

---

చెట్టు నీడ

## జ్ఞాని రాసిన లేఖ

ఆయన ఓ గొప్ప జ్ఞాని. ఆయన ఓ రోజు రాత్రి చాలాసేపు ఓ ఆలయంలో ఉండి ఇంటికి ఆలస్యంగా బయలుదేరారు. మార్గమధ్యంలో ఓ తాగుబోతు ఎదురుపడ్డాడు. అతని చేతిలో ఓ సంగీత వాయిద్యం ఉంది. దాన్ని మీటుతూ కనిపించాడు జ్ఞానికి. తాగుబోతు శృతిబద్ధంగా పాడకుండా నోటికి ఇష్టమొచ్చినట్లు పాడుతున్నాడు. అలాగే తన చిత్తమొచ్చినట్లు తన దగ్గరున్న వాయిద్య పరికరాన్ని వాయిస్తున్నాడు. పైగా మధ్య మధ్యలో అతను అటూ ఇటూ వస్తూ పోతున్న వారందరినీ తిడుతున్నాడు. ఆ దారిలోనే ఈ జ్ఞాని కూడా వచ్చారు. తాగుబోతుని చూసారు. తాగుబోతు స్థితిని చూసి ఆయన బాధ పడ్డారు.

> కాసేపటి తర్వాత తాగుబోతు ఆ లేఖలో ఉన్న చిరునామాకు చేరుకున్నాడు. జ్ఞానిని చూడడం తోనే నమస్కరించడంతోపాటు ఆయన కాళ్లపై పడి తనను క్షమించమని ప్రాధేయపడ్డాడు.

అతని దగ్గరకు వెళ్లి ''ఎందుకిలా నడుచుకుంటున్నావు...'' అని జ్ఞాని ఎంతో వినయంగానే అడిగారు. అంతేకాదు, ఇవన్నీ మానేసెయ్ అంటూ.. ఏవో కొన్ని హితవచనాలు చెప్పడం మొదలుపెట్టారు. కానీ జ్ఞాని మాటలు అతనికి కోపావేశాలు తెప్పించాయి. తన చేతిలో ఉన్న వాయిద్యపరికరంతో ఆ జ్ఞానిపై దాడి చేశాడు.

దీంతో జ్ఞాని తలకు బలమైన గాయం తగిలి రక్తం కారింది. అయినప్పటికీ జ్ఞాని ఒక్క మాటా అనలేదు. రక్తం కారుతున్న చోట చెయ్యి అడ్డుపెట్టుకుని నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్లిపోయారు. అంతేకాదు, వాయిద్యం కూడా రెండు ముక్క ముక్కలైంది.

మరుసటి రోజు ఆ జ్ఞాని తాగుబోతు ఎక్కడ ఉంటున్నది వివరాలు అడిగి తెలుసుకుని అతనికి తీపి పదార్థాలు, కాస్తంత డబ్బు ఓ సంచిలో ఉంచి ఓ మనిషితో పంపారు. ఆ మనిషి తన దగ్గరున్న ఉత్తరాన్ని కూడా ఆ తాగుబోతుకి ఇచ్చాడు. అది జ్ఞాని రాసిన లేఖ. 'మీ వాయిద్య పరికరం రెండు ముక్కలవడానికి నా తల కారణమైంది. అందుకు బాధ పడుతున్నాను. కనుక మీకు నేనేదో ఒకటి చేయాలనుకున్నాను. ఈ డబ్బులతో మీరు కొత్త వాయిద్యం కొనుక్కోగలరు.

అలాగే మరొక విషయం. నిన్న రాత్రి మీరు నాతో మాట్లాడిన మాటల్లో ఎన్నో చేదు మాటలు ఉన్నాయి. కనుక మీరు ఇకముందు తీయగా మాట్లాడాలని మిఠాయిలు కూడా పంపాను. ఇవి తిని మీ నాలుకపై ఉన్న చేదుని పోగొట్టుకోండి' అని జ్ఞాని రాసిన లేఖలో ఉంది. అది చదివాక తాగుబోతుకు తన స్థితికి సిగ్గేసింది. తల వంచుకున్నాడు. తనకు లేఖ అందించినతనితో ఏమీ మాట్లాడలేదు. కాసేపటి తర్వాత తాగుబోతు ఆ లేఖలో ఉన్న చిరునామాకు చేరుకున్నాడు. జ్ఞానిని చూడడంతోనే నమస్కరించడంతోపాటు ఆయన కాళ్లపై పడి తనను క్షమించమని ప్రాధేయపడ్డాడు.

**– యామిజాల జగదీశ్**

---

స్పెల్ బీ విజేతలు



## తెలివిటీగలు

ప్రపంచంలో ఎక్కడ ఉన్నా సరే తమ ఉనికిని చాటుకోవడంలో భారతీయులు ఎల్లప్పుడూ ముందుంటారు. ప్రతిష్ఠాత్మకమైన 'స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీ' పోటీల్లో గత దశాబ్దకాలంగా అమెరికాలోని భారత సంతతి విద్యార్థులు విజేతలుగా నిలవడమే ఇందుకు నిదర్శనం. అమెరికాలోని అన్ని రాష్ట్రాలు, ఇతర దేశాల నుంచి ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను వెనక్కినెట్టి మరీ మన చిన్నారులే విజేతలుగా నిలుస్తూ.. భారత మేధా స్థాయిని ప్రపంచానికి చాటి చెబుతున్నారు. కఠిన పదాల ఉచ్చారణను అనుసరించి వాటి స్పెల్లింగ్ చెప్పడం ఈ పోటీ ప్రధాన లక్షణం.

### మొదటి విన్నర్ ఫ్రాంక్

స్పెల్లింగ్ బీ అనే పదం 1875లో మొదటిసారిగా ప్రపంచానికి పరిచయం అయింది. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచేందుకు 'ద కొరియర్ జర్నల్' అనే వార్తా పత్రిక 1925లో 'యునైటెడ్ స్టేట్స్ స్పెల్లింగ్ బీ' కార్యక్రమాన్ని ప్రారంభించింది. వాషింగ్టన్‌లో మొట్టమొదటిసారిగా నిర్వహించిన ఈ పోటీలో ఫ్రాంక్ నౌహసర్ అనే పదకొండేళ్ల పిల్లాడు తొలి విజేతగా చరిత్రకెక్కాడు. గ్లాడియస్ (లాటిన్‌లో ఖడ్గం అని అర్థం) అనే పదానికి సరైన స్పెల్లింగ్ చెప్పి ట్రోఫీని అందుకున్నాడు. అమెరికాలోని కెంటెకీలో జన్మించిన ఫ్రాంక్ తదనంతర కాలంలో అమెరికన్ పేటెంట్ లాయర్‌గా ప్రత్యేక గుర్తింపు పొందారు. జర్మన్ సంతతికి చెందిన ఆయన మార్చి 11, 2011లో మరణించారు.

### 'స్పెల్‌బౌండ్' డాక్యుమెంటరీ

1941లో 'స్క్రిప్స్ హవార్డ్ న్యూస్ సర్వీస్'.. స్పెల్లింగ్ బీ స్పాన్సర్‌షిప్ బాధ్యతలు చేపట్టింది. అప్పటినుంచి ఈ పోటీని 'స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీ' గా వ్యవహరిస్తున్నారు. ప్రతీ ఏటా విధిగా నిర్వహించే ఈ పోటీల్లో 2008 నుంచి భారత సంతతి విద్యార్థులే విజేతలుగా నిలుస్తుండడం విశేషం. అయితే భారతీయులకు స్పెల్లింగ్ బీపై మక్కువ ఏర్పడింది మాత్రం 'స్పెల్‌బౌండ్' అనే డాక్యుమెంటరీతోనే అంటారు ఆంత్రపాలజిస్టులు.

### లక్షా ఇరవై వేల పదాలు

టెక్సాస్‌కు చెందిన విజయ్ రెడ్డి అందరిలాగే తన కొడుకు చేతన్‌ను స్పెల్ బీ చాంపియన్‌గా చూడాలనుకున్నారు. ఎన్నో ఆశలతో పోటీలో అడుగుపెట్టిన చేతన్.. ఏడవ స్థానంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే కొడుకును తీర్చిదిద్దే క్రమంలో ప్రతిష్ఠాత్మక చాంపియన్‌షిప్‌పై ఆసక్తి పెంచుకున్న విజయ్ స్వయంగా ఓ కోచింగ్ సెంటర్‌ను నెలకొల్పారు. దానికి 'జియోస్పెల్' అని నామకరణం చేసి ఇప్పటి వరకు ముగ్గురు భారత సంతతి విద్యార్థులను చాంపియన్లుగా నిలబెట్టారు. సులభ పద్ధతిలో బోధనకై దాదాపు లక్షా ఇరవై వేల పదాలను ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తం చేశారు. అదే విధంగా తరచుగా పరీక్షలు నిర్వహించడం ద్వారా.. తన అకాడమీ విద్యార్థులకు పోటీ నేషనల్స్‌కు సన్నద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో విజయ్‌రెడ్డి పర్యవేక్షణలో కోచింగ్ తీసుకున్న కార్తిక్ నెమ్మాని గతేడాది స్పెల్ బీ చాంపియన్ ట్రోఫీ అందుకోగా.. ఈ ఏడాది అభిజయ్ కొడాలి ఆ ఘనత సాధించాడు. కొడుకు కోసం స్పెల్ బీపై మక్కువ పెంచుకున్న విజయ్‌రెడ్డి ప్రస్తుతం దానిని పూర్తిస్థాయి బిజినెస్‌గా మలచుకుని.. విద్యార్థులను మెరికల్లా తీర్చిదిద్దుతున్నారు.



తనయుడు చేతన్‌తో విజయ్

### భారతీయుల్లో పోటీ తత్త్వం

వలసదారులుగా పరాయి దేశంలో ఉన్నప్పటికీ.. మాతృభాషతో పాటు ఇతర భాషలపై పట్టు సాధించాలనే ఆసక్తి భారతీయుల్లో మెండుగా ఉంటుంది. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్ విభాగాల్లో అగ్రపథాన నిలిచే ఇండో అమెరికన్లలో చాలా మంది స్పెల్లింగ్ బీని ఎంతో ప్రతిష్టాత్మంగా భావిస్తారు. తమ పిల్లలను ఈ పోటీల్లో భాగస్వామ్యం చేయడాన్ని గర్వంగా ఫీలవుతారు. అంతేకాదు స్పెల్ బీ పోటీల్లో ఛాంపియన్లుగా నిలిచిన విద్యార్థులు ఇతర అంతర్జాతీయ స్పెల్లింగ్ పోటీల్లోనూ విజేతలుగా నిలుస్తున్నారు.

**– షాలినీ శంకర్,**
**ఆంత్రోపాలజిస్టు**



### ప్రైజ్ మనీ రూ. 35 లక్షలు

కాగా తాజాగా జరిగిన స్పెల్లింగ్ పోటీల్లో భారత సంతతి విద్యార్థులు చాంపియన్లుగా నిలిచిన సంగతి తెలిసిందే. కాలిఫోర్నియాకు చెందిన రిషిక్ గంధశ్రీ (13), మేరీల్యాండ్‌కు చెందిన సాకేత్ సుందర్(13), న్యూజెర్సీకి చెందిన శ్రుతికా పధి (13), టెక్సాస్‌కు చెందిన సోహుం సుఖ్తంకర్ (13), అభిజయ్ కొడాలి(12), రోహన్ రాజా (13), క్రిస్టఫర్ సెర్రావ్(13), అలబామాకు చెందిన ఎరిన్ హోవార్డ్ (14)లు విజేతల జాబితాలో ఉన్నారు. అమెరికాలోని అన్ని రాష్ట్రాలు, కెనడా, ఘనా, జమైకా తదితర దేశాల నుంచి వచ్చిన దాదాపు 562 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనగా, 8 మందిని నిర్ణేతలు విజేతలుగా ప్రకటించారు. అందులో ఇద్దరు అమ్మాయిలు, ఆరుగురు అబ్బాయిలు ఉన్నారు. కాగా ఇద్దరి కన్నా ఎక్కువ మందిని విజేతలుగా ప్రకటించడం 94 ఏళ్ల స్పెల్‌బీ చరిత్రలో ఇదే తొలిసారి. వీరిలో ఒక్కొక్కరు దాదాపు రూ.35 లక్షల చొప్పున నగదును, బహుమతులను గెలుచుకున్నారు.

**– సుష్మారెడ్డి యాళ్ల, సాక్షి వెబ్‌డెస్క్**

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ ॥ సోమవారం
24-6-2019

## లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ బ్రో! నాకొక అబ్బాయి అంటే ఇష్టం. కానీ.. ఎలా ప్రపోజ్ చెయ్యాలో అర్థం కావట్లేదు. మంచి సలహా ఇవ్వండి ప్లీజ్ బ్రో..!

– శ్రిత

హాయ్ సిస్! జస్ట్ టెల్ హిమ్!!

చెప్పేస్తే మన భుజం మీద నుంచి భారం తగ్గిపోతుంది!!

చెప్పకపోతే గుండె మీద భారం పెరుగుతూనే ఉంటుంది!!

ప్రేమలో సత్యమున్నప్పుడు.. దాచిపెట్టకూడదు...!!

దాచి పెట్టుకోవాలి అన్నప్పుడు ఆ దాపరికంలోని ఆనందాన్ని ఎంజాయ్ చెయ్యాలి!!

'కానీ సార్! శ్రిత చెప్పాలనుకుంటోంది. అబ్బాయి ప్రేమను కోరుకుంటోంది. ఆ ఆనందాన్ని మీరే సెట్టింగ్ చేస్తారని నమ్ముతోంది సార్!'

చెల్లెమ్మా.. గో ఫర్ ఇట్..!! వెళ్లి చెప్పమను. శుభం!!

lovedoctorram@sakshi.com

## ఈ పాటకు ట్యూన్ తెలుసా?



కట్‌చేయ్...దాచేయ్...

**పల్లవి :**

ఆమె: ఎన్నెన్నో వర్ణాలు...
అన్నింట్లో అందాలు...
ఎన్నెన్నో వర్ణాలు అన్నింట్లో అందాలు
ఒకటైతే మిగిలేది తెలుపేనండి
నలుపేమో నాకిష్టం మీ మనసు మీ ఇష్టం
నాకోసం మీ ఇష్టం వదలొద్దండి
మీ మది తొందర చేసే బాటను
వీడక మీరు సాగిపోండికా
ఇదే ఇదే నా మాటగా పదే పదే నా పాటగా

ఎన్నెన్నో వర్ణాలు...
అతడు: నేనంటూ ప్రత్యేకం
నాదంటూ ఓ లోకం
పడలేను ఏ జోక్యం అంతేనండి
బాగుంది మీ టేస్టు నాకెంతో నచ్చేట్టు
మనసెంతో మెచ్చేట్టు మీ మీదొట్టు
అందుకె నే దిగివచ్చా వంచని
నా తలవంచా స్నేహభావమా
(2)
కలా నిజం నీకోసమే అనుక్షణం ఉల్లాసమే
॥నేనంటూ॥

**చిత్రం :** ఔను.. వాళ్ళిద్దరూ ఇష్టపడ్డారు (2002)
**రచన :** సాయి శ్రీహర్ష
**సంగీతం :** చక్రి
**గానం :** ఎస్.పి.బాలు, కౌసల్య



ప్రభాస్

ఆన్‌లొకేషన్ : ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'సాహో'. సుజిత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం 300 కోట్ల వ్యయంతో రూపొందుతోంది. వంశీ, విక్కీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధా కపూర్ కథానాయికగా నటిస్తున్నారు. ఈ సినిమాలోని వర్కింగ్ స్టిల్ ఇది. ఆగస్ట్ 15న ఈ చిత్రం రిలీజ్ కానుంది.

# వారేవా ఏమి స్పీడు



ప్రియా ప్రకాశ్, చంద్రశేఖర్ యేలేటి, నితిన్, ఆనంద్ ప్రసాద్, సుధాకర్ రెడ్డి

కెరీర్ ట్రాక్‌లో స్పీడ్ గేర్ వేశారు నితిన్. ఇటీవలే 'భీష్మ' షూటింగ్‌ను షురూ చేసిన నితిన్ తన తర్వాతి చిత్రానికి ఆదివారం కొబ్బరికాయ కొట్టారు. చంద్రశేఖర్ యేలేటి దర్శకత్వంలో నితిన్ హీరోగా తెరకెక్కనున్న సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. భవ్య క్రియేషన్స్ పతాకంపై వి. ఆనంద ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో రకుల్ ప్రీత్‌సింగ్, ప్రియా ప్రకాశ్ వారియర్ కథానాయికలు. ముహూర్తపు సన్నివేశానికి వి. ఆనంద ప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నితిన్ తండ్రి సుధాకర్ రెడ్డి క్లాప్ ఇచ్చారు. ఈ సందర్భంగా వి. ఆనంద ప్రసాద్ మాట్లాడుతూ– ''నితిన్ కెరీర్‌లో ఈ సినిమా చెప్పుకోదగినదిగా ఉంటుంది. చంద్రశేఖర్ యేలేటిగారు తీసుకున్న పాయింట్ గొప్పగా, వైవిధ్యంగా ఉంటుంది. కీరవాణిగారి సంగీతం ఈ సినిమాకు అదనపు ఆకర్షణ. ఇతర నటీనటుల ఎంపిక జరుగుతోంది. షూటింగ్ వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం'' అన్నారు. కాగా కృష్ణచైతన్య దర్శకత్వంలోనూ ఓ సినిమా చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు నితిన్.



అల్లాణి శ్రీధర్

# సినిమా అనేది అద్దంలా ఉండాలి

''గతంలో సినిమాలు సమాజాన్ని ప్రభావితం చేసేవి.. కానీ, ఇప్పుడు సమాజం సినిమాలను ప్రభావితం చేస్తోంది. ఇండస్ట్రీ కంటే ముందుగా సొసైటీ చాలా ఫాస్ట్‌గా ఉంది. అందుకే సొసైటీని చూసి చిత్రాలు చేసే పరిస్థితి. సినిమా అన్నది అబద్ధంలా కాకుండా అద్దంలా నిజాలను చూపాలి.. అప్పుడే హిట్ అవుతుంది'' అని దర్శక–నిర్మాత అల్లాణి శ్రీధర్ అన్నారు. నేడు ఆయన పుట్టిన రోజుని పురస్కరించుకుని చెప్పిన విశేషాలు.

● 'చిలుకూరు బాలాజి' సినిమా తర్వాత 'బిచ్చగాడు' సినిమా నిర్మాత చదలవాడ శ్రీనివాస్‌గారి బ్యానర్‌లో ఓ ప్రేమకథా చిత్రం చేస్తున్నా. క్లైమాక్స్ ప్యాచ్‌వర్క్ మినహా షూటింగ్ పూర్తయింది. ఈ చిత్రంతో డైరెక్టర్ కె.ఎస్. నాగేశ్వరరావుగారి అబ్బాయి పవన్ హీరోగా పరిచయమవుతున్నాడు. సీనియర్ నటుడు సురేశ్, దర్శక–నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ వైవిధ్యమైన పాత్రలు చేశారు. ఆగస్టులో సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం.

● నేటి తరం పిల్లలు డిజిటల్ మాధ్యమాలకు ఎలా బానిసలవుతున్నారనే కథాంశంతో 'డూడు.. డీడీ' అనే చిన్నపిల్లల సినిమా తీశా. హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో, కలకత్తా చిల్డ్రన్ ఫెస్టివల్‌లో ఈ చిత్రం ప్రదర్శితమైంది. త్వరలో విడుదల చేయనున్నాం.

● 'కొమరం భీమ్' సినిమాని నా దర్శకత్వంలో హిందీలో రీమేక్ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ చిత్రాన్ని నేటి ట్రెండ్‌కి తగ్గట్టు డిజిటలైజ్ చేసి మళ్లీ తెలుగులోనూ విడుదల చేయాలనుకుంటున్నా.

● నా దర్శకత్వంలో థ్రిల్లర్ జోనర్‌లో వెబ్ సిరీస్ ప్లాన్ చేస్తున్నా. వ్యవసాయం, ఆరోగ్యంపై చైతన్యం వచ్చేలా నేను తీసిన షార్ట్స్ ఫిల్మ్స్‌కి మంచి పేరొచ్చింది. ఇటీవల వచ్చిన 'మల్లేశం' సినిమా బాగా నచ్చింది. ఇలాంటి సినిమాలకు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు సబ్సిడీ ఇవ్వాలి.

● ప్రస్తుతం సమాజంలో 9 నెలల పసికందు నుంచి 90ఏళ్ల మహిళలపై ఎందుకు లైంగిక దాడులు జరుగుతున్నాయి? అనే అంశంపై ఓ టీనేజ్ గర్ల్ పరిశోధన చేశారు. నా దర్శకత్వంలో దాన్ని సినిమాగా చేస్తున్నాం. వాస్తవ సంఘటన ఆధారంగా ఈ చిత్రం చేయనున్నాం.



సండే ఫండే అంటోంది మెగా ఫ్యామిలీ. ఈ యంగ్ టీమ్ అంతా సరదాగా సండే లంచ్‌కు కలిశారు. సాయిధరమ్ తేజ్ ఈ లంచ్‌ను ఏర్పాటు చేయగా చరణ్, వరుణ్ తేజ్, నిహారిక, కల్యాణ్‌దేవ్–శ్రీజ దంపతులు పాల్గొన్నారు. 'వీకెండ్‌ను బాగా ఎంజాయ్ చేశాం' అని తన సోషల్ మీడియా అకౌంట్స్‌లో పోస్ట్ చేశారు సాయి ధరమ్‌తేజ్.



పూజా హెగ్డే

## మాఫియాలోకి స్వాగతం

సౌత్‌లో మంచి జోరుమీదున్న పూజాహెగ్డే హిందీలో మూడో చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారా? అంటే అవుననే అంటున్నాయి బాలీవుడ్ వర్గాలు. సంజయ్ గుప్తా దర్శకత్వంలో హిందీలో 'ముంబై సాగ' అనే ఓ గ్యాంగ్‌స్టర్ డ్రామా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఇందులో జాన్ అబ్రహాం, ఇమ్రాన్ హష్మి హీరోలుగా నటించనున్నారు. ఈ సినిమాలో కథానాయికగా పూజా హెగ్డేని తీసుకున్నారని బీటౌన్‌లో కథనాలు వస్తున్నాయి. మరి.. సంజయ్‌గుప్తా వెండితెర మాఫియాలో పూజా జాయిన్ అవుతారా? వెయిట్ అండ్ సీ. హృతిక్‌రోషన్ 'మొహెంజోదారో', అక్షయ్‌కుమార్ 'హౌస్‌ఫుల్ 4' చిత్రాల్లో పూజా కథానాయికగా నటించిన విషయం తెలిసిందే. జాకీష్రాఫ్, సునీల్ శెట్టి, ప్రతీక్ బబ్బర్ తదితరులు నటిస్తున్న 'ముంబై సాగ' సినిమాను వచ్చే ఏడాది విడుదల చేయాలనుకుంటున్నారు. తెలుగులో ప్రభాస్ ('జాన్'వర్కింగ్ టైటిల్), అల్లు అర్జున్, వరుణ్‌తేజ్ (వాల్మీకి) సినిమాల్లో పూజాహెగ్డే కథానాయికగా నటిస్తున్న సంగతి తెలిసిందే.

# రాగల 24 గంటల్లో...



శ్రీరామ్, కృష్ణభగవాన్, శ్రీనివాస్ రెడ్డి, ఈషా రెబ్బా, సత్యదేవ్, శ్రీనివాస్ కానూరి

''రేడియోల్లో, టీవీల్లో రాగల 24 గంటల్లో అని వాతావరణం విషయాలను చెప్పేవారు. అయితే మా 'రాగల 24 గంటల్లో' కొన్ని అనుకోని సంఘటనలు జరుగుతాయి.. అవి ఏంటి? అన్నదే సస్పెన్స్'' అని దర్శకుడు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సత్యదేవ్, ఈషా రెబ్బ, గణేష్ వెంకట్రామన్, ముస్కాన్ సేథీ ముఖ్య తారలుగా, హీరో శ్రీరామ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'రాగల 24 గంటల్లో'. శ్రీనివాస్ రెడ్డి దర్శకత్వంలో శ్రీ నవహాస్ క్రియేషన్స్ పతాకంపై శ్రీనివాస్ కానూరు నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ– ''ఇప్పటి వరకూ కామెడీ, ఎంటర్‌టైనర్ చిత్రాలను తెరకెక్కించిన నేను మొదటి సారి థ్రిల్లర్ సినిమా చేశాను. ఇందులోనూ వినోదం మిస్ అవ్వదు. అందరి పాత్రలు ఆద్యంతం ఆకట్టుకుంటాయి. జూలైలో సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు. ''సస్పెన్స్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు సత్యదేవ్. ''ఈ సినిమాలో నటనకు ఆస్కారం ఉన్న మంచి పాత్ర చేశా'' అని ఈషారెబ్బా అన్నారు. ''ఇది పూర్తిస్థాయి సీరియస్ సినిమా కాదు.. ఆద్యంతం నవ్వులు పండిస్తూనే అందరిలో ఆసక్తి రేపుతుంది'' అని శ్రీరామ్ అన్నారు. ''షూటింగ్ పూర్తి కావొచ్చింది. విడుదల తేదీ ప్రకటిస్తాం'' అని కానూరు శ్రీనివాస్ తెలిపారు. గణేష్ వెంకట్రామన్, నటుడు కృష్ణ భగవాన్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: రఘు కుంచె, కెమెరా: అంజి, సమర్పణ: శ్రీ కార్తికేయ సెల్యూలాయిడ్స్.



త్రివిక్రమ్, తమన్, అల్లు అర్జున్

## సరిగమల సమావేశం

అనుకున్న సమయానికి చిత్రీకరణను పూర్తి చేయాలని అల్లుఅర్జున్ అండ్ టీమ్ నాన్‌స్టాప్‌గా వర్క్ చేస్తున్నట్లున్నారు. అటు సన్నివేశం.. ఇటు పాటలను ఒకేసారి కంప్లీట్ చేసే పనిలో పడ్డారు. అల్లుఅర్జున్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇందులో పూజా హెగ్డే, నివేతాపేతురాజ్ కథానాయికలుగా నటిస్తున్నారు. టబు, సుశాంత్ కీలక పాత్రలు చేస్తున్న ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు. అల్లు అరవింద్, ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతున్నట్లు తెలిసింది. హీరో హీరోయిన్లపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. మరోవైపు అల్లుఅర్జున్, త్రివిక్రమ్‌లతో కలిసి మ్యూజిక్ సిట్టింగ్స్ వేశారు తమన్. అక్కడి ఫొటోను షేర్ చేస్తూ– ''మా సినిమా మ్యూజిక్ మంచి ప్రాసెస్‌లో, స్పీడ్ ప్రోగ్రెస్‌లో ఉంది'' అని తమన్ పేర్కొన్నారు. మరి... వీరి సరిగమల సమావేశం శ్రోతలను ఎంతలా ఆకట్టుకుంటాయో చూడాలంటే కాస్త ఓపికపట్టాల్సిందే.



రాధికా ఆప్టే

## ఏజెంట్ నూర్

ఫ్రాన్స్‌లో గూఢచర్యం చేశారు రాధికాఆప్టే. మరి.. ఆమె సీక్రెట్ ఆపరేషన్ ఎలా సాగిందో వెండితెరపై చూడాల్సిందే. ఆస్కార్ నామినేటెడ్ డైరెక్టర్ లిడియా డీన్ పిల్చర్ దర్శకత్వంలో 'లిబర్టే: ఏ కాల్ టు స్పై' అనే హాలీవుడ్ మూవీ తెరకెక్కింది. రెండో ప్రపంచయుద్ధ సమయంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. సారా మేఘన్ థామస్, స్టానా కాటిక్, రాధికా ఆప్టే, లైనస్ రోచె, రోసిఫ్ సదర్లాండ్ ఈ సినిమాలో కీలక పాత్రలు చేశారు. ఈ చిత్రంలో ఇండియన్ ముస్లిమ్ స్పై ఏజెంట్ నూర్ ఇనాయత్ ఖాన్ పాత్రలో రాధికా ఆప్టే నటించారు. ఇటీవల యూకేలో జరిగిన ఓ ఫిల్మ్ ఫెస్టివల్ సందర్భంగా ఈ సినిమా టీమ్ కలుసుకున్నారు. ఈ సమయంలో ఈ సినిమాలోని తన లుక్‌ను రాధికా ఆప్టే షేర్ చేశారు. ఇక.. బాలీవుడ్‌లో 'రాత్ అఖేలి హై' అనే సినిమాలో నటిస్తున్నారామె. ఇందులో నవాజుద్దీన్ సిద్ధిఖీ హీరో.



మధు సాయివంశీ, శ్రావణి

## వేట మొదలైంది

మధు సాయివంశీ హీరోగా, శ్రావణి నిక్కీ, హిమబింధు హీరోయిన్లుగా కె.రవీంద్ర కల్యాణ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'అర్జున వేట'. రోజా శ్రీనివాస్ సినిమాస్ పతాకంపై వాయల శ్రీనివాసరావు నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత సి.కల్యాణ్ క్లాప్ ఇచ్చారు. ఈ సందర్భంగా దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ– ''వాస్తవ సంఘటనల ఆధారంగా రైస్ పుల్లింగ్ నేపథ్యంలో రూపొందుతున్న చిత్రమిది. జూలై 16 నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు పెడతాం. హైదరాబాద్, చెన్నై, కేరళ వంటి ప్రాంతాల్లో చిత్రీకరిస్తాం. ఐదు భాషల్లో ఈ సినిమాను విడుదల చేస్తాం'' అన్నారు. సుబ్బరాజు, 'వెన్నెల' కిశోర్, రావు రమేశ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: వెంకట్, సంగీతం: డి. ఇమామ్.

# అది ఇంకా ప్రశ్నే



వివేక్ ఆత్రేయ

'బ్రోచేవారెవరురా అంటే కాపాడేవారు ఎవరురా అని అర్థం. ఈ సినిమాలో ఏ రెండు పాత్రలను తీసుకున్నా ఏదో ఓ సందర్భంలో ఒక పాత్ర మరో పాత్రను కాపాడుతుంది. దాంతో 'బ్రోచేవారెవరురా' అనే టైటిల్ బావుంటుందని పెట్టాం'' అని దర్శకుడు వివేక్ ఆత్రేయ అన్నారు. శ్రీవిష్ణు, నివేదా థామస్ జంటగా వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'బ్రోచేవారెవరురా'. మన్యం విజయ్‌కుమార్ నిర్మాత. సత్యదేవ్, నివేదా పేతురాజ్, రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శి ముఖ్య పాత్రల్లో నటించారు. సురేశ్ ప్రొడక్షన్స్ విడుదల చేస్తున్న ఈ చిత్రం ఈ నెల 28న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా వివేక్ ఆత్రేయ పంచుకున్న విశేషాలు...

● ఈ కథను నా మొదటి సినిమా 'మెంటల్ మదిలో' తర్వాతే రాసుకున్నాను. ఫస్ట్ రాజ్ కందుకూరిగారి బ్యానర్‌లో చేద్దామనుకున్నాను. ప్రొడక్షన్ ఆలస్యం అవుతుండటంతో 'మళ్లీ ఏదైనా ప్రాజెక్ట్ కలసి చేద్దాం' అని రాజ్‌సార్‌తో చెప్పి బయటకు వచ్చేశా.

● కథ రాసుకున్నప్పుడు శ్రీవిష్ణుని మనసులో పెట్టుకునే రాసుకున్నాను. వేరే వాళ్లకు కథ చెప్పినా, ఫైనల్‌గా విష్ణుతోనే చేశాను. 'మెంటల్ మదిలో' అప్పుడు మా కెమిస్ట్రీ బాగా కుదిరింది. ఇందులో ఉమెన్ హెరాస్‌మెంట్ పాయింట్‌ని టచ్ చేస్తూ లైట్ హార్ట్ కామెడీగా తెరకెక్కించాం. ప్రతి మహిళ చూడాల్సిన సినిమా ఇది. మిత్ర అనే పాత్ర నివేదా థామస్ తప్ప ఎవరూ చేయలేరు అన్నట్టుగా చేసింది.

● ఇందులో ఆర్3 బ్యాచ్ (శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ) ఐదేళ్లుగా ఇంటర్ చేస్తుంటారు. వాళ్లకు మిత్రా (నివేదా థామస్) పరిచయం అవుతుంది. తన వల్ల వీళ్ల లైఫ్ ఎలా మారింది అనేది కథ. ఇందులో సినిమా హీరోయిన్‌గా నివేదా పేతురాజ్, దర్శకుడు కావాలనే పాత్రలో సత్యదేవ్ చేశారు.

● 'మెంటల్ మదిలో' నచ్చింది, హిట్ అని కొందరంటారు. కొందరేమో ఇంకా బావుండాల్సింది అంటారు. సో ఫస్ట్ సినిమా హిట్టా లేదా? నాకు రావాల్సినంత పేరు వచ్చిందా? లేదా అనేది నాకింకా ప్రశ్నే. ఆ విషయాన్ని మెల్లిగా పట్టించుకోవడం మానేశాను. 'బ్రోచేవారెవరురా' తర్వాత ఏ సినిమా చేయాలో ఇంకా నిర్ణయించుకోలేదు.

# ఆడపిల్లని తక్కువగా చూడకూడదు



లింగేశ్వర్, సుధీర్‌బాబు

''ఓ తండ్రి కోసం కూతురు పాడే ఈ పాటలో చక్కటి విలువలున్నాయి. ఆడపిల్లని తక్కువగా చూడకూడదు.. ఆడపిల్ల పుట్టుక చాలా అవసరం.. అని తెలియజెప్పే ఈ పాట వల్ల కొంత మందైనా మారాలనుకుంటున్నాను'' అని హీరో సుధీర్‌బాబు అన్నారు. తరుణ్ తేజ్, లావణ్య జంటగా నవీన్ నాయని దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఉండిపోరాదే'. గోల్డ్ టైమ్ ఇన్ పిక్చర్స్ పతాకంపై డా.లింగేశ్వర్ నిర్మించిన ఈ సినిమా జూలై నెలాఖరులో విడుదలకానుంది. ఈ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా తండ్రి గొప్పతనాన్ని తెలియజేసే పాటను విడుదల చేశారు. నవీన్ నాయని మాట్లాడుతూ– ''నన్ను నమ్మి డైరెక్టర్‌గా అవకాశం ఇచ్చిన లింగేశ్వర్‌గారికి జీవితాంతం రుణపడి ఉంటాను. ఇదొక రియలిస్టిక్ స్టోరీ. పక్కింటి అమ్మాయి జీవితం చూసినట్టుగా సినిమా ఉంటుంది. ఇటీవలే కన్నడలో మా ఆడియో విడుదలవగా, మంచి స్పందన వచ్చింది'' అన్నారు. డా.లింగేశ్వర్ మాట్లాడుతూ– ''ఇంత వరకు వెండితెరపై రానటువంటి కథ 'ఉండిపోరాదే'. సుద్దాల అశోక్‌తేజగారు నాన్నపై రాసిన పాటకు అవార్డ్స్ వస్తాయనడంలో సందేహం లేదు. ఎంత మంది వచ్చినా చివరి వరకు మనల్ని ప్రేమించేది మాత్రం తల్లిదండ్రులే అనే సందేశం ఉంటుంది. కథ మీద ఎంతో నమ్మకంతోనే ఈ చిత్రాన్ని మూడు భాషల్లో నిర్మించా'' అన్నారు. '' సుద్దాలగారు మంచి సాహిత్యం అందించారు. పాటకు చిత్రగారు ప్రాణం పోశారు'' అని సంగీత దర్శకుడు సబు వర్గీస్ అన్నారు. తరుణ్ తేజ్, లావణ్య, నటుడు కేదార్ శంకర్, మాటల రచయిత సుబ్బారాయుడు బొంపెం తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: శ్రీను విన్నకోట.




పరిచయం | రీతూ జైస్వాల్

# సూపర్ సర్పంచ్




''నేను కలలు కన్న భారతదేశ నిర్మాణం కోసం నేను ఎంతగానైనా శ్రమిస్తాను. ఈ విధి నిర్వహణలో నాకు ఎదురైన అడ్డంకులను అధిగమించే వరకు శ్రమించగలిగిన మానసిక శక్తి నాలో ఉంది. అది నా తల్లిదండ్రుల పెంపకంలో నాకు అబ్బిన నైజం. నా వంతు బాధ్యతగా మా ఊరిని బాగు చేస్తాను''. ఈ మాటలు అన్నది రీతూ జైస్వాల్. ఆమె బిహార్ రాష్ట్రం, సీతామర్హి జిల్లా, సింగ్‌వాహిని గ్రామ ముఖి... అంటే గ్రామ సర్పంచ్ అన్నమాట. ఆమె ఇంత స్థిరంగా ఈ మాటలు చెప్పడానికి కారణం... 'ఊరిని బాగు చేయడం ఆమె వల్ల అయ్యే పని కాదంటూ వచ్చిన కొందరి అభిప్రాయాలు. ఆమెను అలా అన్న వాళ్ల అలాంటి అభిప్రాయం వెలిబుచ్చడంలో ఎటువంటి కుయుక్తీ లేదు, కుసంస్కారమూ లేదు. ఉన్నదంతా నిస్పృహ మాత్రమే. 'ఎవరు వచ్చి, ఎంత చేసినా ఈ గ్రామాల రూపురేఖలు మారవు' అనే నిరాశ మాత్రమే. నగరంలో పుట్టి పెరిగిన యువతి, సంపన్న కుటుంబంలో పుట్టిన యువతి, ఐఏఎస్ అధికారి భార్యగా సకల సౌకర్యాలతో జీవిస్తున్న యువతి... ఓ కుగ్రామంలో ఉండగలుగుతుందా అనే సందేహం వాళ్లది. గ్రామాన్ని బాగు చేయాలనే ఆమె ఉత్సాహాన్ని అర్థం చేసుకోగలిగారు కానీ, ఆమె చివరి వరకు నిలబడగలుగుతుందనే ఆశ మాత్ర వాళ్లకు లేకపోయింది. అయితే ఆ నిస్పృహలను తుడిచేసి... సింగ్‌వాహిని గ్రామ ముఖచిత్రాన్ని మార్చేశారు రీతూ జైస్వాల్.

## పుట్టింది హాజీపూర్‌లో

రీతూ జైస్వాల్ పుట్టింది బిహార్‌లోని హాజీపూర్‌లో. వారిది వ్యాపార కుటుంబం. బిహార్‌లో.. రాజధాని పట్నా తర్వాత అంతటి వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం హాజీపూర్. హాజీపూర్‌లోని సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో చదివారామె. ఎకనమిక్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. చదువులో తెలివైన అమ్మాయి. అభ్యుదయ భావాలున్న అమ్మాయి. 'ఆల్ గర్ల్స్ టీమ్'కు నాయకత్వం వహించి ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్‌లో చురుగ్గా పాల్గొనేవారు. పేదవాళ్లు నివసించే కాలనీల్లోని వాళ్లకు దుస్తులు పంచాలని నిర్ణయించింది ఆల్ గర్ల్స్ టీమ్. అప్పుడు రీతూ వాళ్లమ్మకు తెలియకుండా ఆమె చీరలు తెచ్చి పంచేశారు. ఆ సంఘటన గుర్తు చేస్తే ఇప్పటికీ పెద్దగా నవ్వుతారు రీతూ. అప్పుడు వాళ్ల నాన్న 'మీ అమ్మ చేయలేని పని నువ్వు చేశావు' అని కూతుర్ని ప్రశంసించారట. ఇలాంటి చురుకైన అమ్మాయికి ఐఏఎస్ వరుణ్ని తెచ్చారు నాన్న. వాళ్ల పెళ్లి 1996లో జరిగింది. కొత్త దంపతులు సొంత ఊరికి వెళ్లారు. భర్త అరుణ్‌కుమార్ పూర్వీకుల ఊరది. అదే బిహార్‌లోని సింగ్‌వాహిని గ్రామం. ప్రస్తుతం... రీతూ కార్యక్షేత్రం.

## నీళ్లు తాగలేకపోయింది

కొత్త కోడలికి అత్తగారింటి బంధువులంతా సాదరంగా ఆహ్వానం పలికారు. ఆమె ఆ గ్రామంలోనే కాదు, అసలు గ్రామంలో అడుగుపెట్టడమే తొలిసారి. విందు భోజనాలు మొదలయ్యాయి. భోజనం వడ్డించి గ్లాసులో నీళ్లు పెట్టారు. నీటిలో నుంచి గ్లాసు అడుగు కనిపించడం లేదు. అదేదో లేత పసుపు రంగు జ్యూస్ కావచ్చు అనుకున్నారామె మొదట. తాగడానికి నీళ్లు కావాలని అడిగితే.. 'ఇవిగో' అంటూ ఆ గ్లాసును చూపించారు. సింగ్‌వాహిని గ్రామంలో నీళ్లు అలాగే ఉంటాయని అరుణ్‌కు మార్‌కు తెలుసు కాబట్టి అతడికి ఆశ్చర్యపోవడానికేమీ లేదు. కానీ పరిశుభ్రమైన నీటిని ఫిల్టర్‌లో వడపోసి మరీ తాగుతూ పెరిగిన అమ్మాయికి మురికిగా ఉన్న ఆ నీటిని తాగడం కంటే భయంకరమైన పరిస్థితి మరొకటి ఉండకపోవచ్చు. కోడలికి శుభ్రమైన నీరు తాగే అలవాటు ఉందని తెలిసినా అత్తింటి వాళ్లు చేయగలిగిందేమీ లేదు. అప్పట్లో ఇప్పుడు ఉన్నట్లు వాటర్ ప్లాంట్‌లు అందుబాటులో లేవు. క్యాన్‌లలో నీటిని తెచ్చుకునే సౌకర్యమూ లేదు. దేశంలో మంచినీటి వ్యాపారం మొదలైనప్పటికీ మారుమూల గ్రామాలకు చేరని రోజులు. ఆ చేదు జ్ఞాపకంతోనే భర్తతో పాటు ఢిల్లీకి చేరారామె.

## ఊరు మారనేలేదు

ఢిల్లీలో సంపన్నులు నివసించే ప్రదేశాల్లో ఖేల్ గావ్ ఒకటి. రీతూ దంపతుల నివాసం కూడా అక్కడే. వాళ్లకు ఇద్దరు పిల్లలు. కొడుకు ఆర్యన్, కూతురు అవని. పిల్లలిద్దరూ టీనేజ్‌లోకి వచ్చారు. ఓసారి పిల్లలకు నానమ్మ వాళ్ల ఊరిని చూపించాలని తీసుకెళ్లారు. ఈ ప్రయాణం 2014లో. ఊరిలో ఏ మార్పూ కనిపించలేదు. మురికి నీటినే తాగుతున్నారు, బహిరంగ విసర్జన అత్యంత సాధారణమైన విషయం అక్కడ. కరెంటు కూడా సరిగా లేదు. ఊరి కోసం ఏదో ఒకటి చేయాలని అప్పుడనుకున్నారామె. ఊరిని దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని భర్తతో చెప్పారు. తనకు చేయాలని ఉన్నా చేయలేని పనిని తన భార్య చేస్తానని ముందుకు రావడంతో ఆయన రీతూకి మద్దతుగా నిలిచారు. తర్వాత అత్తమామలను అడిగారామె. 'మాకు అలవాటై పోయింది కానీ, ఈ ఊరిలో మీరు ఉండలేరు, మీరు హాయిగా ఢిల్లీలోనే జీవించండి' అన్నారు వాళ్లు. 'ఉన్నఫళాన ముందడుగు వేయకు, మరోసారి ఆలోచించుకో' అన్నారు పుట్టింటి వాళ్లు. 'ఇన్నేళ్లు మిమ్మల్ని పెంచాను, ఇక ఊరి కోసం కొన్నాళ్లు పని చేస్తాను' అని పిల్లల్ని అడిగారు. ఆ తర్వాత సింగ్‌వాహినికి ప్రయాణమయ్యారు.



### ఊరిని ఏకం చేసింది

బిహార్‌ను తరచూ వరదలు అతలాకుతలం చేస్తుంటాయి. గత ఏడాది వరదలు రాష్ట్రంలో వందలాది ప్రాణాలను హరించాయి. కోటి మందికి పైగా నిరాశ్రయులయ్యారు. ఆ వరదలు సింగ్‌వాహిని గ్రామాన్ని కూడా కదిలించి వేశాయి. ఇలాంటి విపత్తులు సంభవించినప్పుడు సహాయక చర్యల కోసం ఎవరైనా ప్రభుత్వం వైపే చూస్తారు. రీతూ జైస్వాల్ ప్రభుత్వ అధికారుల బృందం వచ్చే వరకు ఎదురు చూడకుండా కార్యరంగంలో దిగారు. దారి తప్పి వచ్చిన వాళ్లకు షెల్టర్ ఏర్పాటు చేశారు. వాళ్లను ఊరి అతిథులుగా ఆదరించాలని చెప్పి ఊరి వాళ్లను ఏకం చేసి వాళ్లకు సహాయం చేసే బాధ్యత పురమాయించారు. ప్రతి ఇంటి నుంచి ఆ ఇంటి వాళ్లతో పాటు మరొకరికి భోజనం వండాలి. ఆ భోజనం ఊరి అతిథుల కోసం. కొందరు యువకులతో సర్వీస్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. ఆ సర్వీస్ టీమ్‌లోని యువకులు ఇంటింటికీ వెళ్లి అతిథి భోజనాన్ని సేకరించి షెల్టర్‌లో ఉన్న వాళ్లకు అందించారు. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ''ప్రతిదీ ప్రభుత్వం చేస్తుందని ఎదురు చూడడం, ప్రభుత్వమే చేయాలని ఆశించడం, సరిగ్గా చేయలేదని ఆరోపించడం కాదు. మనం ఏం చేయగలమో అంత మేర చేయడానికి సిద్ధం కావాలి'' అని చెప్పారామె.



## లైటాపడానికి నోటితో ఊదింది!

''ఊరి కోసం ఏదైనా చేయాలనే ఆకాంక్ష మాత్రమే ఉంటే సరిపోదు. దానికోసం మనకు చేతనైన ప్లాన్ ఒకటి తయారు చేసుకోవాలి. అందుకోసం ఊరిలో అన్ని వీధులూ, నాలుగు మూలలా తిరిగి చూశాను. శ్రామిక వాడల్లో స్త్రీలతో మాట్లాడాను. వాళ్లకేం కావాలో తెలుసుకోవడానికి వాళ్లను ఇంటికి పిలిచేదాన్ని. వాళ్లు చెప్పినవన్నీ రాసుకునేదాన్ని. అందులో నుంచి ఏయే డిపార్ట్‌మెంట్‌లతో మాట్లాడాల్సిన వాటిని విడిగా లిస్ట్ అవుట్ చేసుకునే దాన్ని. అలా ఆ మహిళలు నాతో చాలాసేపు మా ఇంట్లోనే ఉండేవాళ్లు. వాళ్లేం తింటున్నారనే సంగతి నుంచి ప్రభుత్వ పథకాలు వాళ్లకు ఎంత వరకు చేరుతున్నాయనే వివరాలు కూడా నాకు తెలుస్తుండేవి. నేను ఏ మాత్రం ఊహించని షాక్ ఏమిటంటే.. ఓ రోజు ఇంట్లో మేము కూర్చున్న గది కాకుండా మరో గదిలో మూలన వెలుగుతున్న స్టాండ్ లైట్‌ను ఆపేయమని ఒకామెతో చెప్పాను. ఆమె నోటితో ఊదింది. వాళ్లకు కరెంటు లేకపోవడం కాదు నన్ను ఆశ్చర్యపరిచింది, కరెంటు లైట్ వేయడానికి ఆపేయడానికి స్విచ్ ఉంటుందని కూడా తెలియకపోవడం నన్ను కలచి వేసింది. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ఇదేనా అని కూడా అనిపించింది'' అన్నది రీతూ ఓ టీవీ చానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆవేదనగా.

## కల నెరవేరింది

''ఊరికి మొదటగా సురక్షితమైన తాగు నీరు కావాలి, మంచి రోడ్లు కావాలి, టాయిలెట్‌లు కావాలి. వీటిని సాధించడం ఎలాగో తెలియదు కానీ, సాధించగలననే నమ్మకంతో ఈదడం నేర్చుకోకనే ఈ సముద్రంలో దూకేశాను. ఊరి సమస్యల జాబితా పట్టుకుని సీతామర్హి కలెక్టర్‌ను కలిశాను. ప్రతిసారీ ఊరి వాళ్లను కనీసం నలుగురైదుగురిని అయినా నాతోపాటు తీసుకెళ్లేదాన్ని. బయటి నుంచి వచ్చిన నేను చెప్పడం కంటే సమస్యను ప్రత్యక్షంగా అనుభవిస్తున్న వాళ్లు చెబితేనే సమస్య తీవ్రత అర్థమవుతుంది. కలెక్టర్ సహకారంతో పాతిక హ్యాండ్ పంపులు ఒక్కొక్కటి 250 అడుగుల లోతులో వేశాం. గ్రామంలో రెండు వేల రెండు వందల టాయిలెట్‌లు కట్టించాం. ప్రధానమైన రోడ్లు పూర్తయ్యాయి. చిన్న రోడ్ల నిర్మాణం జరుగుతోందిప్పుడు. ఈ ఐదేళ్లలో ఊరి ముఖచిత్రం మారిపోయింది. 2016లో పంచాయితీకి ఎన్నికలు వచ్చినప్పుడు గ్రామస్థులు పట్టుపట్టడంతో సర్పంచ్‌గా నామినేషన్ వేశాను. ఊరి వాళ్లు నాతో గ్రామానికి పనిచేయించుకున్నట్లే ఎన్నికల్లో కూడా నన్ను గెలిపించుకున్నారు. అప్పటి నుంచి నా బాధ్యత పెరిగింది. ఢిల్లీకి- సింగ్ వాహినికి మధ్య దూరం వెయ్యి కిలోమీటర్లకు పైగా ఉంటుంది. 2014 నుంచి పదహారు మధ్యలో లెక్కలేనన్ని సార్లు ప్రయాణం చేశాను. ఇప్పుడు నెలలో ఎక్కువ రోజులు సింగ్‌వాహినిలోనే ఉంటున్నాను. ఢిల్లీ నుంచి మా ఊరికి చక్కటి రోడ్ల మీద వస్తుంటే నా ప్రయాణాలు వృథా కాలేదనిపిస్తుంటుంది. ఊరంటే ఎలా ఉండాలని నేను కోరుకున్నానో అలా ఉంది మా ఊరు. నా కోరిక తీరినందుకు సంతోషంగా ఉంది'' అన్నారు 42 ఏళ్ల రీతూ జైస్వాల్.

– వాకా మంజులారెడ్డి

### ఆదర్శ సారథ్యం



రీతూ జైస్వాల్ 'ఉచ్చ శిక్షిత్ ఆదర్శ్ యువ సర్పంచ్ పురస్కార్ 2016, చాంపియన్స్ ఆఫ్ చేంజ్ అవార్డ్ 2018' అవార్డులు అందుకున్నారు. వీటితోపాటు ఆమె... బిహార్ పంచాయత్ రాజ్ మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న 'కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ ఫర్ సర్పంచ్ అండ్ పంచాయత్ సెక్రటరీస్' ప్రోగ్రామ్ కు ఎంపిక చేసిన ఐదుగురు ప్యానలిస్టుల్లో రీతూ ఒకరు. పెట్రోలియం అండ్ నాచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ రాంచిలో నిర్వహించిన 'ఎల్‌పీజీ, కేటలిస్ట్ ఆఫ్ సోషల్ చేంజ్–2' సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పట్నాలో 'బాలికలు, మహిళల మీద జరుగుతున్న అత్యాచారాల్లో నమోదు కాకుండా ఉండిపోతున్న పరిస్థితులు – పెరుగుతున్న నేరాల సంఖ్య' అంశం మీద జరిగిన సదస్సులో ప్రసంగించారు.

మంచి విషయం

## నా కోసం.. నా ప్రధాని

ఇలాంటప్పుడే.. ప్రభుత్వం ఎక్కడో ఢిల్లీలో లేదు, మన ఇంటి పక్కనే ఉందన్న నమ్మకం కలుగుతుంది. సుమేర్ సింగ్‌ది జైపూర్. ఆయన కూతురు లలిత్‌కి కొన్నాళ్లుగా ఒంట్లో బాగోలేదు. కూతురంటే మరీ చిన్న పిల్ల కాదు. టీనేజ్ అమ్మాయి. బాగోలేక పోవడం అంటే ఎంతకూ తగ్గని జ్వరమో, తలనొప్పో కాదు. అప్లాస్టిక్ అనీమియా! 'మనిషి ఒంట్లో ఎప్పటికప్పుడు రక్తకణాలు పుట్టుకొస్తుండాలి. మీ అమ్మాయిలో అలా లేదు. దీనివల్లే ఇన్ఫెక్షన్లు, రక్తస్రావం తగ్గట్లేదు. రక్తకణాలను తయారు చేసేది ఎముకల్లోని మూలుగ. ఆ మూలుగను వేరే మనిషి నుంచి తీసుకుని మీ అమ్మాయి వేస్తే తిరిగి రక్తకణాల వృద్ధి మొదలవుతుంది. ప్రాణాపాయం తప్పుతుంది. మూలుగను మార్చాలంటే సుమారు 10 లక్షల రూపాయల వరకు అవుతుంది'' అని డాక్టర్లు చెప్పారు. అప్పటికే సుమేర్ తన కూతురి వైద్యం కోసం భూమిని అమ్ముకున్నాడు. ఇంటిని తనఖా పెట్టాడు. 7 లక్షల రూపాయలు వరకు ఖర్చు పెట్టాడు. అయినా నయం కాలేదు. ఆ తండ్రి దుఃఖం కట్టలు తెంచుకుంది. ''నా కూతురికి ఇక ఎప్పటికీ బాగయే అవకాశం లేకపోతే నేను చచ్చిపోతాను'' అన్నాడు ఓ రోజు. అప్పుడే డాక్టర్లు చెప్పారు మూలుగ మార్పిడి చేయించగలిగితే పిల్ల బతుకుతుందని. మూలుగ ఇవ్వడానికి ఆమె సోదరుడు ముందుకు వచ్చాడు. ఇక కావలసింది పది లక్షలు. అంత డబ్బు ఎవరిస్తారు? ప్రధాన మంత్రికి ఉత్తరం రాయమని చదువుకున్న వాళ్లెవరో సలహా ఇచ్చారు. సమేర్ తన కూతురు పరిస్థితి, తన ఆర్థిక దుస్థితి వివరిస్తూ నరేంద్ర మోదీ పేరిట ఉత్తరం రాశారు. ఆ ఉత్తరానికి స్పందించిన ప్రధాని కార్యాలయం 'జాతీయ సహాయ నిధి' నుంచి సమేర్ కూతురి చికిత్స కోసం 30 లక్షల రూపాయలను విడుదల చేసింది! సమేర్ సహాయం అడిగితే ఏకంగా వరమే లభించింది. ఈ డబ్బుతో అతడికి కూతురికి నయమవడమే కాదు, అతడి అప్పులూ తీరుతాయి. తను అమ్మిన భూమిని తిరిగి తనే కొనుక్కోగలడు. తనఖా పెట్టిన ఇంటిని విడిపించుకోగలడు.

ఇలాంటప్పుడే అనిపిస్తుంది.. ఢిల్లీ మన కాలనీలోనే ఉందని! ప్రధాని రోజూ మన ఇంటి వైపు చూస్తూ డ్యూటీకి వెళుతున్నారని. పరామర్శించడానికి కూడా ఎప్పుడో ఇంటి లోపలికి కూడా రానే వచ్చేస్తారని.

**ఆ తండ్రి దుఃఖం కట్టలు తెంచుకుంది. "నా కూతురికి ఇక ఎప్పటికీ బాగయే అవకాశం లేకపోతే నేను చచ్చిపోతాను" అన్నాడు ఓ రోజు.**



కూతురు లలిత్‌తో, సమేర్ సింగ్

సినిమా

# ప్రజలతోనూ మమేకం అవుతాం

– 'మా' అధ్యక్షుడు నరేష్



● రాజశేఖర్, జీవిత, శ్యామలా దేవి, కృష్ణంరాజు, నరేశ్

''ఐక్యత, జవాబుదారీతనం, ప్రజాస్వామ్య పద్ధతుల్లో 'మా'(మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) ముందుకు సాగుతుంది. కొత్త కమిటీ ఏర్పడిన తర్వాత జరిగిన తొలి జనరల్ బాడీ మీటింగ్ విజయవంతంగా సాగింది' అని 'మా' అధ్యక్షుడు నరేష్ అన్నారు. ఆయన అధ్యక్షుడిగా ఇటీవల కొత్త కమిటీ ఎన్నికైన విషయం విదితమే. ఆదివారం తొలిసారి జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ– ''మా' అసోసియేషన్‌కి గతంలో ఏఎన్నార్, కృష్ణ, చిరంజీవిగార్లు ముఖ్య సలహాదారులుగా ఉండేవాళ్లు. ఈ సారి కృష్ణంరాజుగారిని ఎన్నుకున్నాం. కొత్త కమిటీ వచ్చిన వారం రోజుల్లో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశాం. 30కాల్స్ వచ్చాయి. సలహాల బాక్స్‌కి మంచి స్పందన వచ్చింది. 33 మందికి ప్రస్తుతం ఇచ్చే పెన్షన్‌ను ఆరు వేలకు పెంచాం. 'మా' మెంబర్ షిప్‌ని కొత్తవాళ్లకి రూ.25వేలకు ఇవ్వాలని, రెండేండ్లు 25వేల చొప్పున చెల్లిస్తే పూర్తి స్థాయి మెంబర్ షిప్ వస్తుంది. అలాగే 90 రోజుల్లో పూర్తి పేమెంట్ కడితే పదిశాతం డిస్కౌంట్ ఇవ్వాలని నిర్ణయించాం. 'మా' బిల్డింగ్ కోసం చిరంజీవిగారు సపోర్ట్ చేస్తానన్నారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌గారు స్థలం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్‌లో హీరోలతోపాటు ప్రజలతో మమేకమై రెండు తెలుగు రాష్ట్రాల్లో మంచి కార్యక్రమాలు చేయాలనుకుంటున్నాం'' అన్నారు. ''మా'లో చిన్న చిన్న మనస్పర్థలు ఉండేవి. దీంతో ఎలా జరుగుతుందో అన్న భయం ఉండేది. కానీ బాగా జరిగింది'' అని 'మా' ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ రాజశేఖర్ అన్నారు. రచయితలు పరుచూరి బ్రదర్స్, నటులు దేవదాస్ కనకాల, కృష్ణంరాజు దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో 'మా' ఉపాధ్యక్షురాలు హేమ, ట్రెజరర్ రాజీవ్ కనకాల, శివబాలాజీ, సురేష్ కొండేటి, సుదర్శన్, గౌతం రాజు తదితరులు పాల్గొన్నారు.

## బ్రేకింగ్ న్యూస్ ఏంటి?



● కృతీ సనన్

ముంబైలోని బ్రేకింగ్ న్యూస్‌లన్నీ తనకే ముందు తెలియాలను కుంటున్నారు కృతీసనన్. ఎందుకంటే తన తర్వాతి చిత్రంలో మీడియా ప్రొఫెషనలిస్ట్‌గా నటించబోతున్నారామె. 'పరజానియా' సినిమాతో జాతీయ అవార్డు అందుకున్న రాహుల్ ధోలాకియా ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. ప్రస్తుతం ఈ మూవీ వర్క్‌షాప్స్‌తో పాల్గొంటున్నారు కృతీసనన్. ''ఒక మంచి ఫీమేల్ డ్రివెన్ సినిమా కోసం ఎప్పటి నుంచో వెయిట్ చేస్తున్నాను. రాహుల్‌గారు మంచి స్క్రిప్ట్ సమకూర్చారు. నా నెక్ట్స్ చిత్రంలో నేను మీడియా ప్రొఫెషనలిస్ట్‌గా నటించబోతున్నాను.ఆగస్టులో ఈ సినిమాను స్టార్ట్ చేయాలనుకుంటున్నాం'' అని కృతీ పేర్కొన్నారు. ఎక్కువభాగం ముంబైలో ఈ సినిమా షూటింగ్‌ను ప్లాన్ చేశారు. ఈ సినిమాకు సౌత్ కొరియాకు చెందిన ఓ సంస్థ గ్రాఫిక్ వర్క్ చేయనుందట. ప్రస్తుతం 'అర్జున్ పటియాలా, హౌస్‌ఫుల్4, పానిపట్' సినిమాలతో ఫుల్‌బిజీగా ఉన్నారు కృతీ. అన్నట్లు 'అర్జున్ పటియాలా'లో కూడా కృతీ న్యూస్ రిపోర్టరే కావడం విశేషం.

కిడ్నీ కౌన్సెలింగ్

## కాలేయదానం వల్ల దాతకు ఏదైనా ప్రమాదమా?

మా నాన్నగారి వయసు 54 ఏళ్లు. హెపటైటిస్ వ్యాధితో ఏడేళ్లకు పైగా బాధపడుతున్నారు. కొద్దిరోజుల కిందట డాక్టర్లు 'లివర్ ఫెయిల్యూర్' అని నిర్ధారణ చేశారు. 'జీవన్‌దాన్'లో రిజిస్టర్ చేయించుకొని దాతల నుంచి కాలేయం దొరికితే లివర్ ట్రాన్స్‌ప్లాంట్ చేయించడానికి వేచిచూస్తున్నాము. దురదృష్టవశాత్తు ఆరు నెలలుగా నాన్నగారికి సరిపోయే లివర్ 'జీవన్ దాన్' ద్వారా లభించలేదు. ఇంకొంతకాలం వేచిచూసే పరిస్థితి లేదనీ, కుటుంబ సభ్యుల్లో ఎవరైనా కాలేయ దానం చేస్తే 'లైవ్ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్'తో నాన్న ప్రాణాలు కాపాడవచ్చని వైద్యులు తెలిపారు. నేను నాన్నగారికి లివర్ డొనేట్ చేద్దామనుకుంటున్నాను. ఇది ప్రమాదకరమా? దయచేసి 'లైవ్ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్' గురించి వివరంగా తెలియజేయండి. అసలు ఈ సర్జరీ ఏమిటి? ఎలాంటి వారు లివర్ దానం చేయవచ్చు? కాంప్లికేషన్స్ ఏమిటి? దయచేసి వివరంగా చెప్పండి.

– జె. దీపక్, నల్లగొండ

వ్యాధిగ్రస్తమై పనిచేయలేని స్థితిలో ఉన్న కాలేయాన్ని తొలగించి, దాని స్థానంలో ఆరోగ్యకరమైన కాలేయాన్ని అమర్చడానికి చేసే సర్జరీనే కాలేయ మార్పిడి (లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్) శస్త్రచికిత్స. కాలేయ మార్పిడిలో రెండు పద్ధతులు ఉన్నాయి. మొదటిది... మరణించిన దాత (కెడావరిక్ డోనార్) దేహం నుంచి సేకరించిన కాలేయాన్ని అవసరమైన వారికి అమర్చడం. ఇక రెండో పద్ధతి ఆరోగ్యకరమైన కాలేయం ఉన్న వ్యక్తి ఎవరైనా తన కాలేయంలోని కొంత భాగాన్ని దానం చేయడం. దీన్నే లైవ్ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అంటారు. ఇది లివర్ ఫెయిల్యూర్ వ్యాధిగ్రస్తులను అత్యవసరంగా ఆదుకునే ప్రభావవంతమైన శస్త్రచికిత్స. దీని గురించి భయపడాల్సిన అవసరం లేదు. మరణించిన దాత (కెడావరిక్ డోనార్) నుంచి కాలేయం పొందడానికి కాలేయ మార్పిడి అవసరమైన వ్యక్తులు రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణలో ఉన్న జీవన్ దాన్ సంస్థలో పేరు నమోదు చేసుకోవాలి. తమ వంతు వచ్చేవరకు వేచిచూడాల్సి ఉంటుంది. కాలేయ వ్యాధులకు గురవుతున్న వారి సంఖ్య బాగా పెరుగుతోంది. అదే సమయంలో కాలేయ మార్పిడి సర్జరీలు విజయవంతమై, వాటికి మంచి ప్రాచుర్యం లభిస్తుండటంతో కాలేయ మార్పిడి అవరమైన వ్యక్తుల సంఖ్య కూడా పెరుగుతోంది. కానీ అవయవ దానం చేసే కుటుంబాల సంఖ్య తగినంతగా ఉండటం లేదు. ఫలితంగా మరణించిన దాత నుంచి కాలేయం పొందడానికి ఎక్కువ వ్యవధి అవసరమవుతోంది.



అయితే సజీవదాత నుంచి కాలేయం పొందే విధానం ఇందుకు పూర్తిగా భిన్నమైంది. పూర్తి ఆరోగ్యంతో ఉన్న కుటుంబ సభ్యులు, రక్తసంబంధీకులు ఎవరైనా తమ కాలేయంలోని నాలుగోవంతు భాగాన్ని ఆప్తులకు దానం చేయవచ్చు. ఈ విధానంలో కాలేయాన్ని పంచుకున్న వ్యక్తికి దానివల్ల భవిష్యత్తులో ఎలాంటి సమస్యలూ తలెత్తే అవకాశం కూడా దాదాపుగా ఉండదు. అందువల్ల బంధువులు ఎవరైనా నిర్భయంగా ముందుకు రావచ్చు.

జీవన్‌దాన్ కింద కాలేయం కేటాయింపు కోసం ఎదురుచూడకుండా కాలేయమార్పిడి సర్జరీ చేయించుకొని సాధారణ జీవితం గడిపేందుకు అవకాశం ఉంది. దీంతో లైవ్ డోనార్ ట్రాన్స్‌ప్లాంట్ సంఖ్య ఇప్పుడు వేగంగా పెరుగుతోంది.

మన శరీరంలో తిరిగి పూర్తిగా తన మునపటి పరిమాణం పొందగల శక్తి ఉన్న కీలకమైన అవయవం కాలేయం మాత్రమే. అందువల్ల రక్తసంబంధీకులతో సహా ఏ వ్యక్తి అయినా కాలేయాన్ని దానం చేయవచ్చు. అయితే ఆ వ్యక్తి రక్తపు గ్రూపు, ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన తర్వాత అది స్వీకర్తకు సరిపడుతుందన్న అంశాన్ని వైద్యనిపుణులు నిర్ధారణ చేస్తారు. మద్యపానానికి, మత్తుమందుల (డ్రగ్స్)కు అలవాటు పడ్డవారు, ఇన్ఫెక్షన్స్ సోకినవారు, గుండె–ఊపిరితిత్తుల–నాడీ సంబంధిత వ్యాధులు ఉన్నవారి నుంచి కాలేయాన్ని దానంగా స్వీకరించడాన్ని వైద్యులు అనుమతించరు. ఈ రకమైన ఆరోగ్య సమస్యలు లేని, యాభై సంవత్సరాల లోపు వయసు ఉన్న రక్తసంబంధీకులు ఎవరైనా కాలేయదానం చేయవచ్చు. ఆప్తులు, బంధువులతో కాలేయం పంచుకున్నందున దీర్ఘకాలంలో ప్రత్యేకంగా ఎలాంటి మందులూ వాడాల్సిన అవసరం రాదు. ఈ శస్త్రచికిత్స కారణంగా ఇతర ఆరోగ్య సమస్యలు ఏమీ తలెత్తవు. పైగా దాత, స్వీకర్త ఇద్దరిలోనూ 6 – 8 వారాలలో కాలేయం పూర్తి స్థాయికి అభివృద్ధి చెందుతుంది. మీరు ఎలాంటి ఆందోళనా లేకుండా మీ కాలేయాన్ని నిరభ్యంతరంగా దానం చేయవచ్చు.

లైవ్ కాలేయ మార్పిడి శస్త్రచికిత్స చేయడానికి నిర్ణయం జరిగిన తర్వాత వైద్యనిపుణులు ఆ వ్యక్తి శారీరకంగా, మానసికంగా కాలేయ మార్పిడి శస్త్రచికిత్సను తట్టుకోగలడా అని తెలుసుకునేందుకు అవసరమైన పరీక్షలు చేయిస్తారు. తగిన కాలేయ దాతను ఎంపిక చేసుకోడానికి ముందుగా ఆ దాతకు కూడా కొన్ని పరీక్షలు అవసరమవుతాయి. సాధారణ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు ఎక్స్–రే, అల్ట్రాసౌండ్, లివర్ బయాప్సీ, గుండె–శ్వాసకోశాల పరీక్షలు, కొలనోస్కోపీ, దంతపరీక్షలు చేయిస్తారు. మహిళల విషయంలో పాప్ టెస్ట్, మామోగ్రామ్, గైనకాలజీ సంబంధిత పరీక్షలు చేయిస్తారు. అయితే చికిత్సకు లొంగని ఇన్ఫెక్షన్లతో బాధపడుతున్నా, శరీరంలోని ఒక అవయవం దగ్గర మొదలైన క్యాన్సర్ ఇతర భాగాలకు వ్యాపిస్తున్నట్లు గుర్తించినా, తీవ్రమైన గుండెవ్యాధులు ఉన్నా, మద్యం అలవాటు మానలేని స్థితిలో ఉన్నా... కాలేయ మార్పిడి శస్త్రచికిత్సను చేయించుకోడానికి అనుమతించరు. కాలేయ మార్పిడి శస్త్రచికిత్స చేసే ముందర అటు దాతకూ, ఇటు స్వీకర్తకూ అవసరమైన పరీక్షలు చేస్తారు. ఆ వైద్యపరీక్షల ఫలితాలను చూసిన తర్వాతే లైవ్ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు ఇద్దరూ అన్ని విధాలా సిద్ధంగా ఉన్నట్లు నిర్ధారణ అయితే అప్పుడు మాత్రమే శస్త్రచికిత్స చేస్తారు. ఈ శస్త్రచికిత్సకు దాదాపు నాలుగు నుంచి 14 గంటల సమయం పడుతుంది. ఈ శస్త్రచికిత్స 90 – 95 శాతం విజయావకాశాలతో దాదాపు ప్రమాదరహితంగా ఉండటం వల్ల వీటిని నిర్భయంగా చేయించుకోవచ్చు.

ఫ్యామిలీ డాక్టర్

## మద్యంతో కాలేయం దెబ్బతింది... పరిష్కారం చెప్పండి

మావారి వయసు 57 ఏళ్లు. గడచిన 30 ఏళ్లు నుంచి మద్యం అలవాటు ఉంది. మూడేళ్ల కిందట తీవ్ర అనారోగ్యానికి గురైతే ఆసుపత్రిలో చేర్పించాం. లివర్ దెబ్బతిన్నదని చెప్పారు. తాగడం మానేయమన్నారు. లేదంటే లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీకి వెళ్లాల్సి ఉంటుందని చెప్పారు. కానీ ఆయన మానలేకపోయారు. ఇటీవల తరచూ చాలా నీరసంగా ఉంటుందంటున్నారు. ఎక్కువగా నిద్రపోతున్నారు. తిండి బాగా తగ్గించారు. మావారి సమస్యకు పరిష్కారం చెప్పండి.

– ఒక సోదరి, హైదరాబాద్

మితిమీరిన మద్యపానం వల్ల మీ భర్త కాలేయం తీవ్రంగా దెబ్బతిన్నది. కాలేయం తనకు నష్టం కలిగిస్తున్న అలవాట్లు, వ్యాధులను గుర్తించి, వాటిని సరిచేసుకోడానికి రోగికి చాలా అవకాశం ఇస్తుంది. మద్యపానం వంటి అలవాట్ల వల్ల దెబ్బతిన్నా, తొలిదశలో యథావిధిగా పనిచేస్తుంది. కానీ నిర్లక్ష్యం చేసినా, నష్టం కలిగించే అలవాటును మానకపోయినా దాని పనితీరు పూర్తిగా దెబ్బతింటుంది.

వ్యాధుల వల్ల కాలేయానికి జరిగిన నష్టాన్ని బట్టి దానిని మూడు స్థాయిలుగా గుర్తిస్తారు. వాటిని ఏ, బి, సి 'చైల్డ్ పగ్ స్టేజెస్' అంటారు. 'ఎ' చైల్డ్ స్థాయిలోనే డాక్టర్ వద్దకు రాగలిగితే మందులతో, అలవాట్లలో మార్పులతో చికిత్స చేసి, కాలేయ పనితీరును పూర్తి సాధారణ స్థాయికి పునరుద్ధరించవచ్చు. మొదటి రెండు (ఏ, బీ చైల్డ్ స్టేజెస్) స్థాయిల్లోనూ చాలా వరకు తిరిగి కోలుకోవడానికి కాలేయం అవకాశం ఇస్తుంది. బీ, సీ స్థాయిలలో వస్తే వ్యాధి తీవ్రత, వ్యక్తి తట్టుకోగల శక్తిని అంచనావేసి, కాలేయమార్పిడి చికిత్సను సిఫార్సు చేస్తారు.

మీరు తెలిపిన వివరాలు, లక్షణాల ప్రకారం రెండేళ్ల క్రితమే మీ భర్త కాలేయ వ్యాధి 'బి' స్థాయికి చేరుకున్నది. మద్యం మానలేకపోవడం వల్ల అది చివరిదశ ప్రారంభంలోకి ప్రవేశించినట్లు ఉన్నది. ఇప్పుడు మద్యం పూర్తిగా మానివేయడంతో పాటు కాలేయ మార్పిడి చికిత్స ఒక్కటే ఆయనను కాపాడగలదు. కాబట్టి మీరు ఆందోళన పడకుండా మీ డాక్టర్‌ను సంప్రదించి కాలేయ మార్పిడి శస్త్రచికిత్సకు సిద్ధం కండి.



డాక్టర్ బాలచంద్రన్ మీనన్,
సీనియర్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెపటాలజీ అండ్ లివర్ డిసీజెస్,
యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్

# సాక్షి భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

సోమవారం
24-6-2019





# ఎంబీబీఎస్.. లేటరల్ ఎంట్రీ!

బీడీఎస్, బీఎస్సీ-నర్సింగ్ విద్యార్థులు.. ఎంబీబీఎస్‌లో చేరొచ్చా?
ఎంబీబీఎస్‌లో.. మొదటి రెండేళ్లు కామన్ సిలబస్ అమలు కానుందా?
సైన్స్ గ్రాడ్యుయేట్లకు వైద్య విద్య కోర్సుల్లో చేరే అవకాశం లభించనుందా..?!
అంటే.. అవుననే సమాధానం వినిపిస్తోంది!! ఇటీవల కస్తూరి రంగన్ నేతృత్వంలోని కమిటీ.. జాతీయ నూతన విద్యా విధానం ముసాయిదాలో వైద్యవిద్యకు సంబంధించి పలు కీలక సిఫార్సులు చేసింది. నూతన విద్యా విధానం ముసాయిదా సర్వత్రా చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో వైద్యవిద్యపై కస్తూరి రంగన్ కమిటీ సిఫార్సులపై ప్రత్యేక కథనం...

‘దేశంలో అల్లోపతి (ఎంబీబీఎస్) వైద్యుల సంఖ్య పెరగాలి. అన్ని ప్రాంతాల్లోనూ అల్లోపతి వైద్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. అందుకోసం ఎంబీబీఎస్ కళాశాలల సంఖ్య పెంచాలి. రూరల్ ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేయాలి’

*– దేశంలో వైద్యుల కొరతకు సంబంధించి వివిధ వర్గాలు, వైద్య రంగ నిపుణుల అభిప్రాయాలు ఇవి!*

- నిపుణుల సూచనలు, సలహాలు పరిగణనలోకి తీసుకున్న కస్తూరి రంగన్ కమిటీ.. జాతీయ నూతన విద్యా విధానం ముసాయిదాలో పలు కీలక సిఫార్సులు చేసింది.

### ఎంబీబీఎస్‌లోకి లేటరల్ ఎంట్రీ

కస్తూరి రంగన్ కమిటీ.. బీడీఎస్, బీఎస్సీ నర్సింగ్ కోర్సు విద్యార్థులకు లేటరల్ ఎంట్రీ విధానంలో ఎంబీబీఎస్‌లోకి ప్రవేశం కల్పించాలనే ప్రతిపాదన చేసింది. ఇందుకోసం ప్రత్యేకంగా మెడికల్ ఎడ్యుకేషన్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాలని కమిటీ సిఫార్సు చేసింది. ఈ విధానం ప్రకారం ఎంబీబీఎస్‌లో మొదటి ఏడాది లేదా మొదటి రెండేళ్లు కామన్ సిలబస్ విధానం(ఎంబీబీఎస్, బీడీఎస్, నర్సింగ్) అమలు చేయాలి. ఫలితంగా బీడీఎస్, నర్సింగ్ నుంచి లేటరల్ ఎంట్రీ విధానంలో ఎంబీబీఎస్‌లోకి వచ్చే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. అంటే.. బీడీఎస్, లేదా బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులు కోర్సులో చేరిన రెండేళ్ల తర్వాత ఎంబీబీఎస్‌పై ఆసక్తి ఉంటే అందులో చేరొచ్చు. అలా చేరాక మిగతా సంవత్సరాల ఎంబీబీఎస్ కోర్సును పూర్తిచేయాల్సి ఉంటుంది. ఇలా లేటరల్ ఎంట్రీ విధానంలో ఎంబీబీఎస్‌లోకి ప్రవేశం కోసం నీట్ వంటి ప్రవేశ పరీక్షలో ర్యాంకు సాధించాలా? లేదా సంబంధిత కోర్సులో చూపిన ప్రతిభ ఆధారంగా ప్రవేశ కల్పిస్తారా?.. అడ్మిషన్ నిబంధనలు ఎలా ఉంటాయి అనే దానిపై స్పష్టతలేదు. అదే విధంగా సైన్స్ గ్రాడ్యుయేట్లకు ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం లేదా మొదటి రెండేళ్ల ఉమ్మడి సిలబస్‌ను బోధించి(కామన్ ఫౌండేషనల్ కోర్సెస్).. తర్వాత వారి ఆసక్తి ఆధారంగా ఎంబీబీఎస్, బీడీఎస్, నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశం కల్పించాలని మరో సిఫార్సు చేసింది.

### ఆయుష్.. ప్రధాన వైద్య విధానం

ఆయుష్ కోర్సులను ప్రత్యామ్నాయ వైద్య విధానాలుగా కాకుండా.. ప్రధాన వైద్య కోర్సులుగా రూపొందించాలని కమిటీ సిఫార్సు చేసింది. వీటిని పూర్తిచేసిన అభ్యర్థులను ప్రైమరీ హెల్త్‌కేర్ సెంటర్స్ (ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు), కమ్యూనిటీ హెల్త్ కేర్ సెంటర్స్‌లో.. వైద్యులుగా నియమించాలని ప్రతిపాదించింది. ఈ సిఫార్సుపై సానుకూలత కంటే ప్రతికూలతే ఎక్కువగా కనిపిస్తోంది. ఇప్పటికే ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కేంద్ర ప్రభుత్వానికి తమ వ్యతిరేకతను తెలియజేసింది.

### డైరెక్ట్ ఎంట్రీ ప్రాధాన్యం తగ్గనుందా?

లేటరల్ ఎంట్రీ విధానం అమల్లోకి వస్తే.. ఇంటర్మీడియెట్ బైపీసీ విద్యార్థులు భవిష్యత్తులో ఎంబీబీఎస్ కోర్సుల్లోకి నేరుగా ప్రవేశించే విధానం కనుమరుగవుతుందా అంటే..? పలువురు అవుననే అంటున్నారు. ఇందుకు కమిటీ సిఫార్సులను వారు ప్రస్తావిస్తున్నారు. కమిటీ ఎంబీబీఎస్ కోర్సు కరిక్యులంలో మొదటి ఒకటి లేదా రెండేళ్ల ఉమ్మడి సిలబస్ రూపొందించాలి. ఆ తర్వాత.. విద్యార్థులు తమ ఆసక్తికి అనుగుణంగా ఎంబీబీఎస్, బీడీఎస్, నర్సింగ్.. వీటిలో ఏదో ఒక కోర్సును ఎంపిక చేసుకుని అందులో అడుగుపెట్టే అవకాశం కల్పించాలి. దీని వల్ల ప్రస్తుతం బైపీసీ విద్యార్థులు నీట్ ద్వారా డైరెక్ట్ ఎంట్రీ విధానంలో ఎంబీబీఎస్‌లో చేరే విధానానికి ప్రాధాన్యం తగ్గుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### డెంటల్ కౌన్సిల్ నివేదిక

బీడీఎస్ విద్యార్థులు తమ కోర్సులో తొలి మూడేళ్లు ఎంబీబీఎస్ సిలబస్‌లో పేర్కొన్న అంశాలనే చదువుతారని.. కాబట్టే లేటరల్ ఎంట్రీ సిఫార్సు తెరపైకి వచ్చిందని మరికొంత మంది పేర్కొంటున్నారు. మరోవైపు బీడీఎస్ అభ్యర్థులు సైతం అల్లోపతి వైద్యం అందించేందుకు వీలు కల్పించాలంటూ.. డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతినిధుల బృందం ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందించింది.

- బీడీఎస్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మూడేళ్ల బ్రిడ్జ్ కోర్సు నిర్వహించాలి. ఇందులో ఉత్తీర్ణత సాధించిన వారికి ఎంబీబీఎస్ సర్టిఫికెట్ అందించాలి.
- ఈ బ్రిడ్జ్ కోర్సులో ప్రవేశానికి ప్రత్యేక ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించాలి. లేదా బీడీఎస్‌లో పొందిన మార్కులు/గ్రేడ్ పాయింట్లను పరిగణనలోకి తీసుకొని మెరిట్ జాబితా ఆధారంగా ప్రవేశం కల్పించాలి. లేదా ఈ రెండు విధానాలను(బ్రిడ్జ్ కోర్సులోకి ఎంట్రన్స్ టెస్ట్, బీడీఎస్ మెరిట్) పరిగణనలోకి తీసుకోవాలి. బ్రిడ్జ్ కోర్సులో ఉత్తీర్ణత సాధించిన వారికి జనరల్ ఫిజిషియన్స్‌గా పనిచేసేందుకు అవకాశం కల్పించాలి. ఇలా చేయడం వల్ల దేశంలో అల్లోపతి వైద్యుల కొరత తగ్గుతుందని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్యులు అందుబాటులోకి వస్తారని డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కేంద్ర ప్రభుత్వానికి తెలియజేసింది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.

### ఐఎంఏ వర్గాల నుంచి నిరసన

డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతిపాదనలు, కస్తూరి రంగన్ కమిటీ సిఫార్సులపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (అల్లోపతి వైద్యుల సంఘం) నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఐఎంఏ వర్గాల ప్రకారం ఏటా దేశంలో దాదాపు అరవై మూడు వేల మంది ఎంబీబీఎస్ గ్రాడ్యుయేట్లు పట్టాలతో బయటికి వస్తున్నారు. కానీ.. దేశవ్యాప్తంగా 23,700 పీజీ సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అంటే.. మెడికల్ బ్యాచిలర్ డిగ్రీ పట్టభద్రులు, పీజీ విద్యలో అడుగుపెట్టే వారి మధ్య దాదాపు నలభై వేల వ్యత్యాసం ఉంది. ఈ నలభై వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించకుండా.. బ్రిడ్జ్ కోర్సు పేరుతో బీడీఎస్ విద్యార్థులను అల్లోపతి వైద్యం చేసేందుకు అనుమతించడం సరికాదన్నది ఐఎంఏ వర్గాల వాదన.

### కావాలి ఎంబీబీఎస్‌లు

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం ప్రతి వెయ్యి మంది జనాభాకు ఒక డాక్టర్ (1000:1 నిష్పత్తిలో) ఉండాలి. కానీ, మన దేశంలో ప్రస్తుతం ఈ సంఖ్య 1700:1 గా ఉందనేది అంచనా. ఐఎంఏ వర్గాల అంచనా ప్రకారం.. 30 శాతం జనాభా ఉన్న పట్టణ ప్రాంతాల్లో దాదాపు 65 శాతం మంది అల్లోపతి వైద్య నిపుణులు అందుబాటులో ఉంటే.. 70 శాతం జనాభా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం కేవలం 33 శాతం మంది మాత్రమే అందుబాటులో ఉన్నారు. కాబట్టి పీజీ వైద్య విద్యలో ప్రవేశం లభించని ఎంబీబీఎస్‌లను హెల్త్ సెంటర్లలో ఫిజిషియన్లుగా నియమించి ఉద్యోగావకాశాలు కల్పించాలని ఐఎంఏ వర్గాలు పేర్కొంటున్నాయి. దీనికి భిన్నంగా బీడీఎస్, నర్సింగ్ విద్యార్థులను బ్రిడ్జ్ కోర్సు ఆధారంగా ఎంబీబీఎస్‌లోకి ప్రవేశం కల్పించడం సరికాదని ఆ స్పష్టం చేస్తున్నాయి.

### నీతి ఆయోగ్ సిఫార్సులు

దేశంలో ఎంబీబీఎస్ వైద్యుల కొరత దృష్ట్యా.. ఇతర వైద్య విభాగాలకు చెందిన వారికి అల్లోపతి వైద్యం చేసే అవకాశం కల్పించాలనే అంశంపై గత రెండేళ్లుగా చర్చ జరుగుతోంది. ముందుగా ఆయుష్ వైద్యులకు ఎంబీబీఎస్ చదివే అవకాశం కల్పించాలని.. ఇందుకు బ్రిడ్జ్ కోర్స్ విధానం ప్రవేశపెట్టాలని నీతిఆయోగ్, ఇండియన్ మెడికల్ కమిషన్ బిల్-2018లో సిఫార్సు చేశాయి. అప్పట్లో దీనిపై ఐఎంఏ వర్గాల నుంచి వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం వెనక్కు తగ్గింది. తాజాగా మరోసారి కస్తూరి రంగన్ కమిటీ ఎంబీబీఎస్‌లోకి లేటరల్ ఎంట్రీ విధానం గురించి సిఫార్సులు చేయడంతో మళ్లీ చర్చనీయాంశంగా మారింది.

### ఎగ్జిట్ ఎగ్జామ్.. మరోసారి తెరపైకి

కస్తూరి రంగన్ కమిటీ సిఫార్సుల నేపథ్యంలో ఎగ్జిట్ ఎగ్జామ్ మరోసారి తెరపైకి వచ్చింది. ఎంబీబీఎస్ పూర్తిచేసిన విద్యార్థులకు వార్షికంగా జరిపే పరీక్షలకు బదులు జాతీయస్థాయిలో ఉమ్మడిగా ఎగ్జిట్ పరీక్ష నిర్వహించాలని కమిటీ సూచించింది. అందులో ఉత్తీర్ణత సాధించిన వారికి ఉన్నత విద్య, ప్రాక్టీస్ పరంగా అనుమతి ఇవ్వాలనే సిఫార్సు చేసింది. వాస్తవానికి ఈ సిఫార్సు కూడా గత కొన్నేళ్లుగా నీతి ఆయోగ్, గత రెండేళ్లుగా ఐఎంసీ బిల్లులో నానుతూనే ఉంది.

### ఈ సిఫార్సులు సరికాదు

బీడీఎస్, నర్సింగ్ విద్యార్థులను లేటరల్ ఎంట్రీ విధానంలో ఎంబీబీఎస్‌లోకి ప్రవేశం కల్పించాలనే సిఫార్సు.. అదే విధంగా ఫౌండేషన్ కోర్సు విధానం వంటి ప్రతిపాదనలు సరికాదు. ప్రస్తుతం ప్రభుత్వం అల్లోపతి వైద్యం పరంగా ఎంబీబీఎస్ పూర్తిచేసిన వారందరికీ ఉద్యోగావకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటే మేలు. దాని ద్వారా ఇప్పుడున్న పేషెంట్-డాక్టర్ నిష్పత్తి మధ్య తేడాను గణనీయంగా తగ్గించొచ్చు.

**– డాక్టర్ ఆర్.వి.అశోకన్,**
సెక్రటరీ జనరల్, ఐఎంఏ.

### బ్రిడ్జ్ కోర్సు పేరిట మరో మూడేళ్లు

తాజా సిఫార్సులతో రానున్న రోజుల్లో అల్లోపతి వైద్యం విస్తృతంగా అందుబాటులోకి వస్తుందనే మాట నిజమే. కానీ, అప్పటికే అయిదేళ్లపాటు బీడీఎస్ చదివిన విద్యార్థులు బ్రిడ్జ్ కోర్సు పేరిట మరో మూడేళ్లు సమయం అదనంగా వెచ్చించినా.. ఎంబీబీఎస్ పట్టా మాత్రమే లభిస్తుంది. ఇది బీడీఎస్ విద్యను కూడా కమర్షియల్ చేసే ప్రమాదం ఉంది.

**– డాక్టర్ కె.శ్రీనాథ్ రెడ్డి,** ప్రెసిడెంట్,
పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా.



### అనుకూలమా, ప్రతికూలమా?

తాజా సిఫార్సులు విద్యార్థులకు అనుకూలమా, ప్రతికూలమా అంటే రెండు రకాల అభిప్రాయాలూ వినిపిస్తున్నాయి.

**అనుకూలతలు:**

- ఎంబీబీఎస్ స్వప్నం నెరవేరక ప్రత్యామ్నాయ వైద్య విద్య కోర్సులపై దృష్టిపెడుతున్న అభ్యర్థులకు.. ఎంబీబీఎస్ కల నెరవేరే అవకాశం లభిస్తుంది.
- ఇప్పటి వరకు తాము చదివిన విభాగాల్లోనే(డెంటల్, నర్సింగ్) ఉపాధి అవకాశాలు పొందుతున్న వారికి.. కొత్తగా వాటితోపాటు అల్లోపతి వైద్యం చేసే వీలు కలుగుతుంది.
- నర్సింగ్ విద్యార్థుల విషయంలో ఇది అత్యంత అనుకూలించే అంశంగా చెప్పొచ్చు. ప్రస్తుతం ఉన్నత విద్య పరంగా ఎన్ని కోర్సులు చదివినా వారు నర్సింగ్ విభాగానికే పరిమితం అవుతున్నారు. తాజా సిఫార్సులు అమలైతే వారు కూడా వైద్యులుగా సేవలందించడానికి అవకాశం లభిస్తుంది.

**ప్రతికూలతలు:**

- అప్పటికే అయిదేళ్లపాటు డెంటల్ కోర్సు చదివిన విద్యార్థులు మరో మూడేళ్ల బ్రిడ్జ్ కోర్సు చదివినా.. ఎంబీబీఎస్ పట్టా మాత్రమే అందుతుంది. దానికి బదులుగా ఈ వ్యవధిలో డెంటల్ పీజీ పూర్తిచేసుకునే అవకాశం ఉంటుంది.
- భవిష్యత్తులో బీడీఎస్, నర్సింగ్ కోర్సులకు కూడా ఎంబీబీఎస్ మాదిరిగా రూ. లక్షలు ఫీజులు చెల్లించి చేరాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.
- తాజా సిఫార్సులు అమలైతే.. బీడీఎస్ ఫీజులు ప్రైవేటు కళాశాలల్లో అమాంతం పెరిగే ఆస్కారముంది.

### నూతన విద్యా విధానం.. ముఖ్యాంశాలు

- బీడీఎస్, నర్సింగ్ విద్యార్థులకు ఎంబీబీఎస్‌లోకి లేటరల్ ఎంట్రీ విధానంలో అనుమతి.
- సైన్స్ గ్రాడ్యుయేట్లకు ఎంబీబీఎస్ తొలి ఏడాది లేదా రెండేళ్లు ఉమ్మడి సిలబస్ బోధించి.. తర్వాత వారి ఆసక్తి ఆధారంగా ఎంబీబీఎస్, బీడీఎస్, నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశం కల్పించడం.
- ఎంబీబీఎస్ తర్వాత అకడమిక్ వార్షిక పరీక్షలకు బదులు జాతీయస్థాయిలో ఏకరూప రీతిలో ఎగ్జిట్ ఎగ్జామ్ నిర్వహించడం.

---

## ఉద్యోగ సమాచారం

### ఐడీబీఐ బ్యాంక్‌లో600 పోస్టులు

ఐడీబీఐ బ్యాంకు 600 అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఎంపికైన అభ్యర్థులు ఏడాది వ్యవధిగల పీజీ డిప్లొమా కోర్సు పూర్తిచేయాల్సి ఉంటుంది.

- **కోర్సు:** పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ (పీజీడీబీఎఫ్).
- **మొత్తం ఖాళీలు:** 600.

| కేటగిరీ | ఖాళీలు |
|---|---|
| యూఆర్ | 273 |
| ఎస్సీ | 90 |
| ఎస్టీ | 45 |
| ఈడబ్ల్యూఎస్ | 30 |
| ఓబీసీ | 162 |
| మొత్తం | 600 |

- **అర్హత:** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి గ్రాడ్యుయేషన్.
- **వయసు:** 2019, జూన్ 1 నాటికి 21-28 ఏళ్లు. ఎస్సీ/ఎస్టీలకు అయిదేళ్లు; ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు మూడేళ్లు; పీడబ్ల్యూడీ అభ్యర్థులకు పదేళ్ల గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **కోర్సు వ్యవధి:** ఏడాది (క్లాస్‌రూం స్టడీస్-9 నెలలు; ఐడీబీఐ బ్యాంక్ బ్రాంచ్‌లో ఇంటర్న్‌షిప్-3 నెలలు).
- బెంగళూరులోని మణిపాల్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్‌లో ఏడాది కోర్సును విజయవంతంగా పూర్తిచేసిన వారికి మణిపాల్ యూనివర్సిటీ నుంచి పీజీడీబీఎఫ్ సర్టిఫికెట్ అందుతుంది. ఆపై అర్హతల ఆధారంగా ఐడీబీఐ బ్యాంక్‌లోకి అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్-ఏ పోస్ట్‌లోకి తీసుకుంటారు.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ.



**పరీక్ష విధానం**
(సమయం: రెండు గంటలు)

| సబ్జెక్టు | ప్రశ్నలు | మార్కులు |
|---|---|---|
| 1. లాజికల్ రీజనింగ్, డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రెటేషన్ | 60 | 60 |
| 2. ఇంగ్లిష్ లాంగ్వేజ్ | 40 | 40 |
| 3. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ | 40 | 40 |
| 4. జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్ | 60 | 60 |
| మొత్తం | 200 | 200 |

- నెగెటివ్ మార్కులుంటాయి. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కులు కోత విధిస్తారు.
- **ఫీజు:** ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులకు రూ.150; ఇతరులకు రూ.700.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 3, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.idbibank.in/index.asp


## సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్లో..

❖ జనరల్ స్టడీస్ మోడల్ పేపర్లు ❖ కెరీర్ కౌన్సెలింగ్

విద్య, ఉద్యోగ సమాచారం కోసం

WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS
యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి
GET IT ON Google Play · Available on the App Store


---

గెస్ట్ కాలం

# ఇంజనీరింగ్‌తోపాటు మరెన్నో..

- మ్యాథ్స్, సైన్స్ విద్యార్థులకు అనేక అద్భుత అవకాశాలున్నాయి
- జోసాలో పాల్గొనే విద్యార్థులు మాక్‌సీట్ అలకేషన్‌పై దృష్టిపెట్టాలి
- నిజంగా ఆసక్తి ఉన్న ఇంజనీరింగ్ బ్రాంచ్‌నే ఎంచుకోవడం మేలు
- జేఈఈ అడ్వాన్స్‌డ్ ఆర్గనైజింగ్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఎం.ఎల్.శర్మ

‘దేశవ్యాప్తంగా లక్షల మంది విద్యార్థులు.. కెరీర్ అంటే ఇంజనీరింగ్ మాత్రమే అనే భావనలో ఉంటున్నారు. ఇది ఏ మాత్రం సరికాదు. మ్యాథ్స్, సైన్స్ విద్యార్థులకు ఇంజనీరింగ్‌తోపాటు మరెన్నో అద్భుత అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. అలాంటివాటిపైనా దృష్టిసారించాలి’.. అని సూచిస్తున్నారు జేఈఈ-అడ్వాన్స్‌డ్-2019 ఆర్గనైజింగ్ ఛైర్మన్, ఐఐటీ రూర్కీ ఎర్త్‌క్వేక్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ ఎం.ఎల్.శర్మ. ప్రస్తుతం ఐఐటీలు, ఎన్‌ఐటీల్లో ప్రవేశానికి ‘జోసా’ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ప్రొఫెసర్ ఎం.ఎల్.శర్మతో గెస్ట్ కాలం..



ప్రొఫెసర్ ఎం.ఎల్.శర్మ

### ఇంజనీరింగ్, ఐఐటీలే కాదు

ప్రస్తుతం విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో కెరీర్ అంటే ఇంజనీరింగ్, అందుకు ఉత్తమ వేదికలు ఐఐటీలు అనే భావన నెలకొంది. ఇన్‌స్టిట్యూట్‌ల పరంగా ఐఐటీలు ఉత్తమమైనవనేది నిస్సందేహం. కానీ, కోర్సు విషయంలో విద్యార్థులు ఇంజనీరింగ్‌కే పరిమితం కావడం సరికాదు. ఐఐటీల్లో ఈడబ్ల్యూఎస్ కోటాతో కలిపి ఈ సంవత్సరం అందుబాటులో ఉన్న సీట్ల సంఖ్య 13,500. అడ్వాన్స్‌డ్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థుల సంఖ్య 38వేలకు పైగానే ఉంది. టాప్-20 పర్సంటైల్, రిజర్వేషన్లు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటే.. ఐఐటీల్లో చేరే అవకాశం లభించని వారి సంఖ్య 25వేల వరకు ఉంటుంది. ఇలాంటి విద్యార్థులంతా నిరుత్సాహానికి గురవుతున్నారు.

### ఇంజనీరింగ్‌తోపాటు మరెన్నో

ప్రస్తుతం మ్యాథ్స్, సైన్స్ విద్యార్థులకు ఇంజనీరింగ్‌తోపాటు మరెన్నో అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. ఈ రెండు విభాగాల్లో కోర్ సబ్జెక్టుల్లో రీసెర్చ్ స్థాయికి తీసుకెళ్లే కోర్సులు అందించే ఉత్తమ ఇన్‌స్టిట్యూట్‌లకు కొదవలేదు. ఆయా కోర్సులు, కాలేజీల్లో చేరి ఈ కోర్సులు పూర్తిచేసుకోవడం ద్వారా ఇంజనీరింగ్‌కు దీటైన కెరీర్ అవకాశాలు అందుకోవచ్చు. విద్యార్థులు ఇలాంటి కోర్సులు, ఇన్‌స్టిట్యూట్‌ల గురించి అవగాహన పెంచుకోవాలి. అందుకు తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు సహకరించాలి.

### మాక్ సీట్ అలొకేషన్

జోసా కౌన్సెలింగ్ ప్రక్రియ పరంగా మాక్ సీట్ అలొకేషన్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. దీనివల్ల విద్యార్థులు ఛాయిస్ ఫిల్లింగ్ సమయంలో తాము పేర్కొన్న ప్రాథమ్యాల ఆధారంగా ఏ ఇన్‌స్టిట్యూట్‌లో, ఏ బ్రాంచ్‌లో సీటు లభిస్తుందో అంచనాకు రావొచ్చు. దీనిద్వారా వారు తమ ఛాయిస్‌లను మార్చుకునే వీలుంటుంది. ఛాయిస్ ఫిల్లింగ్ చేసిన ప్రతి విద్యార్థి ఈ మాక్ సీట్ అలొకేషన్‌పై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఈనెల 25వ తేదీ వరకు ఛాయిస్ ఫిల్లింగ్ అవకాశం, ఆ లోపే రెండు దశలుగా మాక్ సీట్ అలొకేషన్ ఉంటుంది. కాబట్టి విద్యార్థులు ఛాయిస్ ఫిల్లింగ్ పరంగా ఇప్పటికే ఇచ్చిన ప్రిఫరెన్స్‌లను ఒకటికి రెండుసార్లు పరిశీలించి మార్పులు చేర్పులపై దృష్టిపెట్టొచ్చు.



### బ్రాంచ్ ఎంపికలో జాగ్రత్తగా

ఇప్పటికే ప్రారంభమైన ఛాయిస్ ఫిల్లింగ్‌లో విద్యార్థులు తాము పేర్కొన్న బ్రాంచ్‌ల ప్రాథమ్యాలను మరోసారి సరిచూసుకోవాలి. తమకు నిజంగా ఆసక్తి ఉన్న బ్రాంచ్‌నే ఎంపిక చేసుకోవాలి. ఇన్‌స్టిట్యూట్ ప్రాముఖ్యత ఆధారంగా బ్రాంచ్‌ను ఎంపిక చేసుకోవడం సరికాదు. ప్రస్తుతం ఏ బ్రాంచ్ విద్యార్థులకైనా ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలకు కొదవలేదు. అధిక శాతం మంది విద్యార్థులు సీఎస్ఈ బ్రాంచ్‌కు ప్రాధాన్యమిస్తున్న విషయం వాస్తవమే. అందుబాటులోని సీట్లను పరిగణనలోకి తీసుకుంటే.. ఈ బ్రాంచ్‌లో సీట్లు లభించే వారి సంఖ్య పది శాతంలోపే ఉంటుంది. కాబట్టి మిగతా విద్యార్థులకు వారు ఇచ్చిన ఆప్షన్ల ఆధారంగా వేరే బ్రాంచ్‌లను కేటాయిస్తారు.

### స్పాట్ రౌండ్ లేదు

ఐఐటీల్లో సీట్ల కేటాయింపు పరంగా స్పాట్ రౌండ్ అనే విధానం ఎప్పుడూ లేదు. ఈసారి కూడా ఉండదు. ఎన్‌ఐటీల్లో మాత్రం ఏడు రౌండ్ల తర్వాత కూడా సీట్లు మిగిలిపోతే సీఎస్ఏబీ స్పెషల్ రౌండ్స్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహిస్తుంది.

### ఒత్తిడికి గురికావొద్దు

జోసా కౌన్సెలింగ్‌లో సీటు సాధించి ఐఐటీ/ఎన్‌ఐటీ క్యాంపస్‌లలో అడుగుపెట్టే విద్యార్థులు ‘ఒత్తిడి’కి గురికావొద్దు. బోధన విధానాలు, భౌగోళిక పరిస్థితులు కారణంగా మొదట కొంత కాలం విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారు. గ్రామీణ ప్రాంతాలే కాకుండా.. పట్టణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థుల్లో సైతం ఈ మానసిక ఒత్తిడి కనిపిస్తోంది. +2 వరకు విద్యార్థులు చదివిన విధానం, ఐఐటీ, ఎన్‌ఐటీల్లో విద్యా విధానం పూర్తి భిన్నంగా ఉండటమే ఇందుకు కారణం. అందుకే మేం ఓరియెంటేషన్ ప్రోగ్రామ్స్, పర్సనల్ కౌన్సెలింగ్ విధానాలను అమలు చేస్తున్నాం. వీటిద్వారా ఒత్తిడికి ఫుల్‌స్టాప్ పెట్టొచ్చు!!

సాక్షి స్పోర్ట్స్

సోమవారం
24-6-2019

# ఇది క్లిష్టమైన విజయం



**బుమ్రా, షమీ అద్భుతం ● విరాట్ కోహ్లి వ్యాఖ్య**

**సౌతాంప్టన్:** శక్తి సామర్థ్యాలకు పూర్తి పరీక్షగా నిలిచే మ్యాచ్‌లు జట్టుకు అవసరమైనవేనని టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి అన్నాడు. ఓటమి ముప్పు తప్పించుకుంటూ ప్రపంచ కప్‌లో అఫ్గానిస్తాన్‌పై సాధించిన ఉత్కంఠభరిత గెలుపును ప్రస్తావిస్తూ అతడీ వ్యాఖ్యలు చేశాడు. 'మేం వేసుకున్న ప్రణాళికలేవీ సాగని, ప్రతిభనంతా ప్రదర్శిస్తూ పుంజుకోవాల్సిన ఇలాంటి మ్యాచ్‌లు మా దృష్టిలో అతి ముఖ్యమైనవి. జట్టులో ప్రతి ఒక్కరూ తమ వంతు కోసం వేచి చూస్తున్నారు. బంతిని స్వింగ్ చేస్తూ షమీ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. పిచ్ స్వభావం కారణంగా షాట్లు ఆడటం కష్టమైంది' అని మ్యాచ్ అనంతరం కోహ్లి చెప్పుకొచ్చాడు. తొలుతే వికెట్లు పడగొట్టినా, బుమ్రాను సమయానుకూలంగా వాడుకుని ప్రత్యర్థికి హెచ్చరిక సందేశం పంపాలని ముందే అనుకున్నట్లు కోహ్లి తెలిపాడు.

### కెప్టెన్ నమ్మకమే నాకు ప్రేరణ: బుమ్రా

బౌలింగ్‌కు దిగిన ప్రతిసారీ కెప్టెన్ తన మీద ఉంచే నమ్మకమే తనకు ప్రేరణ అని టీమిండియా పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా అన్నాడు. అది తనకు ఎనలేని ఆత్మవిశ్వాసం ఇస్తుందని పేర్కొన్నాడు. అఫ్గాన్‌తో మ్యాచ్‌లో తన చివరి రెండు ఓవర్లలో బుమ్రా ఏకంగా 7 యార్కర్లు వేయడం విశేషం. దీనిపై మాట్లాడుతూ 'నెమ్మదిస్తున్న పిచ్‌కు తగిన విధంగా వికెట్లకు నేరుగా బౌలింగ్ చేస్తూ, యార్కర్లు సంధించా. వికెట్లు తీయకున్నా పరుగులు నిరోధిస్తూ ప్రత్యర్థి సాధించాల్సిన రన్‌రేట్ పెరిగేలా చేసి అవకాశాలు సృష్టించుకోవడం మా గేమ్ ప్లాన్' అని అతడు వివరించాడు.

### ధోని సలహా ఇచ్చాడు: షమీ

49వ ఓవర్లో బుమ్రా తక్కువ పరుగులివ్వడం తన పని తేలిక చేసిందని పేసర్ షమీ వ్యాఖ్యానించాడు. అయినప్పటికీ దానిని ఓ సవాలుగా భావించానన్నాడు. చివరి ఓవర్లో, అందులోనూ ప్రపంచ కప్‌లో సాధించినందున హ్యాట్రిక్‌ను చాలా ప్రత్యేకమైనదిగా అతడు అభివర్ణించాడు. 'ప్రపంచ కప్‌లో హ్యాట్రిక్‌లు చాలా అరుదు. ఇది మంచి అవకాశం. యార్కర్ వేసేందుకే ప్రయత్నించు అని ధోని సలహా ఇచ్చాడు. దానిని మైండ్‌లో పెట్టుకునే బౌలింగ్ చేశా' అని షమీ తెలిపాడు. వికెట్ ఇవ్వకుండా మ్యాచ్‌లో అఫ్గాన్ ఆల్‌రౌండర్ నబీ చిరాకు పెట్టినా, ఆ ప్రభావం బౌలింగ్‌పై పడనీయలేదని, అతడిని ఔట్ చేస్తే తమ గెలుపు ఖాయమని తెలుసని అన్నాడు. 'షార్ట్ బంతులు, బౌన్సర్లను ఎదుర్కొనడంలో అఫ్గాన్ల బలహీనతను గుర్తించి అందుకు తగ్గట్లు బౌలింగ్ చేశాం. ఫుల్ లెంగ్త్ బంతులు వేయకుండా జాగ్రత్తపడ్డాం' అని షమీ అన్నాడు.



### కోహ్లికి జరిమానా

**సౌతాంప్టన్:** అఫ్గాన్‌తో మ్యాచ్‌లో అతిగా అప్పీల్ చేసినందుకు భారత కెప్టెన్ విరాట్ కోహ్లి మ్యాచ్ ఫీజులో 25 శాతం కోతతో పాటు ఒక డి మెరిట్ పాయింట్‌ను ఎదుర్కొన్నాడు. 29వ ఓవర్ బుమ్రా బౌలింగ్‌లో రహ్మత్ షా ఎల్బీడబ్ల్యూకు అప్పీల్ చేయగా అంపైర్ అలీమ్ దార్ తిరస్కరించాడు. దీంతో కోహ్లి... అతడి వద్దకు వెళ్లి వాదనకు దిగాడు. దీనికి ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని 2.1 నిబంధన ప్రకారం లెవల్ 1 ఉల్లంఘన కింద భారత కెప్టెన్‌పై చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం కోహ్లి ఖాతాలో రెండు డి మెరిట్ పాయింట్లున్నాయి.

## ధోని, జాదవ్... అదేం బ్యాటింగ్?

**సౌతాంప్టన్:** అఫ్గానిస్తాన్‌తో మ్యాచ్‌లో ధోని –జాదవ్ బ్యాటింగ్ తీరు పట్ల క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. 'నేను మ్యాచ్ తీరుపై నిరుత్సాహానికి గురయ్యా. ఇంకా బాగా ఆడాల్సింది. ధోని– జాదవ్ నెమ్మదైన భాగస్వామ్యంపై కూడా అసంతృప్తి చెందా. మన బ్యాట్స్‌మెన్ 34 ఓవర్లు స్పిన్ ఆడి 119 పరుగులే చేశారు. మిడిలార్డర్‌లో సౌకర్యంగా లేమని ఇది చెబుతోంది. జాదవ్‌పై ఒత్తిడి తగ్గించేలా ధోని మరింత బాధ్యత తీసుకుని ఉండాల్సింది' అని సచిన్ అన్నాడు.

# పాకిస్తాన్ గెలిచింది...



సొహైల్

ఇంగ్లండ్ గడ్డపై దక్షిణాఫ్రికా ప్రపంచకప్ ప్రస్థానం లీగ్ దశలోనే ముగిసింది. ఇప్పటి వరకు ఒకటే విజయంతో సరిపెట్టుకున్న సఫారీ ఐదు మ్యాచ్‌ల్లో ఓడింది. దీంతో సెమీస్ అవకాశాల్ని పూర్తిగా కోల్పోయింది. మరోవైపు పాకిస్తాన్ జట్టు ఎట్టకేలకు రెండో విజయాన్ని సాధించింది. ముందుగా బ్యాట్స్‌మెన్, తర్వాత బౌలర్లు సమష్టిగా కదం తొక్కడంతో దక్షిణాఫ్రికాను తేలిగ్గానే కంగుతినిపించింది.

- మళ్లీ ఓడిన దక్షిణాఫ్రికా
- ప్రపంచ కప్‌నుంచి నిష్క్రమణ

**లండన్:** పాకిస్తాన్ జట్టు సమష్టి శ్రమతో దక్షిణాఫ్రికాను బోల్తా కొట్టించింది. ఆదివారం జరిగిన పోరులో పాకిస్తాన్ 49 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 308 పరుగులు చేసింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' హారిస్ సొహైల్ (59 బంతుల్లో 89; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు), బాబర్ ఆజమ్ (80 బంతుల్లో 69; 7 ఫోర్లు) రాణించారు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 9 వికెట్లకు 259 పరుగులు చేసి ఓడింది. డుప్లెసిస్ (79 బంతుల్లో 63; 5 ఫోర్లు), డికాక్ (60 బంతుల్లో 47; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు.

**ఓపెనర్ల శుభారంభం**

పాక్‌కు ఓపెనర్లు ఇమామ్ ఉల్ హక్ (58 బంతుల్లో 44; 6 ఫోర్లు), ఫఖర్ జమాన్ (50 బంతుల్లో 44; 6 ఫోర్లు, 1 సిక్స్) శుభారంభం అందించారు. కుదురుగా ఆడుతున్న ఓపెనర్లను ఇమ్రాన్ తాహిర్ ఔట్ చేశాడు. తర్వాత బాబర్ ఆజమ్, హఫీజ్ (20)లు కూడా బాధ్యతగా ఆడటంతో సఫారీ బౌలర్లకు కష్టాలు తప్పలేదు. హఫీజ్ వెనుదిరిగాక వచ్చిన హారిస్ సొహైల్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. క్రీజ్‌లో పాతుకుపోయిన ఆజమ్‌తో కలిసి నాలుగో వికెట్‌కు 81 పరుగులు జోడించాడు. బాబర్ 61 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తిచేసుకున్నాడు. జట్టు స్కోరు 224 పరుగుల వద్ద బాబర్ నిష్క్రమించగా, సొహైల్... ఇమాద్ వసీమ్ (23; 3 ఫోర్లు) కలిసి ఐదో వికెట్‌కు 71 పరుగులు జోడించారు. ధాటిగా ఆడిన సొహైల్ 38 బంతుల్లో అర్ధశతకం సాధించాడు.

**డుప్లెసిస్ మినహా...**

ఆరంభంలోనే ఆమ్లా (2) ఔట్ కాగా... డికాక్, కెప్టెన్ డుప్లెసిస్ క్రీజులో ఉన్నంతసేపు దక్షిణాఫ్రికా గెలుపు మీద ఆశలు పెట్టుకుంది. వీళ్లిద్దరు పాక్ బౌలర్లను చక్కగా ఎదుర్కొన్నారు. రెండో వికెట్‌కు 87 పరుగులు జోడించారు. డికాక్‌తో పాటు స్వల్ప వ్యవధిలో మార్క్‌రమ్ (7)ను స్పిన్నర్ షాదాబ్ ఔట్ చేశాడు. అర్ధసెంచరీ పూర్తిచేసుకున్న డుప్లెసిస్‌ను ఆమిర్ పెవిలియన్ చేర్చాడు. 136 పరుగులకే 4 కీలక వికెట్లను కోల్పోయిన దక్షిణాఫ్రికా లక్ష్యానికి దూరమైంది.

### స్కోరు వివరాలు

**పాకిస్తాన్ ఇన్నింగ్స్:** ఇమామ్ (సి అండ్ బి) తాహిర్ 44; ఫఖర్ (సి) ఆమ్లా (బి) తాహిర్ 44; బాబర్ (సి) ఇన్‌గిడి (బి) ఫెలుక్‌వాయో 69; హఫీజ్ ఎల్బీడబ్ల్యూ (బి) మార్క్‌రమ్ 20; సొహైల్ (సి) డికాక్ (బి) ఇన్‌గిడి 89; ఇమాద్ (సి) సబ్–డుమిని (బి) ఇన్‌గిడి 23; రియాజ్ (బి) ఇన్‌గిడి 4; సర్ఫ్‌రాజ్ నాటౌట్ 2; షాదాబ్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 12;
**మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 308.**
**వికెట్ల పతనం:** 1–81, 2–98, 3–143, 4–224, 5–295, 6–304, 7–307.
**బౌలింగ్:** రబడ 10–0–65–0, ఇన్‌గిడి 9–0–64–3, మోరిస్ 9–0–61–0, ఫెలుక్‌వాయో 8–0–49–1, తాహిర్ 10–0–41–2, మార్క్‌రమ్ 4–0–22–1.

**దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్:** ఆమ్లా ఎల్బీడబ్ల్యు (బి) ఆమిర్ 2; డికాక్ (సి) ఇమామ్ (బి) షాదాబ్ 47; డుప్లెసిస్ (సి) సర్ఫ్‌రాజ్ (బి ఆమిర్ 63; మార్క్‌రమ్ (బి) షాదాబ్ 7; డసెన్ (సి) హఫీజ్ (బి) షాదాబ్ 36; మిల్లర్ (బి) షాహిన్ 31; ఫెలుక్‌వాయో నాటౌట్ 46; మోరిస్ (బి) రియాజ్ 16, రబడ (బి) రియాజ్ 3; ఇన్‌గిడి (బి) రియాజ్ 1; తాహిర్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 6;
**మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు) 259.**
**వికెట్ల పతనం:** 1–4, 2–91, 3–103, 4–136, 5–189, 6–192, 7–222, 8–239, 9–246.
**బౌలింగ్:** హఫీజ్ 2–0–11–0, ఆమిర్ 10–1–49–2, షాహిన్ 8–0–54–1, వసీమ్ 10–0–48–0, రియాజ్ 10–0–46–3, షాదాబ్ 10–1–50–3.

### పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | ర | నె.ర.రే. | పా |
|---|---|---|---|---|---|---|
| న్యూజిలాండ్ | 6 | 5 | 0 | 1 | 1.306 | 11 |
| ఆస్ట్రేలియా | 6 | 5 | 1 | 0 | 0.849 | 10 |
| భారత్ | 5 | 4 | 0 | 1 | 0.809 | 9 |
| ఇంగ్లండ్ | 6 | 4 | 2 | 0 | 1.457 | 8 |
| శ్రీలంక | 6 | 2 | 2 | 2 | -1.119 | 6 |
| బంగ్లాదేశ్ | 6 | 2 | 3 | 1 | -0.407 | 5 |
| పాకిస్తాన్ | 6 | 2 | 3 | 1 | -1.265 | 5 |
| వెస్టిండీస్ | 6 | 1 | 4 | 1 | 0.190 | 3 |
| దక్షిణాఫ్రికా | 7 | 1 | 5 | 1 | -0.324 | 3 |
| అఫ్గానిస్తాన్ | 6 | 0 | 6 | 0 | -1.712 | 0 |

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, ర–రద్దు, నె.ర.రే–నెట్ రన్‌రేట్, పా–పాయింట్లు

### ప్రపంచకప్‌లో నేడు

అఫ్గానిస్తాన్ x బంగ్లాదేశ్
వేదిక: సౌతాంప్టన్
మధ్యాహ్నం 3 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం

## బ్రాత్‌వైట్ సెంచరీతో పోరాడినా...





విండీస్ లక్ష్యం 292.
స్కోరు 142/4గా ఉన్న దశలో కార్లోస్ బ్రాత్‌వైట్ క్రీజులోకి వచ్చాడు.
ఇంకో మూడు ఓవర్లయ్యాక చూస్తే 164/7.
ఇక జట్టు ఓటమికి మూడే అడుగుల దూరం.
విజయానికి మాత్రం 128 పరుగుల సుదూర ప్రయాణం
ఈ దశలో బ్రాత్‌వైట్ అద్భుత ఇన్నింగ్స్‌కు తెరలేపాడు.
9 బౌండరీలు, 5 భారీ సిక్సర్లతో 'మ్యాచ్ సీన్' మార్చేశాడు. టెయిలెండర్ల అండతో మెరుపు సెంచరీ సాధించాడు. ఇక 7 బంతుల్లో ఆరే పరుగులు కావాలి. ఆఖరి వికెట్ కావడం... అందునా అవతలి వైపు బ్యాట్స్‌మన్ లేకపోవడంతో సిక్స్‌తో ఆట ముగించేందుకు ప్రయత్నించాడు. అయితే అతడిని దురదృష్టం వెంటాడింది. లాంగాన్ బౌండరీ వద్ద బౌల్ట్ అద్భుత రీతిలో క్యాచ్ అందుకున్నాడు. కివీస్ ఊపిరిపీల్చుకోగా బ్రాత్‌వైట్ కుప్పకూలాడు. ప్రత్యర్థి ఆటగాళ్ల సాంత్వనతో తేరుకున్నాడు.

### 5 పరుగులతో ఓడిన విండీస్

**మాంచెస్టర్:** ప్రపంచకప్‌లో శనివారం జరిగిన రెండు మ్యాచ్‌లు రసవత్తరంగా ముగిశాయి. భారత్ పసికూన అఫ్గాన్‌పై గెలిచేందుకు ఆఖరి దాకా పోరాడితే... కివీస్‌ను ఓడించేందుకు విండీస్ శక్తిమేర శ్రమించింది. కానీ వెస్టిండీస్ 5 పరుగుల దూరంలో ఆలౌటైంది. బ్రాత్‌వైట్ (82 బంతుల్లో 101; 9 ఫోర్లు, 5 సిక్సర్లు) వరల్డ్‌కప్‌లో చరిత్రకెక్కే సెంచరీ సాధించాడు. మ్యాచ్‌లో న్యూజిలాండ్ జట్టు గెలిచింది. పోరాటంతో బ్రాత్‌వైట్ కూడా గెలిచాడు. ఉత్కంఠభరిత మలుపులతో సాగిన ఈ మ్యాచ్‌లో మొదట కివీస్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 291 పరుగులు చేసింది. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన వెస్టిండీస్‌ను ఓపెనర్ గేల్ (84 బంతుల్లో 87; 8 ఫోర్లు, 6 సిక్స్‌లు), మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ హెట్‌మైర్ (45 బంతుల్లో 54; 8 ఫోర్లు, 1 సిక్స్) నడిపించారు. కానీ కీలకమైన సమయంలో ఫెర్గుసన్ (3/59), బౌల్ట్ (4/30) విండీస్ ఇన్నింగ్స్‌ను దెబ్బమీద దెబ్బతీశారు. 164 పరుగులకే 7 వికెట్లను కోల్పోయిన కరీబియన్ జట్టు పరాజయానికి దగ్గరైంది. ఈ దశలో బ్రాత్‌వైట్, కీమర్ రోచ్ (31 బంతుల్లో 14; 1 సిక్స్)తో కలిసి ఎనిమిదో వికెట్‌కు 47 పరుగులు, కాట్రెల్‌కు జతగా తొమ్మిదో వికెట్‌కు 34 పరుగులు జోడించాడు. ఆఖరికి ఖాతా తెరవని థామస్ (0 నాటౌట్)ను కూడా కాచుకొని పదో వికెట్‌కు 41 పరుగులు జోడించాడు. 18 బంతుల్లో 33 పరుగులు అవసరమైన దశలో 48వ ఓవర్ వేసిన హెన్రీ బౌలింగ్‌లో బ్రాత్‌వైట్ జూలు విదిల్చాడు. 2, 6, 6, 6, 4, 1తో 25 పరుగులు పిండుకున్నాడు. ఇక 12 బంతుల్లో 8 పరుగులే కావాలి. నీషమ్ ఓవర్లో సింగిల్స్ తీయకుండా డాట్‌బాల్ ఆడిన బ్రాత్‌వైట్ నాలుగో బంతికి 2 పరుగులు తీసి 80 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆఖరి బంతిని సిక్సర్‌గా మలిచేందుకు యత్నించి బౌల్ట్ క్యాచ్ పట్టడంతో ఔటయ్యాడు. గెలుపుతీరం దాకా తీసుకొచ్చి ఔటైన బ్రాత్‌వైట్ పిచ్‌పైనే కూలబడ్డాడు. కివీస్ ఆటగాళ్లు టేలర్, విలియమ్సన్ సహా ప్రత్యర్థులంతా ఓదార్చారు. బరువెక్కిన హృదయంతో బ్రాత్‌వైట్ మైదానం వీడాడు.

## చాంపియన్ భారత్



**మహిళల హాకీ సిరీస్ ఫైనల్స్**

**హిరోషిమా:** మహిళల హాకీ సిరీస్ ఫైనల్స్ టోర్నీ చాంపియన్‌గా భారత్ అవతరించింది. ఇప్పటికే ఫైనల్స్ చేరడం ద్వారా ఒలింపిక్స్ క్వాలిఫయర్స్‌కు అర్హత సాధించిన భారత్ హిరోషిమాలో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 3–1 గోల్స్ తేడాతో ఆతిథ్య జపాన్‌పై విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. నువ్వా నేనా అన్నట్లు సాగిన తుది పోరులో అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్న భారత్ జపాన్‌ను మట్టికరిపించింది. భారత్ తరపున మరోసారి రాణించిన గుర్జిత్ కౌర్ రెండు గోల్స్(45వ, 60వ నిమిషంలో) సాధించి విజయంలో కీలకపాత్ర పోషించింది. రాణి రాంపాల్(3వ నిమిషంలో) మరో గోల్ నమోదు చేసింది. జపాన్ తరపున నమోదైన ఏకైక గోల్‌ను మోరి కనోన్(11వ నిమిషంలో) సాధించింది. మ్యాచ్ మొత్తంలో భారత్ 26 సార్లు జపాన్ రక్షణ వలయంలోకి ప్రవేశించగా, జపాన్ కేవలం 13 సార్లు మాత్రమే భారత్ రక్షణ వలయంలోకి ప్రవేశించింది. మ్యాచ్‌లో భారత్‌కు 8 పెనాల్టీ కార్నర్స్ లభించగా జపాన్‌కు కేవలం 2 మాత్రమే లభించాయి. భారత్ సాధించిన మూడు గోల్స్ కూడా పెనాల్టీ కార్నర్‌ల రూపంలో రావడం విశేషం. టోర్నీలో అపజయం ఎరుగని భారత్ మొత్తం 27 గోల్స్ చేయగా కేవలం 4 గోల్స్‌ను మాత్రమే ప్రత్యర్థులకు సమర్పించుకుంది. భారత కెప్టెన్ రాణి రాంపాల్ బెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలవగా, గుర్జీత్ కౌర్ టోర్నీ టాప్ స్కోరర్‌గా నిలిచింది. అంతకుముందు 3వ స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో చిలీ 3–1తో పెనాల్టీ షూటౌట్‌లో విజయం సాధించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు 3–3 గోల్స్‌తో సమంగా ఉండటంతో షూటౌట్‌లో విజేతను నిర్ణయించారు.

## గాయత్రి డబుల్ ధమాకా

**ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్**

**హైదరాబాద్:** అనంత్ బజాజ్ స్మారక ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ తనయ పుల్లెల గాయత్రి సత్తా చాటింది. పీజీబీఏలో జరిగిన ఈ టోర్నీలో మహిళల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో విజేతగా నిలిచి రెండు టైటిళ్లను హస్తగతం చేసుకుంది. ఆదివారం మహిళల సింగిల్స్ ఫైనల్లో గాయత్రి (తెలంగాణ) 21–19, 21–16తో తన్వి లాడ్‌పై కేవలం 37 నిమిషాల్లోనే గెలుపొంది కెరీర్‌లో తొలి సీనియర్ ర్యాంకింగ్ టైటిల్‌ను అందుకుంది. డబుల్స్ టైటిల్‌పోరులో గాయత్రి –రుతుపర్ణ (ఒడిశా) ద్వయం 19–21, 21–14, 21–10తో నాలుగో సీడ్ శిఖా గౌతమ్ (ఎయిరిండియా)–అశ్విని భట్ (కర్ణాటక) జోడీకి షాకిచ్చి చాంపియన్‌గా నిలిచింది. పురుషుల సింగిల్స్ తుదిపోరులో చిట్టబోయిన రాహుల్ యాదవ్ (తెలంగాణ) 25–23, 14–21, 13–21తో లక్ష్యసేన్ (ఉత్తరాఖండ్) చేతిలో ఓడిపోయి రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు. పురుషుల డబుల్స్‌లో టాప్ సీడ్ కృష్ణ ప్రసాద్ గారగ (ఆంధ్రప్రదేశ్)–ధ్రువ్ కపిల(ఎయిరిండియా) ద్వయం 23–21, 21–17తో ఏడో సీడ్ శ్రీకృష్ణ సాయికుమార్ (తెలంగాణ)–గౌస్ షేక్ (ఆంధ్రప్రదేశ్) జంటపై, మిక్స్‌డ్ డబుల్స్‌లో గౌస్ షేక్ (ఆంధ్రప్రదేశ్)–మయూరి యాదవ్ (ఉత్తరప్రదేశ్) జంట 21–19, 13–21, 21–12తో కృష్ణ ప్రసాద్–అశ్విని భట్ (కర్ణాటక) జోడీపై నెగ్గి విజేతలుగా నిలిచాయి.




గాయత్రికి ట్రోఫీ అందజేస్తున్న శేఖర్ బజాజ్. చిత్రంలో గోపీచంద్, శ్రీకాంత్

### మేం మునిగాం.. బంగ్లానూ ముంచుతాం

**అఫ్గానిస్తాన్ కెప్టెన్ గుల్బదీన్ నైబ్**

**సౌతాంప్టన్:** బంగ్లాదేశ్‌తో నేడు జరుగనున్న మ్యాచ్ గురించి అఫ్గానిస్తాన్ కెప్టెన్ గుల్బదీన్ నైబ్ ఆసక్తికర వ్యాఖ్య చేశాడు. ప్రపంచ కప్‌లో ఆడిన ఆరు మ్యాచ్‌లూ ఓడిన అఫ్గాన్ సెమీఫైనల్ రేసు నుంచి ఔటయింది. బంగ్లా మాత్రం ఐదు పాయింట్లతో నాకౌట్ బెర్తుకు పోరాడుతోంది. ఈ నేపథ్యంలో నైబ్ మాట్లాడుతూ... తామిప్పటికే మునిగిపోయామని, సోమవారం బంగ్లాను ఓడించి వారినీ ముంచేస్తామని నవ్వుతూ అన్నాడు. భారత్‌తో మ్యాచ్‌లోలాగే పిచ్ స్పిన్‌కు సహకరిస్తే బంగ్లాదేశ్‌ను ఓడించడం తమకు కష్టమేం కాదని నైబ్ పేర్కొన్నాడు.



### హాలె ఓపెన్ విజేత ఫెడరర్

**హాలె(జర్మనీ):** గ్రాస్ కోర్టు వీరుడి ఒడిలో మరో టైటిల్ చేరింది. ఆదివారం జరిగిన ఏటీపీ హాలె ఓపెన్ టెన్నిస్ ఫైనల్లో స్విస్ టెన్నిస్ దిగ్గజం ఫెడరర్ 7–6 (7/2), 6–1 తేడాతో డేవిడ్ గాఫిన్(బెల్జియం)పై విజయం సాధించి టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. గత సంవత్సరం ఇదే టోర్నీ ఫైనల్లో ఓడిన ఫెడరర్ ఈ సారి ఫలితాన్ని మార్చాడు. హాలె టైటిల్‌ను గెలవడం ద్వారా తన కెరీర్‌లో ఒకే టైటిల్‌ను అత్యధిక సార్లు (10) గెలిచినట్లైంది. ఈ టైటిల్‌తో ఫెడరర్ సాధించిన టైటిళ్ల సంఖ్య 102కు చేరింది.

## యాష్లే బార్టీ @1



**బర్మింగ్‌హామ్:** ఈ నెలలో ఫ్రెంచ్ ఓపెన్ గెలిచి సంచలనం సృష్టించిన ఆస్ట్రేలియన్ టెన్నిస్ క్రీడాకారిణి యాష్లే బార్టీ డబ్ల్యూటీఏ తాజా ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని కైవసం చేసుకోనుంది. ఆదివారం బర్మింగ్‌హామ్ క్లాసిక్‌ను గెలుచుకోవడం ద్వారా మహిళల టెన్నిస్ ర్యాంకింగ్‌లో మొదటి స్థానంలో ఉన్న నయోమి ఒసాకాను వెనక్కి నెట్టి అగ్రస్థానాన్ని చేరనుంది. ఫైనల్లో 6–3, 7–5తో జూలియా జార్జ్‌పై విజయం సాధించింది. దీంతో మహిళల టెన్నిస్‌లో ప్రపంచ నం.1 ర్యాంక్‌ను అందుకున్న రెండో ఆస్ట్రేలియా క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. గతంలో వోనె గూలగాన్ కాలె (1976లో) ఆస్ట్రేలియా తరపున మహిళల ర్యాంకింగ్స్‌లో టాప్‌లో నిలిచింది.




## హామిల్టన్ విజయాల జైత్రయాత్ర

**ఫ్రాన్స్ గ్రాండ్ ప్రి సొంతం**

**ఫ్రాన్స్:** 2019 ఫార్ములా వన్ సీజన్‌లో లూయిస్ హామిల్టన్ విజయాల జైత్రయాత్ర కొనసాగుతోంది. ఆదివారం జరిగిన 53 ల్యాప్‌ల ఫ్రాన్స్ గ్రాండ్ ప్రి రేసును ఈ మెర్సిడెస్ డ్రైవర్ అందరికంటే ముందుగా గంటా 24 నిమిషాల 31.198 సెకన్లలో ముగించాడు. అతని సహచరుడు బొటాస్ గంటా 24 నిమిషాల 49.254 సెకన్లలో రేసును పూర్తి చేసి రెండో స్థానంలో నిలిచాడు. ఫెరారీకి చెందిన చార్లెస్ లెక్‌లెరిక్ మూడో, రెడ్‌బుల్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ నాలుగో స్థానంలో నిలిచారు. ఫెరారీ మరో డ్రైవర్ సెబాస్టియన్ వెటెల్ ఐదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. పోల్ పొజిషన్ నుంచి రేసును ఆరంభించిన హామిల్టన్ ఎక్కడా తడబాటుకు గురికాలేదు. ల్యాప్ తర్వాత ల్యాప్‌ను వేగవంతంగా ముగిస్తూ రెండో స్థానంలో ఉన్న బొటాస్‌కు చిక్కకుండా దూసుకెళ్లాడు. రేసులో ఫాస్టెస్ట్ ల్యాప్‌ను నమోదు చేసిన వెటెల్‌కు అదనంగా మరో పాయింట్ లభించింది. ఈ సీజన్‌లో ఇప్పటికి 8 రేసులు పూర్తవగా అందులో 6 గెలిచిన హామిల్టన్ డ్రైవర్స్ చాంపియన్‌షిప్‌లో 187 పాయింట్లతో మొదటి స్థానంలో ఉన్నాడు. బొటాస్ 151 పాయింట్లతో, వెటెల్ 111 పాయింట్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
24-6-2019

## స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 407 ▼ | 108 ▼ |
| 39,194 | 11,724 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు**

| సూచీ | ముగింపు | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 8,032 | ▼ 19 |
| డోజోన్స్ | 26,719 | ▼ 34 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,408 | ▼ 17 |
| డాక్స్ | 12,340 | ▼ 15 |
| షాంఘై | 3,002 | ▲ 15 |
| నికాయ్ | 21,259 | ▼ 204 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | కరెన్సీ | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 69.00 | 70.64 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 87.18 | 90.31 |
| € | యూరో | ఎస్‌బీఐ | 77.45 | 80.35 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 63.97 | 66.42 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.33 | 49.52 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 50.64 | 52.42 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 17.82 | 19.53 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.25 | 19.76 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.50 | 10.85 |

- మొబైల్ యాప్స్ నుంచే ఇన్వెస్ట్‌మెంట్
- స్టాక్స్, ఫండ్స్, ఇన్సూరెన్స్, ఎన్‌పీఎస్...
- ఎన్నో సేవలను ఆఫర్ చేస్తున్న సంస్థలు
- వీటిని ఎంచుకునే ముందు స్వీయ పరిశీలన తప్పనిసరి
- పారదర్శకత, పాటించే ప్రమాణాలను పరిశీలించాలి
- ప్రాథమిక అవగాహన లేని వారు జాగ్రత్తలు తీసుకోవాలి

# మార్కెట్ పెట్టుబడులు.. యాప్స్‌తో ఈజీ

ఆన్‌లైన్ షాపింగ్ ఎంత సులభమో... ఇన్వెస్ట్ చేయడాన్ని కూడా అంత సులభతరం చేస్తున్నాయి కొన్ని మొబైల్ అప్లికేషన్లు (యాప్స్). ఎన్నో స్టార్టప్ సంస్థలు ఇలా వివిధ లక్ష్యాలకు సంబంధించిన యాప్స్‌తో యూజర్ల ముందుకు వచ్చేస్తున్నాయి. ఏ మ్యూచువల్ ఫండ్‌ను ఎంచుకోవాలి..? ఈక్విటీలో ఎంత ఇన్వెస్ట్ చేయాలి? డెట్ ఫండ్స్‌కు ఎంత కేటాయించాలి..? అన్నది తెలియకపోతే ఆందోళన చెందక్కర్లేదు. ఇటువంటి యాప్స్‌తో సులభంగానే ఆ పని చేసేసుకోవచ్చు. కేవలం మొబైల్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని, ఓపెన్ చేయడం, తర్వాత కొన్ని క్లిక్‌లతో ఒకటి రెండు నిమిషాల్లోపే పని పూర్తవుతుంది.

ఉదాహరణకు ఓ ఇంటి కొనుగోలుకు అవసరమైన మొత్తాన్ని సమకూర్చుకోవాలనుకుంటున్నారు. ఇందుకోసం ఇన్వెస్ట్ చేయాలనుకుంటే యాప్‌ను ఓపెన్ చేసి ఎంత కాల వ్యవధి, ఎంత మొత్తం అవసరం అన్న వివరాలను అక్కడ నమోదు చేస్తే చాలు. అలాగే, ఇన్వెస్టర్ రిస్క్ సామర్థ్యాన్ని పరీక్షించే ప్రశ్నలను యాప్ సంధిస్తుంది. వాటికి సమాధానం ఇచ్చేస్తే... ప్రతీ నెలా ఎంత మొత్తం ఇన్వెస్ట్ చేయాలి, అలాగే మీ లక్ష్యాలకు సరిపోలే ఈక్విటీ, డెట్ ఫండ్స్ వివరాలను యాప్ సూచిస్తుంది. ప్రతి పథకంలో ఎంత చొప్పున ఇన్వెస్ట్ చేయాలన్న సమాచారం కూడా ఇస్తుంది. ఎంపిక చేసుకుని, నెలలో సౌకర్యమైన తేదీ ఇచ్చేస్తే, ప్రతి నెలా ఆ తేదీన సిప్ రూపంలో పెట్టుబడులు పెట్టే విధంగా ప్రణాళిక సిద్ధమైనట్టే. అయితే వీటిల్లో కొన్ని లోపాలు కూడా ఉన్నాయంటున్నారు నిపుణులు. ''ఇవి పరిమిత ఉత్పత్తులనే ఆఫర్ చేస్తాయి. ఒకవేళ మీరు రిటైర్మెంట్‌ను లక్ష్యంగా ఎంచుకుంటే సంబంధిత వ్యక్తులు అప్పటికే ఈపీఎఫ్, పీపీఎఫ్ పథకాల్లో చేసే పెట్టుబడులను పరిగణనలోకి తీసుకోకుండా, ప్రణాళికను డిజైన్ చేసి చూపిస్తాయి. రిటైర్మెంట్ ప్రణాళికల్లో ఈపీఎఫ్, పీపీఎఫ్ అన్నవి చాలా ముఖ్యమైనవి'' అని ఫిన్‌సేఫ్ ఇండియా వ్యవస్థాపక డైరెక్టర్ మ్రిన్ అగర్వాల్ వివరించారు.






## అన్నీ గోల్ ఆధారితమైనవి కావు...



మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసే విషయమై ఇన్వెస్టర్లకు సాయపడే యాప్స్ డజనకు పైనే ఉన్నాయి. వీటిల్లో పేటీఎం మనీ, మొబిక్విక్, జెరోదా కాయిన్, గ్రోవ్ తదితర యాప్స్ ప్రముఖమైనవి. ఈ యాప్స్ డిఫాల్ట్‌గా కొన్ని ఫండ్స్‌ను షార్ట్ లిస్ట్ చేసి బెస్ట్ ఈక్విటీ ఫండ్స్ లేదా డెట్ ఫండ్స్ అంటూ ఆ సమాచారం కనిపించేలా ఉంచుతాయి. వీటిని ఎంచుకునే వారు తమ వంతుగా అధ్యయనం చేసుకోవాలన్నది సలహా. ''లావాదేవీలను సులభతరం చేయడం, నిర్వహించడంపైనే మా దృష్టంతా. యూజర్ సిప్‌ను ఆరంభించేందుకు, తిరిగి దాన్ని సవరించుకునేందుకు ఎటువంటి పేపర్ పని అవసరం ఉండదు. ఇన్వెస్టర్ ఇన్‌స్టంట్‌గా ఈ పని చేసుకోవచ్చు'' అని అన్నారు గ్రోవ్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో హర్ష్ జైన్. ఫిస్‌డమ్, కువెరా, ఒరోవెల్త్, గోల్‌వైజ్, స్క్రిప్‌బాక్స్ అనే సంస్థలు లక్ష్యం ఆధారిత ఫండ్స్‌ను సిఫారసు చేయడంతోపాటు, అస్సెట్ అలోకేషన్ సేవలను అందిస్తున్నాయి. ఇన్వెస్టర్ల భిన్న అవసరాలకు అనువైన సాధనాలను కూడా అందుబాటులో ఉంచుతున్నాయి. ఉదాహరణకు ఫిస్‌డమ్ సంస్థ టర్మ్ ఇన్సూరెన్స్, నేషనల్ పెన్షన్ స్కీమ్, డిజిటల్ గోల్డ్ వంటి సేవలను ఆఫర్ చేస్తోంది. ఒరోవెల్త్ అయితే, ఫైనాన్షియల్ ప్లానర్‌తో మాట్లాడే అవకాశాన్ని కూడా కల్పిస్తోంది. కాకపోతే ఇందుకు కొంత చార్జ్ చెల్లించుకోవాలి. గోల్‌వైజ్‌లో అయితే ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్‌తో ఉచితంగానే సంప్రదింపులు చేసుకోవచ్చు. కొన్ని సంస్థలు కుటుంబ సభ్యులు అందరికీ కలిపి ఒకటే ఖాతాను అందిస్తున్నాయి. అంటే కుటుంబ సభ్యులందరి పెట్టుబడులను ఒకే ఖాతాతో నిర్వహించుకోవచ్చు.

## ఆరంభానికి మంచిది...



ఆర్థిక ప్రణాళిక అన్నది చాలా విస్తృతమైనది. ఆర్థిక సలహాదారులు అయితే ఓ ప్రణాళికను రూపొందించడంతోపాటు ఏటా దాన్ని సమీక్షించి ఇన్వెస్టర్ల అవసరాలు, పరిస్థితులకు అనుగుణంగా సవరిస్తుంటారు. అయితే, చాలా మంది ఇన్వెస్టర్ల రిస్క్ ప్రొఫైల్ అన్నది వారి పెట్టుబడుల్లో వచ్చిన లాభాలు, నష్టాల ఆధారంగా మారుతుంటుంది. కనుక సలహాదారులు రిస్క్‌ను తట్టుకునే పోర్ట్‌ఫోలియోను సూచిస్తుంటారు. మ్యూచువల్ ఫండ్స్, ఇతర సాధనాలతో కూడిన పోర్ట్‌ఫోలియోను డిజైన్ చేయాల్సి ఉంటుంది. అప్పుడే ఇన్వెస్టర్ల పెట్టుబడులకు రక్షణ ఉంటుంది. కానీ, పైన చెప్పుకున్న మొబైల్ యాప్స్ ఇన్వెస్టర్ల పెట్టుబడుల సమీక్ష, రక్షణ బాధ్యతలకు దూరమేనంటున్నారు నిపుణులు. ఫైనాన్షియల్ అడ్వైజర్లు తగిన సూచనలు చేసినందుకు గాను ఏటా రూ.15,000 నుంచి రూ.40,000 వరకు చార్జ్ చేస్తుంటారు. మొబైల్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్స్‌ను ఎక్కువగా వినియోగించే వారిలో అధిక శాతం మిలీనియల్స్ (1981–96 మధ్య జన్మించిన వారు) కావడం గమనించాలి. వీరిలోనూ ఎక్కువ మంది మొదటిసారి ఇన్వెస్టర్లే. ''30 ఏళ్లలోపు వారిలో ఎక్కువ మంది స్వల్పకాల అవసరాల కోసం పొదుపు చేయడానికి కూడా ఇబ్బందులు పడుతుంటారు. అటువంటి వారికి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు పొదుపు విషయంలో సాయపడుతున్నాయి'' అని వైజ్‌లీ సీఈవో విజయ్‌బొబ్బ పేర్కొన్నారు. ఈ సంస్థ యువతను గుర్తించి వారికి స్వల్పకాల అవసరాల (300 రోజుల్లోపు) కోసం పొదుపు చేయడాన్ని ప్రోత్సహిస్తోంది. మొదటిసారి ఇన్వెస్ట్ చేసే వారికి నిజంగానే ఆన్‌లైన్ ఓ మార్గసూచిగా ఉపయోగపడుతున్నాయనడంలో సందేహం లేదు. టెక్నాలజీ ఆధారంగా పనిచేసే ఈ యాప్స్‌లో సేవలపై చార్జీలు చాలా తక్కువ. పోటీ కారణంగా చాలా సంస్థలు ఇప్పటికైతే ప్రాథమిక సేవలను ఉచితంగానే ఆఫర్ చేస్తున్నాయి. చాలా సంస్థలు డైరెక్ట్ మ్యూచువల్ ఫండ్ ప్లాన్లనే అందిస్తున్నాయి. ''వయసు, బాధ్యతలు, ఆదాయం, అవసరాలన్నవి వ్యక్తులను బట్టి మారిపోతుంటాయి. 30 ఏళ్ల పైన వయసు ఉన్న వారిలో ఎక్కువ మందికి సాధారణంగా కుటుంబం ఉంటుంది. వీరికి మరింత సమగ్రమైన ప్రణాళిక అవసరం అవుతుంది. వీరికి పోర్ట్‌ఫోలియో నిర్మాణం అన్నది క్లిష్టమైనది కూడా. ఈ తరహా అవసరాలున్న వారికి ఫోన్ ద్వారా సలహా సేవలను అందిస్తున్నాం. వారి అవసరాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని సూచనలు చేస్తాం'' అన్నారు. గోల్‌వైజ్ డాట్ కామ్ సహ వ్యవస్థాపకుడు అంకుర్‌చౌదరి.

### ఫండ్స్ సిఫారసుల పట్ల జాగ్రత్త!

దాదాపు అన్ని ఇన్వెస్టింగ్ యాప్స్ భిన్న అంశాల ఆధారంగా ఫండ్స్‌ను విశ్లేషించే అల్గోరిథమ్స్ (సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్)ను వినియోగిస్తున్నాయి. మరి ఈ అంశాల్లో కొంత తేడా ఉన్నా ఫలితం పూర్తి భిన్నంగానూ రావచ్చు. ఉదాహరణకు ఓ ప్లాట్‌ఫామ్, మ్యూచువల్ ఫండ్స్ పథకాల పనితీరు విశ్లేషణకు ఐదేళ్ల పనితీరును పరిగణనలోకి తీసుకుంటే, మరో ప్లాట్‌ఫామ్ మూడేళ్ల పనితీరునే పరిగణించొచ్చు. ఇలాంటప్పుడు ఫలితం కూడా మారిపోతుంది. మొబైల్ ఇన్వెస్టింగ్ యాప్స్ విషయంలో ఇదే జరుగుతుంటుంది. ఓ వ్యక్తి రిస్క్ ప్రొఫైల్, లక్ష్యం, కాల వ్యవధికి రెండు ప్లాట్‌ఫామ్‌లు భిన్నమైన పథకాలు, అస్సెట్ అలోకేషన్‌ను సిఫారసు చేయవచ్చు. అందుకని, ఫండ్స్ ఎంపికకు పరిగణనలోకి తీసుకున్న అంశాల వివరాలను వెబ్‌సైట్‌లో ఇన్వెస్టర్లకు తెలియజేసేలా అందుబాటులో ఉంచడం వంటి పారదర్శకత పాటించే యాప్స్‌ను ఆశ్రయించడం మంచిదన్న సూచన నిపుణుల నుంచి వస్తోంది. అలాగే, కొన్ని ఇన్వెస్టింగ్ ప్లాట్‌ఫామ్‌లు సిఫారసుల విషయంలో కనీస సూత్రాలను కూడా పాటించకపోవచ్చు. ఉదాహరణకు రెండేళ్ల తర్వాత వెకేషన్ లక్ష్యం కోసం గిల్ట్‌ఫండ్‌లో నూరు శాతం ఇన్వెస్ట్ చేసుకోవాలని సూచించొచ్చు. కానీ, గిల్ట్ ఫండ్స్ చాలా అస్థిరతలతో కొనసాగుతుంటాయి. సాధారణంగా వీటిల్లో పెట్టుబడులకు ఆర్థిక సలహాదారులు సిఫారసు చేయరు. ఇలా ఆయా ఇన్వెస్టింగ్ యాప్స్‌ను బట్టి సిఫారసులు భిన్నంగా ఉండొచ్చు. అందుకని మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులకు సంబంధించి ప్రాథమిక విషయ సమాచారాన్ని తెలుసుకోవడం అవసరమంటున్నారు నిపుణులు. లేదంటే వీటిని నమ్ముకోకుండా బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసుకోవాలని సూచిస్తున్నారు.

### ఇన్వెస్టింగ్ ప్లాట్‌ఫామ్‌లు

| ప్లాట్‌ఫామ్ | కాగిత రహిత | కేవైసీయాప్ ద్వారా ఆఫర్ చేసే సాధనాలు | డైరెక్ట్ ప్లాన్లేనా? | చార్జీలు | ఫీజులపై సలహా సేవలు |
|---|---|---|---|---|---|
| ఫిస్‌డమ్ | ఉంది | మ్యూచువల్ ఫండ్స్, టర్మ్ ఇన్సూరెన్స్, ఎన్‌పీఎస్, డిజిటల్ గోల్డ్ | కాదు | ఉచితం | లేవు |
| కువేరా | లేదు | మ్యూచువల్ ఫండ్స్, టర్మ్‌ఇన్సూరెన్స్ | అవును | ఉచితం | లేవు |
| ఓరోవెల్త్ | ఉంది | మ్యూచువల్ ఫండ్స్, స్టాక్స్ | అవును | ఉచితం | ఉన్నాయి |
| గోల్‌వైజ్ | ఉంది | మ్యూచువల్ ఫండ్స్ | అవును | ఉచితం | ఉన్నాయి |
| స్క్రిప్‌బాక్స్ | ఉంది | మ్యూచువుల్ ఫండ్స్ | కాదు | ఉచితం | లేవు |

# ట్రావెల్ ఇన్సూరెన్స్‌తో ఎన్నో ప్రయోజనాలు



సంజయ్ దత్తా
క్లెయిమ్స్, అండర్‌రైటింగ్ చీఫ్
ఐసీఐసీఐ లాంబార్డ్
జనరల్ ఇన్సూరెన్స్

**పర్యాటకులు సెలవుల్లో ఏప ప్రాంతాలు చుట్టి రావాలన్న ప్రణాళికకే ఎంతో సమయం, కష్టాన్ని వెచ్చిస్తుంటారు. అయితే, ఎక్కువ మంది ట్రావెల్ ఇన్సూరెన్స్‌ను మాత్రం పట్టించుకోరు. ప్రయాణ సమయాల్లో ప్రమాదాలు, అనారోగ్యం పాలయ్యే రిస్క్ ఉంటుంది. ఊహించని, దురదృష్టకర ఘటనలు జరగకుండా తప్పించుకునే మార్గం లేదు. పర్యాటక బీమా అన్నది ఈ తరహా ప్రమాదాలు జరగకుండా నిరోధించలేదు. కానీ, ఈ తరహా సందర్భాల్లో ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.**

ట్రావెల్ ఇన్సూరెన్స్ పర్యాటకులకు ఎన్నో ప్రయోజనాలను అందిస్తుంది. ప్రమాదాలు లేదా ప్రయాణ సమయాల్లో అనారోగ్యం పాలైతే, ఎదురయ్యే వైద్య ఖర్చులను ఈ బీమా భరిస్తుంది. కొన్ని దేశాల్లో వైద్య చికిత్సల వ్యయాలు భారీగా ఉంటాయని తెలుసుకోవాలి. దీంతో తీవ్రమైన గాయాల పాలయితే పర్యాటకులు వేలాది డాలర్లను వైద్య బిల్లుల రూపంలో చెల్లించుకోవాల్సి వస్తుంది. అదే పర్యాటక ఇన్సూరెన్స్ ఉంటే తమ వైద్యం కోసం చేసిన ఖర్చులను రీయింబర్స్‌మెంట్ రూపంలో తిరిగి పొందొచ్చు. పైగా వైద్య పరంగా అత్యవసర తరలింపునకు అయ్యే ఖర్చులను కూడా పాలసీదారులు చెల్లించాల్సిన అవసరం ఉండదు. మరో ముఖ్యమైన ప్రయోజనం... ట్రిప్‌ను రద్దు చేసుకుంటే, లేదా అవాంతరాలు ఎదురైనా కవరేజీ లభిస్తుంది. పర్యటనకు ముందుకానీ, పర్యటన సమయంలో కానీ ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే, పర్యాటకులు తమ పర్యటనలను కుదించుకోవడం లేదా రద్దు చేసుకోవాల్సి వస్తుంది. దీనివల్ల భారీ మొత్తంలో నష్టపోతుంటారు. ట్రావెల్ ఇన్సూరెన్స్ ఉంటే ఈ తరహా పర్యటనల రద్దు, కుదింపు సమయాల్లో ఎదురయ్యే నష్టాలకు పరిహారాన్ని చెల్లిస్తుంది. ఈ పాలసీ ఉండడం వల్ల బ్యాగేజీ లేదా వ్యక్తిగత వస్తువులు కోల్పోయినా, పరిహారం పొందొచ్చు. ట్రావెల్ ఇన్సూరెన్స్ కింద కవరేజీ లభించే వాటిల్లో వ్యక్తిగత బాధ్యత, పర్యటన ఆలస్యం, ప్రమాద మరణం, భౌతిక కాయాన్ని తరలించడం, దంత వైద్య వ్యయాలకూ కవరేజీ ఉంటుంది. కేవలం పర్యటనల సమయాల్లో కవరేజీకే పరిమితం కాకుండా, ఊహించని ఘటనలు ఎదురైతే ఎలా ఎదుర్కోవాలి, ముఖ్యమైన సౌకర్యాలు ఇతర సమాచారాన్ని పాలసీదారులు రోజులో 24 గంటల పాటు పొందే అవకాశం కూడా ఉంది. ప్రయాణ సమయంలో డాక్యుమెంట్లు పోయినా పాలసీ ఆదుకుంటుంది. కుటుంబ సభ్యులతో కలసి చేసే పర్యటనలు ఎంతో ఆనందాన్నిస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు. అయితే, బయటకు వెళ్లినప్పుడు ముప్పు లేదా ప్రమాదాలు ఎదురుకాకుండా బయటపడే ఎటువంటి మార్గం ఉండదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఎవరైనా కానీ ఏదైనా ట్రిప్‌కు వెళ్లి రావాలనుకుంటే, అది స్నేహితులు లేదా కుటుంబ సభ్యులతో అయినా కానీ, ముందుగా ట్రావెల్ ఇన్సూరెన్స్‌కు కూడా ప్లాన్ చేసుకోవాలి.



## ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఫార్మా ఫండ్

ఆదిత్య బిర్లా సన్ లైఫ్ మ్యూచువల్ ఫండ్ తాజాగా ఫార్మా అండ్ హెల్త్‌కేర్ ఫండ్ ప్రారంభించింది. ఈ ఓపెన్ ఎండెడ్ న్యూ ఫండ్ ఆఫర్ జూలై 4తో ముగుస్తుంది. ప్రధానంగా దేశీ ఫార్మా, హాస్పిటల్స్, డయాగ్నస్టిక్స్, స్పెషాలిటీ కెమికల్స్, కాంట్రాక్ట్ రీసెర్చ్, తయారీ సేవలందించే సంస్థల్లో ఇది ఇన్వెస్ట్ చేస్తుంది. కనీస పెట్టుబడి మొత్తం రూ. 1,000. ధరలు, నియంత్రణసంస్థల నిబంధనలపరమైన ఒత్తిళ్లన్నీ అధిగమించిన నేపథ్యంలో రాబోయే రోజుల్లో ఫార్మా విభాగం మెరుగైన రాబడులు అందించగలవని ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఏఎంసీ సీఈవో ఎ. బాలసుబ్రమణ్యన్ తెలిపారు.

# మిడ్‌క్యాప్‌లో లాభాల కోసం...

### డీఎస్‌పీ మిడ్‌క్యాప్ ఫండ్

బాగా చౌక విలువల వద్ద అందుబాటులో ఉన్న మిడ్‌క్యాప్ స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా అధిక రాబడులు ఆశించాలనుకునే ఇన్వెస్టర్ల ముందున్న ఎంపికల్లో డీఎస్‌పీ మిడ్‌క్యాప్ ఫండ్ ఒకటి. మోస్తరు రిస్క్ తీసుకునే వారికి ఈ పథకం అనుకూలంగా ఉంటుంది.

**రాబడులు**

ఈ పథకం దీర్ఘకాలంలో నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీకి మించి రాబడులను ఇచ్చింది. ఏడాది కాలంలో నిఫ్టీ మిడ్‌క్యాప్ 100లో నికర నష్టాలు 6.3 శాతంగా ఉంటే, ఈ పథకం నష్టాలను 4.9 శాతానికే పరిమితం చేసింది. మూడేళ్ల కాలంలో డీఎస్‌పీ మిడ్‌క్యాప్ పథకం వార్షికంగా 13.6 శాతం, ఐదేళ్లలో 16.4 శాతం చొప్పున రాబడులను ఇచ్చింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 రాబడులు ఇవే కాలాల్లో 11.8 శాతం, 13.1 శాతంగానే ఉన్నాయి. దీర్ఘకాలంలో నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ కంటే ఈ పథకం 4 శాతం మేర అదనపు రాబడులను ఇచ్చినట్టు పనితీరు చూస్తే తెలుస్తోంది. మిడ్‌క్యాప్ విభాగంలో ఈ పథకం అగ్రస్థాయి జాబితాలో ఉంది. కనీసం 7–10 ఏళ్ల పాటు ఇన్వెస్ట్ చేసే వారు, సిప్ మార్గంలో పెట్టుబడులు పెట్టాలనుకునే వారు ఈ పథకాన్ని పరిశీలించొచ్చు.




**పోర్ట్‌ఫోలియో, విధానం**

ఫండ్ రివ్యూ

డైవర్సిఫైడ్ పోర్ట్‌ఫోలియో, ఒకే స్టాక్‌కు భారీగా పెట్టుబడులు కేటాయించకపోవడం తదితర విధానాలను ఈ పథకం అనుసరిస్తోంది. పైగా అస్థిరతలు పెరిగిపోయిన సమయాల్లో నగదు, డెట్‌కు పెట్టుబడులు పెంచుకోవడం ద్వారా రిస్క్ తగ్గించే ప్రయత్నం చేస్తుంటుంది. వీటికి తోడు భారీగా విలువ దాగి ఉన్న స్టాక్స్‌లో పెట్టుబడుల వల్ల అధిక రాబడులను ఇవ్వగలిగిందని చెప్పుకోవచ్చు. ఈ పథకం సాధారణంగా 50 నుంచి 65 స్టాక్స్‌ను పోర్ట్‌ఫోలియోలో కలిగి ఉంటుంది. విడిగా ఒక కంపెనీలో పెట్టుబడులను 5 శాతాన్ని మించనీయదు. ఈక్విటీ మార్కెట్ అస్థిరతల సమయాల్లో నగదు, డెట్ విభాగాల్లో పెట్టుబడులను 8–10 శాతానికి పెంచుకుంటుంది. అలాగే, ఆటుపోట్ల సమయాల్లో లార్జ్‌క్యాప్ స్టాక్స్‌లో 10–15 శాతం వరకు ఇన్వెస్ట్ చేస్తుంది. అందుకే ఈ పథకం పోర్ట్‌ఫోలియోలో రిస్క్ మోస్తరుగా ఉంటుంది. మార్కెట్ పతనాల్లో భారీ నష్టాలు రాకుండా, అవి మోస్తరుగానే ఉంటాయని ఆశించొచ్చు. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ స్టాక్స్‌కు ఈ పథకం ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోంది. ఈ రంగ స్టాక్స్‌లోనే 17.58 శాతం పెట్టుబడులు పెట్టింది. ఆ తర్వాత కెమికల్స్ స్టాక్స్‌లో 15.48 శాతం, హెల్త్‌కేర్‌లో 11 శాతం, ఇంజనీరింగ్‌లో 10.41 శాతం చొప్పున ఇన్వెస్ట్ చేసింది. ఈ పథకం మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఆయా రంగాల వారీ ఎక్స్‌పోజర్‌లో మార్పులు, చేర్పులు కూడా చేస్తుంటుంది. ముఖ్యంగా బ్యాంకింగ్‌లో అధిక నాణ్యతతో కూడిన మధ్య స్థాయి బ్యాంకులు ఆర్‌బీఎల్ బ్యాంకు, సిటీ యూనియన్ బ్యాంకుల్లో ఇన్వెస్ట్ చేయడం గమనార్హం. ముఖ్యంగా గత ఏడాది కాలంలో బాగా తక్కువకు పడిపోయిన ఫార్మా, ఇండస్ట్రియల్ ప్రొడక్ట్స్‌లో ఎక్స్‌పోజర్‌ను పెంచుకుంది.

### టాప్ హోల్డింగ్స్

| కంపెనీ | పెట్టుబడుల శాతం |
|---|---|
| రామ్కో సిమెంట్స్ | 3.79 |
| ఎస్‌ఆర్‌ఎఫ్ | 3.63 |
| ఎక్సైడ్ ఇండస్ట్రీస్ | 3.39 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు | 3.20 |
| సిటీ యూనియన్ బ్యాంకు | 3.17 |
| ఇప్కా ల్యాబ్స్ | 3.01 |
| ఆర్‌బీఎల్ బ్యాంకు | 2.93 |
| సుప్రీం ఇండస్ట్రీస్ | 2.89 |
| దివిస్ ల్యాబ్స్ | 2.81 |
| సోలార్ ఇండస్ట్రీస్ | 2.79 |

### ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

రూ. కోటి వరకు డిపాజిట్లు, (జూన్-14-2019 అంకెలు శాతాల్లో)

| బ్యాంకులు | 6 నెలలు- ఏడాది | 1–2 ఏళ్లు | 3–5 ఏళ్లు |
|---|---|---|---|
| ఆంధ్రా బ్యాంక్ | 6.6 | 6.8 | 6.75 |
| యాక్సిస్ బ్యాంక్ | 7.1 | 7.3 | 7.25 |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 6.5 | 7 | 6.7 |
| బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6.25 | 6.75 | 6.5 |
| కెనరా బ్యాంక్ | 6.2 | 6.75 | 6 |
| సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6.55 | 6.65 | 6.55 |
| కార్పొరేషన్ బ్యాంక్ | 6.35 | 7 | 6.5 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | 7.1 | 7.3 | 7.25 |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 6.75 | 7.1 | 7.25 |
| ఐడీబీఐ బ్యాంక్ | 6.5 | 7.25 | 7.4 |
| ఇండస్‌ఇండ్ బ్యాంక్ | 7.25 | 7.75 | 7.5 |
| కోటక్ మహీంద్రా బ్యాంక్ | 7 | 7.2 | 7 |
| ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ | 6.5 | 6.85 | 6.75 |
| ఎస్‌బీఐ | 6.4 | 7 | 6.7 |
| సిండికేట్ బ్యాంక్ | 6.35 | 7.05 | 7.15 |
| పీఎన్‌బీ | 6.95 | 7 | 6.25 |
| యస్ బ్యాంక్ | 7.15 | 7.65 | 7.25 |

బ్యాంక్ బజార్.కామ్ అందించిన వివరాల ఆధారంగా...



ఉత్పత్తి ప్రత్యేకత ఏమిటో చెప్పలేనప్పుడు
దానిని విజయవంతంగా విక్రయించలేవు..!
- బెత్ కమ్‌స్టాక్, అమెరికా బిజినెస్ ఎగ్జిక్యూటివ్

## బొమ్మ-బొరుసు



# వరుణ దేవుడా... క్రికెట్ మ్యాచ్‌లకు అడ్డురాకు...!

**బీమా కంపెనీల ప్రార్థన ● వర్షంతో మ్యాచులు రద్దయితే రూ.100 కోట్ల భారం**



**న్యూఢిల్లీ:** ఐసీసీ ప్రపంచ కప్ సందర్భంగా... భారత మ్యాచులకు అడ్డ పడొద్దు వరుణుడా..!? అని సగటు అభిమానులు ప్రార్థించడం సర్వ సాధారణం. కానీ, బీమా కంపెనీలు కూడా ఇప్పుడు ఇదే కోరుకుంటున్నాయి. ఎందుకంటే వర్షం కారణంగా భారత మ్యాచులు రద్దయితే బీమా కంపెనీలు పరిహారం రూపంలో రూ.100 కోట్ల వరకు చెల్లించాల్సి వస్తుంది. సెమీ ఫైనల్స్‌కు ముందు భారత్ మరో నాలుగు మ్యాచుల్లో తలపడాల్సి ఉంది. ఈ నాలుగు కూడా వర్షం కారణంగా రద్దు కావన్న ఆశలతో బీమా కంపెనీలు ఉన్నాయి. తొలి దశలో ఇప్పటికే భారత్, న్యూజిలాండ్‌తో మ్యాచ్‌ను వర్షం కారణంగా కోల్పోవాల్సి వచ్చిన విషయం గమనార్హం. ప్రస్తుత ఐసీసీ ప్రపంచ కప్‌లో భాగంగా ఇప్పటి వరకు నాలుగు మ్యాచ్‌లకు వర్షం అడ్డుతగిలింది. క్రికెట్ మ్యాచ్‌లకు సంబంధించి మన దేశంలో రూ.150 కోట్ల బీమా మార్కెట్ ఉంటుందని పరిశ్రమ వర్గాల సమాచారం. న్యూ ఇండియా అష్యూరెన్స్, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్, ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్, ఓరియంటల్ ఇన్సూరెన్స్ సాధారణంగా ఈ తరహా బీమా పాలసీలను ఎక్కువగా విక్రయిస్తున్నాయి. క్లెయిమ్స్ ఎదురైతే వీటిపైనే ఎక్కువ భారం పడుతుంది.

**భారత్-పాక్ మ్యాచ్‌కు రూ.50కోట్లు**

భారీగా వెచ్చించి ఐసీసీ క్రికెట్ మ్యాచుల ప్రసార హక్కులను కొనుగోలు చేసిన ప్రసార మాధ్యమాలు సాధారణంగా క్రికెట్ మ్యాచులు రద్దయితే తలెత్తే నష్టాలను భర్తీ చేసుకునేందుకు ఈ పాలసీలను తీసుకుంటుంటాయి. దీంతో వర్షం వల్ల మ్యాచ్ రద్దయినా, వర్షం కారణంగా అవరోధం ఏర్పడి మ్యాచ్‌ను కుదించడం వల్ల ప్రకటనల ఆదాయం నష్టపోవడం జరిగినా పరిహారం పొందొచ్చు. మ్యాచ్ యథావిధిగా జరిగితే బీమా కంపెనీలు ఊపిరిపీల్చుకున్నట్టే. భారత్-పాకిస్తాన్ మ్యాచ్‌పై ఏకంగా రూ.50 కోట్ల బీమా తీసుకోవడం దీనికున్న ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది. పరిశ్రమ వర్గాల సమాచారం మేరకు... ఒక్కో మ్యాచ్ ప్రసార సమయంలో ప్రకటనలపై రూ.5-50 కోట్ల వరకు ఆదాయం లభిస్తుంది. అదే ఫైనల్స్, సెమీ ఫైనల్స్ వంటి ప్రత్యేక మ్యాచుల్లో ఈ ఆదాయం రూ.70-80 కోట్ల వరకు ఉంటుంది.

# అంతర్జాతీయ అంశాలే దిక్సూచి..!

- ఎఫ్ అండ్ ఓ ముగింపు నేపథ్యంలో ఒడిదుడుకులకు ఆస్కారం
- ఇరాన్‌పై యుద్ధం విషయంలో వెనక్కి తగ్గిన అమెరికా
- జపాన్‌లో జరిగే జీ-20 శిఖరాగ్ర సమావేశాలపై ఇన్వెస్టర్లు దృష్టి



**న్యూఢిల్లీ:** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు యుద్ధానికి దారి తీస్తాయని గతవారంలో మార్కెట్ వర్గాలు ఆందోళన చెందగా.. వారాంతాన అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ విషయంపై వెనక్కి తగ్గినట్లు ప్రకటించి ఊరటనిచ్చారు. అయితే, ఇప్పటికీ ఇరుదేశాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయిలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ అంశంపై ప్రధానంగా దృష్టిసారించాల్సిన అవసరం ఉందని దలాల్ స్ట్రీట్ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు, ఈ నెల 28-29 తేదీల్లో జపాన్‌లోని ఒసాకాలో జీ-20 శిఖరాగ్ర సమావేశాలు జరగనుండగా.. ఈ సదస్సులో పాల్గొనే పలు దేశాలతో ప్రధాని మోదీ ద్వైపాక్షిక, త్రైపాక్షిక చర్చలు జరిపే అవకాశముందని మార్కెట్ పండితులు భావిస్తున్నాయి. అమెరికా-చైనా వాణిజ్య చర్చలకు ఈ సమావేశం వేదిక కానుందనే అంచనాలు వెల్లడవుతున్నాయి. ఇక బడ్జెట్ విధానాలపై ఊహాగానాలు, అంతర్జాతీయ అంశాలే ఈవారంలో మార్కెట్‌కు దిశానిర్దేశం చేయనున్నాయని సామ్కో సెక్యూరిటీస్ సీఈఓ జిమీత్ మోడీ అన్నారు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య చర్చలు ఈవారంలో ప్రధాన అంశాలుగా ఉన్నాయని రెలిగేర్ రిటైల్ డిస్ట్రిబ్యూషన్ ప్రెసిడెంట్ జయంత్ మంగ్లిక్ పేర్కొన్నారు. వీటితో పాటు ముడిచమురు ధరల కదలికలు, రుతుపవనాలు మార్కెట్‌ను ప్రభావితం చేయనున్నటువంటి దేశీ అంశాలని కొటక్ సెక్యూరిటీస్ విశ్లేషకులు సంజీవ్ అన్నారు.

**ఒడిదుడుకులకు ఆస్కారం..**

జూన్ సిరీస్ డెరివేటివ్ పొజిషన్లు గురువారం ముగియనుండగా.. జూలై సిరీస్‌కు రోల్ ఓవర్లు జరిగే క్రమంలో ఈవారంలో అధికస్థాయి ఒడిదుడుకులకు ఆస్కారం ఉంది. ఆప్షన్ డేటా ప్రకారం తక్షణ ట్రేడింగ్ రేంజ్ 11,600 నుంచి 11,900 రేంజ్‌లో ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. 'నిఫ్టీ 2018లో నమోదుచేసిన 11,750 స్థాయిలో కన్సాలిడేట్ అవుతోంది. జూన్ ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్(ఎఫ్ అండ్ ఓ) ముగింపు వరకు ఇది కొనసాగేందుకు అవకాశం ఉంది. అవుట్ ఆఫ్ ది మనీ (ఓటీఎం) కాల్, పుట్ ఆప్షన్ రైటింగ్ ఆధారంగా ఈస్థాయిలోనే కదలాడేందుకు అవకాశం ఉంది' అని ఐసీఐసీఐ డైరెక్ట్ విశ్లేషకులు అమిత్ గుప్తా విశ్లేషించారు.

**ముడిచమురు ధరల ప్రభావం..**

అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం కారణంగా గతవారంలో బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ 5 శాతం ర్యాలీ చేసి 65 డాలర్లకు చేరుకుంది. అయితే, ప్రస్తుతానికి అమెరికా వెనక్కి తగ్గిన నేపథ్యంలో ఈవారంలో ధరలు కాస్త చల్లబడే సూచనలు కనిపిస్తున్నాయని కమోడిటీ మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ఏడాది చివరివరకు ఒపెక్ ఉత్పత్తి కోతకే ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉందని ఆనంద్ రాఠీ స్టాక్ బ్రోకర్స్ విశ్లేషకులు రుషాబ్ మేరు అన్నారు.

### స్థూల ఆర్థిక అంశాలపై దృష్టి

మేనెల ఆర్థిక లోటు, మౌలిక సదుపాయాల ఉత్పత్తి డేటా శుక్రవారం విడుదల కానున్నాయి. అంతర్జాతీయ ఆర్థిక అంశాల్లో.. బ్యాంక్ ఆఫ్ జపాన్ తన ద్రవ్య విధాన సమావేశ మినిట్స్‌ను వెల్లడించనుంది.

### కొనసాగుతున్న విదేశీ నిధుల వెల్లువ

భారత్ క్యాపిటల్ మార్కెట్లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పీఐ) పెట్టుబడుల పరంపర కొనసాగుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి నికర కొనుగోలుదారులుగా నిలుస్తున్న వీరు.. ఈనెల్లో ఇప్పటివరకు రూ.10,312 కోట్లను పెట్టుబడిపెట్టారు. జూన్ 3-21 కాలంలో ఈక్విటీ మార్కెట్‌లో రూ.552 కోట్లు, డెట్ మార్కెట్‌లో రూ.9,761 కోట్లను పెట్టుబడిపెట్టినట్లు డిపాజిటరీ డేటా ద్వారా వెల్లడయింది.

### 82,619 కోట్లకు పీ-నోట్స్ పెట్టుబడులు

దేశీయ క్యాపిటల్ మార్కెట్‌లోకి పీ-నోట్లు (పార్టిసిపేటరీ నోట్స్) ద్వారా వచ్చే పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. మే నెల చివరినాటికి 1,400 పెరిగి 1.72 శాతం వృద్ధిని నమోదుచేశాయి. అంతకుముందు ఏప్రిల్ నెల చివరినాటికి ఈ తరహా పెట్టుబడులు రూ.81,220 కోట్లు కాగా, మే నెల చివరినాటికి రూ.82,619 కోట్లకు చేరినట్లు సెబీ తాజా సమాచారంలో వెల్లడయింది.

## 'కియా' చౌకధర ఎలక్ట్రిక్ వాహనాలు..!

**హ్యుందాయ్‌తో కలిసి వాహన ఉత్పత్తి**

**న్యూఢిల్లీ:** అతి తక్కువ ధరలతో ఎలక్ట్రిక్ వాహనాలను భారత మార్కెట్‌కు అందించాలని భావిస్తున్నట్లు దక్షిణ కొరియా సంస్థ కియా మోటార్స్ ప్రకటించింది. ఇందుకోసం హ్యుందాయ్ మోటార్స్‌తో కలిసి ప్రత్యేక ప్రాజెక్టును ఏర్పాటుచేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపింది. ఈ అంశంపై సంస్థ ప్రెసిడెంట్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ హాన్-వూ పార్క్ మాట్లాడుతూ.. 'తక్కువ ధరతో ఎలక్ట్రిక్ వాహనాలను ఇక్కడి మార్కెట్లో ప్రవేశపెట్టాలనే అంశంపై దృష్టిసారించాం. భారత ప్రభుత్వ మద్దతు విధానం, మౌలిక సదుపాయాల అంశాల ఆధారంగా తుది నిర్ణయాన్ని తీసుకుంటాం' అని అన్నారు. ఇక అంతర్జాతీయ మార్కెట్లో ఈ సంస్థ ఇప్పటికే హైబ్రిడ్, ప్లగ్-ఇన్-హైబ్రిడ్, ఎలక్ట్రిక్ వెహికల్, ఫ్యూయల్ సెల్ వాహనాలను విక్రయిస్తోంది.



## కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 24-6-2019

| | |
|---|---|
| విశాఖ | 430-00 |
| చిత్తూరు | 463-00 |
| వరంగల్ | 463-00 |
| చెన్నై | 470-00 |
| ముంబై | 472-00 |
| విజయవాడ | 420-00 |
| నమక్కల్ | 455-00 |
| గోదావరి | 420-00 |
| 23-6-2019 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 415-00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 4.75 |
| బెంగళూరు | 445-00 |
| ఢిల్లీ | 388-00 |
| కోల్‌కతా | 444-00 |

# జెట్ ఎయిర్‌వేస్ దివాలా ప్రక్రియ ప్రారంభం

**90 రోజుల్లో రిజల్యూషన్ ప్రణాళిక ● తదుపరి విచారణ జూలై 5న**

**న్యూఢిల్లీ:** రుణభారంతో కుదేలైన జెట్ ఎయిర్‌వేస్‌పై దివాలా ప్రక్రియ ప్రారంభమైంది. ఈ కంపెనీకి రుణాలిచ్చిన 26 సంస్థల తరపున స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎన్‌సీఎల్‌టీ(నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్)లో జెట్ ఎయిర్‌వేస్‌పై దివాలా ప్రక్రియ కోసం పిటిషన్ దాఖలు చేసింది.ఎన్‌సీఎల్‌టీ ముంబై ధర్మాసనం ఈ పిటిషన్‌ను ఈ నెల 20న స్వీకరించింది. 2016 నాటి ఇన్‌సాల్వెన్సీ బ్యాంక్రప్సీ చట్టం ప్రకారం తమ కంపెనీపై కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రాసెస్(సీఐఆర్‌పీ) ఆరంభమైందని జెట్ ఎయిర్‌వేస్ పేర్కొంది. దివాలా ప్రక్రియ ప్రారంభమవడంతో తమ కంపెనీ డైరెక్టర్ల బోర్డ్ అధికారాలన్నీ సస్పెండ్ అవుతాయని, ఇంటెరిమ్ రిజల్యూషన్ ప్రొఫెషనల్(ఐఆర్‌పీ) బోర్డ్ అధికారాలు నిర్వహిస్తారని వివరించింది.



**రెండు వారాల పురోగతి నివేదిక**

భారత్‌లో దివాలా ప్రక్రియకు చేరిన తొలి విమానయాన సంస్థగా జెట్ ఎయిర్‌వేస్ నిలిచింది. ఐఆర్‌పీగా నియమితులైన ఆశీష్ చౌచారియా 90 రోజుల్లో రిజల్యూషన్ ప్రణాళికను అందజేయాలని ఎన్‌సీఎల్‌టీ ముంబై ధర్మాసనం ఆదేశించింది. సాధారణంగా రిజల్యూషన్ ప్రణాళికకు 180 రోజుల గడువు ఇస్తారు. అయితే జాతీయ ప్రాముఖ్యత గల అంశం కాబట్టి త్వరితంగా దీనిని ఒక కొలిక్కి తెచ్చే ఉద్దేశంతో 90 రోజుల గడువునే నిర్దేశించారు. జెట్ ఎయిర్‌వేస్ దివాలాపై తదుపరి విచారణ వచ్చే నెల 5న జరగనున్నది. అదే తేదీన రెండు వారాల పురోగతి నివేదికను ఐఆర్‌పీ సమర్పించాలని కూడా ముంబై ధర్మాసనం ఆదేశించింది. బ్యాంక్‌లు, ఇతర ఆర్థిక సంస్థలకు జెట్ ఎయిర్‌వేస్ కంపెనీ రూ.8,000 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఉద్యోగులకు, ఇతర రుణదాతలకు, వెండార్లకు కలిపి మొత్తం వేల కోట్ల లోనే బకాయిలున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 17 నుంచి ఈ కంపెనీ కార్యకలాపాలు నిలిపేసింది.

## సాక్షి వ్యూ

### బజాజ్ ఆటో | బ్రోకరేజ్ సంస్థ: అరిహంత్ క్యాపిటల్ | కొనొచ్చు

**ప్రస్తుత ధర:** రూ.2,873 **టార్గెట్ ధర:** రూ.3,631

**ఎందుకంటే:** పరిస్థితులు అంతంతమాత్రంగానే ఉన్నప్పటికీ, బజాజ్ ఆటో కంపెనీ గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసిక కాలంలో చెప్పుకోదగ్గ ఆర్థిక ఫలితాలే సాధించింది. ఎగుమతుల దన్నుతో కంపెనీ నికర అమ్మకాలు 9 శాతం వృద్ధితో రూ.7,450 కోట్లకు చేరాయి. సీటీ100, ప్లాటినా బైక్ ధరల సవరణ కొనసాగుతుండటంతో స్థూల మార్జిన్లు 3 శాతమే వృద్ధి చెంది 28.4 శాతానికి చేరాయి. ఇతర వ్యయాలు 16 శాతం, సిబ్బంది వ్యయాలు 17 శాతం పెరగడంతో నిర్వహణ లాభ మార్జిన్ 4 శాతం తగ్గి 16.5 శాతానికి చేరింది. నికర లాభం 11 శాతం పతనమై రూ.960 కోట్లకు తగ్గింది.. ఇక పూర్తి ఆర్థిక సంవత్సరం పరంగా చూస్తే, నికర అమ్మకాలు 24 శాతం వృద్ధితో రూ.30,500 కోట్లకు పెరిగాయి. నిర్వహణ లాభం 24 శాతం పెరిగి రూ.5,270 కోట్లకు చేరింది. నిర్వహణ లాభ మార్జిన్ 17.3 శాతానికే పరిమితమైంది. నికర లాభం 31 శాతం ఎగసి రూ.4,300 కోట్లకు చేరింది. ఎంట్రీ లెవల్ బైక్‌ల మార్కెట్లో తమ మార్కెట్ వాటా మరింతగా పెరగగలదని ఈ కంపెనీ ధీమాగా ఉంది. వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి బీఎస్ సిక్స్ నిబంధనలు అమల్లోకి రానుండటం, భద్రత పరమైన కఠినమైన నిర్ణయాల కారణంగా దేశీయంగా టూ-వీలర్ల అమ్మకాలు ఒకింత తగ్గవచ్చు. అయితే ఎగుమతులు పుంజుకునే అవకాశాలు కంపెనీకి కలిసివచ్చే అంశం. రెండేళ్లలో ఆదాయం 10 శాతం, నిర్వహణ లాభం 11 శాతం, నికర లాభం 14 శాతం చొప్పున చక్రగతిన వృద్ధి చెందతాయని అంచనా.

### లుపిన్ | బ్రోకరేజ్ సంస్థ: ఐసీఐసీఐ డైరెక్ట్ | కొనొచ్చు

**ప్రస్తుత ధర:** రూ.712 **టార్గెట్ ధర:** రూ.810

**ఎందుకంటే:** ఈ ఫార్మా కంపెనీ గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసిక కాలం ఆర్థిక ఫలితాలు అంచనాలను మించాయి. అమెరికా వ్యాపారం 16% వృద్ధితో రూ.1,741 కోట్లకు పుంజుకోవడంతో ఆదాయం 9% వృద్ధితో రూ.4,406 కోట్లకు పెరిగింది. నిర్వహణ లాభ మార్జిన్ 2% పెరిగి 20%కి చేరింది. నిర్వహణ లాభం 23 శాతం వృద్ధితో రూ.874 కోట్లకు పెరిగింది. నికర లాభం మాత్రం 20 శాతం తగ్గి రూ.288 కోట్లకు పరిమితమైంది. నికర లాభంలో మినహా మిగిలిన అన్ని అంశాల్లో ఈ కంపెనీ ఫలితాలు అంచనాలను మించాయి. మొత్తం ఆదాయంలో 38 శాతం వాటా ఉన్న అమెరికా వ్యాపారం సమస్యలతో సతమతమవుతోంది. ధరల ఒత్తిడి, ఇటీవలే గోవా, ఇండోర్ ప్లాంట్లకు యూఎస్‌ఎఫ్‌డీఏ నుంచి హెచ్చరిక లేఖలు అందడం వంటి సమస్యలు ప్రభావం చూపుతున్నాయి. ఈ సమస్యలను అధిగమించడం కోసం బ్రాండెడ్ ఉత్పత్తులతో పాటు బయోసిమిలర్లు, ఇంజెక్టబుల్ వంటి కాంప్లెక్స్ జనరిక్స్‌పై కంపెనీ దృష్టి సారిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 20కు పైగా కొత్త ఔషధాలను అమెరికా మార్కెట్లోకి అందించనున్నది. కొత్త ఔషధాలను మార్కెట్లోకి తేవడం ద్వారా అమెరికా అమ్మకాలు రెండేళ్లలో 12% వృద్ధితో రూ.6,964 కోట్లకు పెరుగుతాయని అంచనా.

**గమనిక:** ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

## ప్రభుత్వ మైనింగ్ కంపెనీలను ప్రైవేట్‌పరం చేయండి

- బ్యాంక్‌లకు, పీఎస్‌యూలకు మరింత స్వయంప్రతిపత్తి
- ప్రధానికి వేదాంత అనిల్ అగర్వాల్ సూచన



**న్యూఢిల్లీ:** ఎన్‌ఎమ్‌డీసీతో సహా మరో ఐదు ప్రభుత్వ రంగ మైనింగ్ కంపెనీలను ప్రైవేట్‌పరం చేయాలని వేదాంత చైర్మన్ అనిల్ అగర్వాల్ ప్రధాని నరేంద్ర మోదీకి సూచించారు. హిందుస్తాన్ జింక్, హిందుస్తాన్ కాపర్, కోలార్ గోల్డ్, యురేనియమ్ -కార్పొరేషన్, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కంపెనీల్లో వాటాలను కేంద్రం పూర్తిగా విక్రయించాలని పేర్కొన్నారు. ముందస్తు బడ్జెట్ సమావేశంలో భాగంగా శనివారం ప్రధానితో ఆర్థిక వేత్తలు, పారిశ్రామికవేత్తలు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి హాజరైన అనిల్ అగర్వాల్ పలు సూచనలు చేశారు. ఉద్యోగ కోతలు లేకుండా ప్రైవేటీకరణ జరపడం వల్ల ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందని, సామర్థ్యం పెరుగుతుందని, దేశీయంగా ఉత్పత్తి పెరుగుతుందని అనిల్ పేర్కొన్నారు. ఇంకా ఈ సమావేశానికి టాటా గ్రూప్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్, ఐటీసీ చైర్మన్ సంజీవ్ పురి కూడా పాల్గొన్నారు.

**దిగుమతుల బిల్లు లక్ష కోట్ల డాలర్లకు...!**

ప్రస్తుతం భారత దిగుమతుల బిల్లు 40,000 కోట్ల డాలర్లుగా ఉందని అనిల్ పేర్కొన్నారు. ఆయిల్, గ్యాస్, మినరల్స్, పుత్తడి వంటి లోహాల్లో ఉత్పత్తిని పెంచుకోలేకపోతే ఈ బిల్లు త్వరలోనే లక్ష కోట్ల డాలర్లకు చేరగలదని వివరించారు. చమురు ఉత్పత్తిని రెట్టింపు చేయడం, పుత్తడి ఉత్పత్తిని 300 టన్నులకు చేరడం జరిగితే ప్రస్తుతమున్న కరెంట్ అకౌంట్ లోటు(క్యాడ్) పూర్తిగా తుడిచిపెట్టుకుపోతుందని పేర్కొన్నారు.

**పీఎస్‌యూ అధికారులు మరింత సాధికారత**

ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంక్‌ల్లో ప్రభుత్వ వాటాను 50 శాతం లోపు తగ్గించి, స్వయం ప్రతిపత్తిని ఇవ్వాలని అనిల్ అగర్వాల్ సూచించారు. ఇలా చేస్తే, వాటి పనితీరు మూడు రెట్లు పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో మంచి ప్రతిభ గల అధికారులున్నారని, భవిష్యత్తులో విచారణలు జరుగుతాయనే భయాలతో వారు నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని, నిర్ణయాలు తీసుకునేలా వారికి సాధికారత కల్పించాలని సూచించారు. బొగ్గు, బాక్సైట్, రాగి, ఇనుప ఖనిజాలకు సంబంధించిన మైనింగ్ బ్లాక్‌లకు తక్షణం వేలం నిర్వహించాలని కోరారు. ప్రస్తుతం గోవా, కర్నాటకల్లో మైనింగ్‌పై ఆంక్షలు ఉన్నాయని, ఈ ఆంక్షలు ఉండకుండా చూడాలని సూచించారు. మైనింగ్ కార్యకలాపాలు పెరిగితే ఆర్థిక వ్యవస్థకు 50000 కోట్ల డాలర్ల సంపద జత అవుతుందని, రెండు కోట్ల ఉద్యోగాలు వస్తాయని వివరించారు.

## అమెరికాలో ఇన్ఫీ 9,100 ఉద్యోగాలు

**న్యూఢిల్లీ:** దేశీ ఐటీ సేవల దిగ్గజం ఇన్ఫోసిస్.. అమెరికాలో భారీ స్థాయి నియామకాలను పూర్తిచేసినట్లు ప్రకటించింది. ఏప్రిల్ 2017 నుంచి ఈ ఏడాది మార్చి వరకు 9,100 మందిని తమ కంపెనీలోకి తీసుకున్నట్లు వెల్లడించింది. రెండేళ్లలో 10,000 మంది అమెరికన్లను నియమించుకోవాలనే లక్ష్యానికి దాదాపుగా చేరువైనట్లు తెలిపింది. బిజినెస్ మోడల్‌ను బలోపేతం చేయడంలో భాగంగా ఈ మేరకు నియామకాలు పూర్తిచేసినట్లు సంస్థ సీఓఓ యూబీ ప్రవీణ్ రావ్ అన్నారు. వీసాపై ఆధారపడడాన్ని తగ్గించడం కోసం 2017లో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో తెలిపారు.

# ఫండ్స్‌తో లాభాలు వస్తాయా?

**Q & A**



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



**మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తే, లాభాలు వస్తాయా? పదేళ్లపాటు ఇన్వెస్ట్ చేస్తే, కనీసం బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ కంటే ఎక్కువ వడ్డీనే వస్తుందా ?**
*-పల్లవి, విశాఖపట్టణం*

నాకు తెలిసినంత వరకూ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తే, మంచి రాబడులే పొందవచ్చు. ఏదైనా ఒక ఈక్విటీ మ్యూచువల్ ఫండ్‌లో సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్) విధానంలో ఇన్వెస్ట్ చేస్తే, మంచి లాభాలే ఆర్జించవచ్చు. రిటైర్మెంట్ నిధి ఏర్పాటు చేసుకోవడం, సొంత ఇల్లు కట్టుకోవడం, పిల్లల పై చదువుల కోసం డబ్బులు కూడబెట్టడం... ఇవన్నీ దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలు. ఈ లక్ష్యాల సాధన కోసం చాలా మంది తమ సంపాదనలో కొంత భాగాన్ని పొదుపు చేస్తూ ఉంటారు. ఇలా పొదుపు చేసే మొత్తాన్నే సిప్‌ల ద్వారా మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తే, ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొనే రాబడులను పొందవచ్చు. మీరు ఉద్యోగి అయితే మీకు ఇంక్రిమెంట్ వచ్చినప్పుడల్లా, ఆ మేరకు సిప్ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను పెంచండి. కనీసం పదేళ్లపాటు క్రమం తప్పకుండా సిప్‌ల్లో ఇన్వెస్ట్ చేయడం, కనీసం ఏడాదికొక్కసారైనా సిప్ మొత్తాన్ని పెంచడం వంటి చర్యలు చేపడితే, మీరు చెప్పుకోదగ్గ స్థాయిలోనే సంపదను సమకూర్చుకోగలుగుతారు. మీరు ఇన్వెస్ట్ చేసే ఈక్విటీ ఫండ్ అంతంత మాత్రం పనితీరు కనబరిచినా సరే, మీరు మంచి రాబడులు పొందగలరు.

**నేను ఇటీవలనే ఉద్యోగంలో చేరాను. నేను రిటైర్ కావడానికి మరో 30 ఏళ్ల సమయం ఉంది. రిటైర్మెంట్ నిధి కోసం ఇప్పటినుంచే ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నాను. ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్న మొత్తాన్ని పూర్తిగా షేర్లలోనే పెట్టాలనుకుంటున్నాను. ఇది సరైన నిర్ణయమేనా ?**
*-సికిందర్, హైదరాబాద్*

ఒక విధంగా చెప్పాలంటే మీది సరైన నిర్ణయమే. అయితే స్టాక్ మార్కెట్లో ఒడిదుడుకులు తీవ్రంగా ఉంటాయి. ఒక విధంగా చెప్పాలంటే, స్టాక్ మార్కెట్...రోలర్ కోస్టర్ రైడ్ లాంటిది. మార్కెట్ పెరుగుతున్నప్పుడు మనకు ఎక్కడా లేని ఉత్సాహం వస్తూ ఉంటుంది. మార్కెట్ పడిపోతున్నప్పుడు నిరాశ, నిస్పృహలు ఆవరిస్తూ ఉంటాయి. అందుకని స్టాక్ మార్కెట్ ఇచ్చే ఇలాంటి షాక్‌లను తట్టుకోవడానికి కొంత మొత్తాన్ని స్థిరమైన ఆదాయం ఇచ్చే సాధనాల్లో ఇన్వెస్ట్ చేయాలి. రిటైర్మెంట్ నిధి ఏర్పాటు వంటి దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాల సాధన కోసం ఇన్వెస్ట్ చేసే పోర్ట్‌ఫోలియోలో కూడా కనీసం 10-20 శాతం మేర మొత్తాన్ని ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తే మంచిది. ఇలా చేయడం వల్ల అవసరమైన సందర్భాల్లో మీ పోర్ట్‌ఫోలియోను రీబ్యాలన్స్ చేసుకునే అవకాశం లభిస్తుంది. ఉదాహరణకు మీరు మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌లో 80 శాతం ఈక్విటీలో, మరో 20 శాతం ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేశారనుకుందాం. మార్కెట్ బాగా పడిపోయిన సందర్భాల్లో మీ ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్ విలువ తగ్గుతుంది. అప్పుడు ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసే మొత్తంలో కొంత భాగాన్ని ఈక్విటీలోకి మళ్లించవచ్చు. మార్కెట్ తక్కువలో ఉంటుంది కాబట్టి ఎక్కువ షేర్లు పొందవచ్చు. మార్కెట్ బాగా పెరుగుతున్నప్పుడు ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్ తగ్గించుకోవడమో, అదే స్థాయిలో కొనసాగించడమో చేయవచ్చు. స్టాక్ మార్కెట్లో వచ్చే ఆటు పోట్లను తట్టుకునేలా మీ పోర్ట్‌ఫోలియోను తీర్చిదిద్దుకోవాలి. అయితే వరుసగా 30 ఏళ్లపాటు మార్కెట్లో ఎలాంటి ఒడిదుడుకులు వచ్చినా, తట్టుకోగలిగి ఉండేటట్లయితే, వంద శాతం ఈక్విటీలో ఇన్వెస్ట్ చేయడం సరైనదే.

**నా వయస్సు 33 సంవత్సరాలు. నాకు నిలకడైన ఆదాయ మార్గాలే ఉన్నాయి. నేను ఒక మోస్తరు నుంచి అధిక నష్టభయాన్ని భరించగలను. నెలకు రూ.30,000 వరకూ ఇన్వెస్ట్ చేద్దామనుకుంటున్నాను. తగిన సూచనలివ్వండి.**
*-ఆంటోని, హైదరాబాద్*

నష్ట భయం అనేది పరిస్థితులను బట్టి మారుతూ ఉంటుంది. ఉదాహరణకు స్టాక్ మార్కెట్ పెరుగుతున్నప్పుడు, ఎంత రిస్కయినా భరించవచ్చులే అని అనిపిస్తూ ఉంటుంది. అదే మార్కెట్ పతనమవుతున్నప్పుడు, స్వల్ప నష్టభయాన్ని కూడా భరించలేం అని అనిపిస్తూ ఉంటుంది. ఇక మీ విషయానికొస్తే, నష్టభయం కంటే కూడా రెండు ముఖ్యమైన విషయాలను మీరు పరిగణనలోకి తీసుకోవాలి. మొదటిది మీరు ఎంతం కాలం పాటు ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నారు. అంటే పది అంతకు మించిన సంవత్సరాలు ఇన్వెస్ట్ చేసేటట్లయితే, అధిక నష్టభయాన్ని భరించవచ్చు. అప్పుడు నష్టభయం గురించి ఆలోచించాల్సిన అవసరమే లేదు. అదే మూడేళ్ల కాలానికే ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నారనుకోండి. అప్పుడు నష్టభయమే కీలకం అవుతుంది. అప్పుడు దీనినే దృష్టిలో పెట్టుకొని ఇన్వెస్ట్‌మెంట్ నిర్ణయాలు తీసుకోవాలి. రెండవది ఇన్వెస్ట్‌మెంట్ అనుభవాలు. మార్కెట్ సంబంధిత మీ సొంత ఇన్వెస్ట్‌మెంట్ అనుభవాలు కీలకం. ఇతర ఇన్వెస్టర్ల తప్పులు, ఇలాంటి కాలమ్స్‌లో వచ్చే వ్యాసాల వల్ల కంటే కూడా మీ సొంత ఇన్వెస్ట్‌మెంట్ అనుభవాల ఆధారంగా మీరు నేర్చుకునేదే ఎక్కువగా ఉంటుంది. ఇక మీరు నెలకు రూ.30,000 ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నారు. కాబట్టి ముందుగా హైబ్రిడ్ ఫండ్‌ను ఎంచుకోండి. దీనిలో నెలకు కొంత మొత్తం చొప్పున సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్) విధానంలో ఇన్వెస్ట్ చేయండి. ఫండ్ పనితీరు గురించి కనీసం ఏడాది పాటు పట్టించుకోవద్దు. పనితీరు ఎలా ఉన్నా ఈ ఫండ్‌లో రెండేళ్ల పాటు ఇన్వెస్ట్‌మెంట్స్ కొనసాగించండి. ఈ రెండేళ్ల కాలంలో మీకు మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్స్, ఫండ్స్ పనితీరు, మార్కెట్ గమనం తదితర అంశాల పట్ల ఒక అవగాహన వస్తుంది. అప్పుడు ఏదైనా ఒక మంచి ఈక్విటీ మ్యూచువల్ ఫండ్‌ను ఎంచుకోండి, దాంట్లో సిప్‌ల ద్వారా ఇన్వెస్ట్‌మెంట్స్ కొనసాగించండి.

# సెన్సెక్స్ నిరోధశ్రేణి 39,435-39,620 పాయింట్లు....

**మార్కెట్ పంచాంగం**

అమెరికా....వివిధ దేశాలతో జరుపుతున్న వాణిజ్య యుద్ధాలు, తాజాగా అమెరికా-ఇరాన్‌ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లు ఒడిదుడుకులకు లోనవుతున్నాయి. ఈ అంశానికి తోడు మన దగ్గర ఎన్‌బీఎఫ్‌సీల లిక్విడిటీ సంక్షోభం, కార్పొరేట్ డిఫాల్టులు, కార్పొరేట్ దుర్వినియోగాలతో దేశీయ సూచీలు గరిష్ట స్థాయిల వద్ద అమ్మకాల ఒత్తిడికి లోనవుతున్నాయి. కానీ, మరో రెండు వారాల్లో కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలు పార్లమెంట్ ముందుకు రానున్న నేపథ్యంలో బడ్జెట్ ర్యాలీకి బీజం పడుతుందో ? లేక అంతర్జాతీయ, దేశీయ ప్రతికూలాంశాలకు మార్కెట్ తలొగ్గుతుందో ?... చూడాల్సి ఉంది. ఇక సూచీల సాంకేతికాంశాల విషయానికొస్తే...

**సెన్సెక్స్ సాంకేతికాంశాలు...**




జూన్ 21తో ముగిసిన వారంలో 800 పాయింట్ల శ్రేణిలో హెచ్చుతగ్గులకు లోనైన బీఎస్‌ఈ సెన్సెక్స్ చివరకు అంత క్రితం వారంతో పోల్చితే, 258 పాయింట్ల నష్టంతో 39,194 పాయింట్ల వద్ద ముగిసింది. 14 ట్రేడింగ్ సెషన్ల నుంచి కేవలం 3.5 శాతం శ్రేణిలో ఒడిదుడుకులకు లోనవుతున్న సెన్సెక్స్ త్వరలో ఈ శ్రేణి నుంచి బయటపడే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఈ వారం సెన్సెక్స్‌కు తొలుత 38,825-38,570 పాయింట్ల శ్రేణి వద్ద మద్దతు లభిస్తున్నది. ఈ లోపున 38,000 పాయింట్ల వద్దకు పతనం కావచ్చు. ఈ స్థాయిని కూడా కోల్పోతే 37,415 పాయింట్ల స్థాయికి పడిపోవచ్చు. ఈ వారం తొలి మద్దతు స్థాయిని పరిరక్షించుకుంటే, 39,435-39,620 నిరోధశ్రేణి కీలకం. అటుపై 40,060 పాయింట్ల స్థాయిని అందుకోవచ్చు. ఆపైన 40.320 పాయింట్ల వరకూ పెరగవచ్చు.

**నిఫ్టీ కీలక నిరోధశ్రేణి 11,805-11,845 పాయింట్లు....**




గత వారం 11,843-11,625పాయింట్ల శ్రేణిలో గరిష్ట, కనిష్ట స్థాయిల మధ్య హెచ్చుతగ్గులకు లోనైన ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ చివరకు అంత క్రితం వారంతో పోల్చితే 99 పాయింట్ల నష్టంతో 11,724 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ వారం నిఫ్టీకి 11,625-11,590 పాయింట్ల శ్రేణి వద్ద లభించబోయే మద్దతు స్థాయి కీలకం. ఈ స్థాయిని వదులుకుంటే 11,426 పాయింట్ల స్థాయికి పడిపోవచ్చు. ఈ స్థాయిని కూడా కోల్పోతే, 11,260 పాయింట్ల వద్దకు పతనం కావచ్చు. ఈ వారం తొలి మద్దతు స్థాయిని పరిరక్షించుకుంటే, 11,805-11,845 పాయింట్ల నిరోధశ్రేణి వద్దకు పెరగవచ్చు. అటుపైన 11,960పాయింట్ల స్థాయిని అందుకోవచ్చు. ఈ స్థాయి పైన ముగిస్తే, 12,100 పాయింట్లకు పెరగవచ్చు.

– పి. సత్యప్రసాద్

# ఏపీఎంఎస్ఐడీసీకి కమీషన్ల జబ్బు

- మౌలిక వైద్య సదుపాయాల అభివృద్ధి సంస్థలో విచ్చలవిడిగా అవినీతి
- కమీషన్ల బేరం కుదరక హిమోగ్లోబిన్ డిజిటల్ మీటర్ల సరఫరా నిలిపివేత
- గర్భిణులు, బాలింతలకు తీవ్ర ఇబ్బందులు

**సాక్షి, అమరావతి:** రాష్ట్ర మౌలిక వైద్య సదుపాయాల అభివృద్ధి సంస్థలో (ఏపీఎంఎస్ఐడీసీ) తవ్వేకొద్దీ అవినీతి వ్యవహారాలు బయట పడుతున్నాయి. మందుల కొనుగోలు నుంచి సివిల్ నిర్మాణాల వరకూ ఆన్‌లైన్ టెండర్లకు వేదికైన ఈ సంస్థలో గత నాలుగున్నరేళ్లలో ఎన్నో అక్రమాలు చోటు చేసుకున్నాయి. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతల్లో రక్తహీనతను గుర్తించి, చికిత్స అందించేందుకు ఎనీమియా స్క్రీనింగ్ యంత్రాల (హిమోగ్లోబిన్ డిజిటల్ మెషీన్లు) కొనుగోలుకు జాతీయ ఆరోగ్య మిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. కమీషన్లకు కక్కుర్తి పడిన ఏపీఎంఎస్ఐడీసీ గత ఆరు నెలలుగా 164 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు హిమోగ్లోబిన్ డిజిటల్ మీటర్లను సరఫరా చేయలేదు. గర్భిణులు, బాలింతలకు ఉపయోగపడే యంత్రాలను రాకుండా అడ్డుకున్నారంటే ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు ఎంత దారుణంగా వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

### 3,150 యంత్రాల కొనుగోలుకు టెండర్లు

రాష్ట్రంలో ఏటా 7.50 లక్షలకు పైగా ప్రసవాలు జరుగుతున్నాయి. గర్భిణుల్లో 60 శాతం మంది రక్తహీనత బాధితులే. పదేపదే సూదితో గుచ్చి రక్తం తీయడం వారికి ఇబ్బందికరంగా ఉంటుంది. అందుకే జాతీయ ఆరోగ్య మిషన్ ప్రాథమికంగా 164 పీహెచ్‌సీలకు అత్యాధునిక హిమోగ్లోబిన్ డిజిటల్ మీటర్లను సరఫరా చేయాలని నిర్ణయించింది. ఈ మెషీన్లు ఉంటే గర్భిణులు, బాలింతలకు సూది గుచ్చాల్సిన అవసరం ఉండదు. కనురెప్పలు తెరిచి, ఆ మెషీన్‌తో చూస్తే శరీరంలో ఎంతమేరకు రక్త శాతం ఉందో క్షణాల్లో తెలిసిపోతుంది. ఈ మెషీన్‌కు బ్లూటూత్ పరికరం ఉంటుంది. వైద్యుడు సుదూర ప్రాంతంలో ఉన్నా అతడి సెల్‌ఫోన్‌కు ఈ హిమోగ్లోబిన్ సమాచారాన్ని పంపించి, సలహాలు సూచనలు పొందవచ్చు. మొత్తం 3,150 మెషీన్ల కొనుగోలుకు ఏపీఎంఎస్ఐడీసీ 2018 అక్టోబర్ 9న టెండర్లు పిలిచింది. సాంకేతిక, ఆర్థిక బిడ్‌ల పరిశీలన తరువాత డెమో కూడా పూర్తయ్యింది. బయోసైన్స్ అనే సంస్థ ఒక్కో మెషీన్‌ను రూ.21 వేలకు కోట్ చేసి, టెండర్లలో ఎల్1గా నిలిచింది. ఎల్2గా నిలిచిన మాసిమో అనే సంస్థ ఒక్కో యంత్రానికి రూ.80 వేలు కోట్ చేసింది. దీంతో ఎల్1గా తేలిన బయోసైన్స్ సంస్థకు టెండర్ అప్పగించాల్సిన ఏపీఎంఎస్ఐడీసీ ఆ పని చేయలేదు. కమీషన్ల బేరం కుదరకపోవడమే ఇందుకు కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారుల అవినీతి వల్ల 2019 జనవరి నుంచి ఇప్పటివరకూ ఆ మెషీన్లు సరఫరా కాలేదు.



హిమోగ్లోబిన్ డిజిటల్ మీటర్

### బయోసైన్స్‌కు ప్రొడక్ట్ లైసెన్స్ లేదు

''హిమోగ్లోబిన్ డిజిటల్ మీటర్ల కొనుగోళ్లకు సంబంధించి టెండర్లలో ఎల్1గా తేలిన బయోసైన్స్ సంస్థకు ప్రొడక్ట్ లైసెన్స్ లేదని మాసిమో సంస్థ ఫిర్యాదు చేసింది. దీనిపై వెరిఫికేషన్ చేశాం. ఫైల్‌ను ఉన్నతాధికారులకు పంపించాం. ఈ టెండర్ల ప్రక్రియ నుంచి తప్పుకున్నాం. టెండర్ రద్దయ్యింది''

– సీహెచ్ గోపీనాథ్, ఎండీ, ఏపీఎంఎస్ఐడీసీ

# లైసెన్స్‌డ్ సర్వేయర్లను 'అసిస్టెంట్లు'గా నియమించాలి

**నవ్యాంధ్రప్రదేశ్ లైసెన్స్‌డ్ సర్వేయర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి**

**గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్):** రాష్ట్రంలో పని చేస్తున్న లైసెన్స్‌డ్ సర్వేయర్లను అసిస్టెంట్ సర్వేయర్లుగా నియమించాలని ప్రభుత్వానికి నవ్యాంధ్రప్రదేశ్ లైసెన్స్‌డ్ సర్వేయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య విజ్ఞప్తి చేశారు. వీరికి జూనియర్ అసిస్టెంట్ స్కేల్ వర్తింపజేయాలన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన లైసెన్స్‌డ్ సర్వేయర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ.. 2004లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సర్వేయర్ల కొరతను అధిగమించేందుకు లైసెన్స్‌డ్ సర్వేయర్ల వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. ఈటీఎస్, డీజీపీఎస్, ల్యాండ్ సర్వేయింగ్ విధానంలో శిక్షణ ఇచ్చి జాయింట్ కలెక్టర్ ఉత్తర్వులతో మండలాల్లో లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా నియమించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,405 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు పనిచేస్తున్నారని, గత ప్రభుత్వం లైసెన్స్‌డ్ సర్వేయర్లకు వేతనాలు చెల్లించకుండా వెట్టి చాకిరీ చేయించుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వం జీవో నంబర్ 800ను కొనసాగిస్తూ లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.




# భార్యను చంపి, ఉప్పు పాతరేసి..

- ఓ కసాయి భర్త దారుణం
- పశ్చిమగోదావరి జిల్లా పోలసానిపల్లిలో ఘటన

**భీమడోలు:** భార్యను హత్య చేసి.. శవాన్ని ఇంటి ఆవరణలోనే ఉప్పు పాతరేశాడో భర్త. పశ్చిమగోదావరి జిల్లా పోలసానిపల్లిలో నాలుగు రోజుల కిందట జరిగిన ఈ దారుణం ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. హత్య చేసిన విషయాన్ని నిందితుడు మద్యం మత్తులో నోరు జారడంతో ఆ నోటా ఈ నోటా గ్రామంలో వ్యాపించింది. దీంతో చేసేది లేక నిందితుడు పోలీసులకు లొంగిపోయాడు. అధికారులు పూడ్చిపెట్టిన మృతదేహాన్ని వెలికి తీశారు. పోలీసుల కథనం ప్రకారం.. పోలసానిపల్లి గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీ కోట శ్రీనివాసరావుకు పెదవేగి మండలం మొండూరులోని అక్క కూతురైన రామలక్ష్మితో 13 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. భార్యపై అనుమానంతో శ్రీనివాసరావు తరచూ గొడవలు పడుతూ వేధిస్తుండేవాడు. ఈ నెల 19వ తేదీ రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యపై బలవంతంగా శారీరక వాంఛ తీర్చుకునేందుకు ప్రయత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో గొంతు నులిమి చంపేశాడు. శవానికి దుప్పటి చుట్టి మంచం కింద దాచేశాడు. ఉదయాన్నే ఇద్దరు పిల్లలను మొండూరులో అత్తగారింట్లో వదిలి వచ్చాడు. ఆ తర్వాత ఇంటికి వచ్చి తన తమ్ముడు నాగరాజు, మరదలుకు పరిస్థితిని చెప్పాడు. వారి సహకారంతో తన ఇంటి ఆవరణలో నీటి ట్యాంకు నిర్మించేందుకని ఇద్దరు కూలీలతో ఏడు అడుగుల లోతు గోతిని తవ్వించాడు. అనంతరం మృతదేహాన్ని నిందితుడు శ్రీనివాసరావు గోతిలో పడేసి వాసన రాకుండా ఉప్పు పాతర వేశాడు. స్వతహాగా తాపీ మేస్త్రి కావడంతో రాళ్లు, బండలతో సిమెంట్ వేసి సమాధి కట్టేశాడు. గ్రామంలోని వారికి తన భార్య ఇల్లు వదిలి వెళ్లిపోయిందని ప్రచారం చేశాడు. రెండు రోజుల కిందట మద్యం మత్తులో భార్యను తానే చంపి పాతి పెట్టానని ఒకరిద్దరితో చెప్పాడు. అలా అందరికీ తెలిసిపోవడంతో నిందితుడు పోలీసులకు లొంగిపోయాడు. రెవెన్యూ అధికారుల సమక్షంలో గోతిలో పాతిపెట్టిన రామలక్ష్మి మృతదేహాన్ని వెలికితీసి పోస్ట్‌మార్టమ్ నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



మృతదేహం వెలికితీతను పరిశీలిస్తున్న ఎస్ఐ వీర్రాజు, ఆర్ఐ సౌజన్యరాణి (ఇన్ సెట్‌లో) కోట రామలక్ష్మి

# ఫిరాయింపులపై టీడీపీ మాట్లాడటం హాస్యాస్పదం

**కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి**



**సాక్షి, న్యూఢిల్లీ:** పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు టీడీపీకి లేదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ నుంచి 23 మంది ఎమ్మెల్యేలను, ముగ్గురు ఎంపీలను పార్టీలో చేర్చుకుని, వారిలో నలుగురిని మంత్రులను చేసి.. ఇప్పుడు ఫిరాయింపులపై మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆయన ఆదివారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. బీజేపీలో టీడీపీ రాజ్యసభా పక్షం విలీనంపై టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు సహా ఆ పార్టీ నేతలు కళా వెంకట్రావు తదితరులు అవగాహనారాహిత్యంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. షెడ్యూల్ 10లోని పేరా 4 ప్రకారం మెజారిటీ సభ్యుల తీర్మానం ప్రకారమే టీడీపీ రాజ్యసభాపక్షం బీజేపీలో విలీనమైందన్నారు. చట్టంలోని నిబంధనల ప్రకారమే విలీన తీర్మానం జరిగింది కాబట్టే రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు దాన్ని ఆమోదించారని వివరించారు. గతంలో ఎన్టీఆర్ టీడీపీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు చంద్రబాబు ఏ ప్రాతిపదికన ముఖ్యమంత్రి అయ్యారో మర్చిపోయారా.. అని ప్రశ్నించారు.




Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.